




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 271 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 8 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 271 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SAT 8 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

### చేనేత రంగానికి రూ.980 కోట్లు విడుదల: మంత్రి తుమ్మల

- పీపుల్స్ ప్లాజాలో వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన తుమ్మల
- రైతన్నకు, నేతన్నకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యతను ఇస్తోందని వెల్లడి
- 'నేతన్నకు భద్రత' కింద రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని అందిస్తున్నామన్న మంత్రి

- మిగతా 2లో




హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగం వైభవంగా జరగనుంది. ఎల్ నినో ప్రభావం నుంచి విముక్తి కలిగి, కృష్ణా-గోదావరి నదులతో పాటు రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపడుతున్నా రు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు 11 హోమకుండాలలో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. యాగ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ మహా వరుణ యాగాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ తెలిపారు.



## సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

- జాతీయ చేనేత దినోత్సవం వేళ రేవంత్‌కు కేటీఆర్ లేఖ
- నేతన్న బీమా, నేతన్నకు చేయూత వంటి కార్యక్రమాలను ఆపేశారని మండిపాటు
- రద్దు చేసిన సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్

- మిగతా 2లో

హైదరాబాద్ పెన్ పవర్:జాతీయ చేనేత దినోత్సవం వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక ధీమానిచ్చిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి గొప్ప పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి నేతన్నలను కోలుకోలేని దెబ్బతీసిందని తన లేఖలో ఆయన మండిపడ్డారు. బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫారాల తయారీ ఆర్డర్లను పక్కనబెట్టి, కమీషన్ల కోసం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన రూ.18 వేల ఆర్థిక సాయం, రూ.లక్ష వ్యక్తిగత రుణమాఫీ, 5 శాతం జీఎస్టీ



## జగిత్యాల జిల్లాలో గ్యాంగ్ రేప్..

### మహిళను డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలోకి తీసుకెళ్లి..

### నలుగురు యువకులు అత్యాచారం..

హైదరాబాద్ పెన్ పవర్: జగిత్యాల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మల్యాల మండలం నూకపల్లి శివారులోని డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలో ఇద్దరు వ్యక్తులు ఓ మహిళపై సామూహిక అత్యాచారం చేసి బాధితురాలిని వీడియో తీసి బెదిరింపులకు పాల్పడ్డారు.

- మిగతా 2లో

## జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరి పోరు

- తెలంగాణలో ఎవరితోనూ పొత్తులు ఉండవని స్పష్టం చేసిన రామచందర్ రావు
- రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై పోరాడాలని అధిష్ఠానం ఆదేశం
- మండల, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి
- తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు లక్ష్యమన్న నేతలు

- మిగతా 2లో

హైదరాబాద్ పెన్ పవర్:గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ విభాగం అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి పొత్తులు లేకుండానే బరిలోకి దిగుతామని ఆయన ప్రకటించారు.ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు



### ప్రశాంత్ కిశోర్‌తో డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ భేటీ..

## బీజేపీ సీరియస్ వార్నింగ్!

- ప్రశాంత్ కిశోర్‌తో భేటీ అయిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం సునేత్ర పవార్
- ముంబైలోని ఆమె నివాసంలో గంటలపాటు సాగిన రహస్య చర్చలు
- కూటమిలో చీలికలు తెచ్చే పనులు చేయవద్దని బీజేపీ నేత హెచ్చరిక
- పార్టీ బలోపేతం కోసమే భేటీ అని స్పష్టం చేసిన ఎన్సీపీ వర్గాలు



పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఎన్సీపీ అధినేత్రి సునేత్ర పవా ర్ రాజకీయ వ్యూహకర్త ప్ర శాంత్ కిశోర్‌తో సమావేశం కావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ పరిణామంపై అధికార మహా యుతి కూటమిలోని బీజేపీ స్పందించింది. కూటమిలో అనుమానాలకు, విభేదాలకు తావిచ్చే చర్యలకు పాల్పడవ ద్దని మిత్రపక్షమైన ఎన్సీపీకి పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసింది.ముంబైలోని సునేత్ర పవార్ అధికారిక నివాసం 'దేవగిరి'లో గురువారం ఈ భేటీ జరిగింది. ఆమె కుమారుడు,

- మిగతా 2లో



## ఈ నెల 11 లోపు కృష్ణా నీటిని విడుదల చేయకపోతే నార్లాపూర్ ను ముట్టడిస్తాం

### నిరంజన్ రెడ్డి హెచ్చరిక

- నీళ్లు లేవంటూ రైతులను రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారన్న నిరంజన్ రెడ్డి
- ఏపీకి నీళ్లు తరలించేందుకు చంద్రబాబుకు సహకరిస్తున్నారని ఆరోపణ
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పక్కన పెట్టేశారని మండిపాటు

హైదరాబాద్ పెన్ పవర్:జూరాల ప్రాజెక్టు పరిధిలోని భీమా ఫేజ్-1, 2, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ లిఫ్టులతో పాటు కేఎల్ఐ కింద ఉన్న పంపులను తక్షణమే ప్రారం భించి పాలమూరు

- మిగతా 2లో

## ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లు మా అంతర్గత విషయం: అమెరికాకు భారత్ గట్టి కౌంటర్

- ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లుపై అమెరికా ఎంపీ వ్యాఖ్యలను ఖండించిన భారత్
- ఇది పూర్తిగా తమ అంతర్గత వ్యవహారమని స్పష్టం చేసిన విదేశాంగ శాఖ
- విదేశీ నిధుల నియంత్రణపై అమెరికాలోనూ చట్టాలున్నాయని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లు-2026 (FCRA)పై అమెరికా కాంగ్రెస్ సభ్యుడు చేసిన విమర్శలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇది పూర్తిగా తమ అంతర్గత వ్యవహారమని,

- మిగతా 2లో

## భయపడొద్దు, నేనున్నాను:

### టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా

- ఎన్డీఏ కొత్త ఎంపీలతో ప్రధాని మోదీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్
- టీఎంసీ, శివసేన రెబల్ ఎంపీలకు అభయమిచ్చిన ప్రధాని
- "ఆందోళన వద్దు, నేను మీతో ఉన్నాను" అంటూ భరోసా
- పార్లమెంటు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఎంపీలకు సూచన

- మిగతా 2లో

పెన్ పవర్ డెస్క్:ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు. "ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను" అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు పదేపదే అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.





## హర్మూజ్ సంక్షోభం వచ్చినా... ఒక్క పెట్రోల్ బంక్ కూడా మూతపడలేదు

- హర్మూజ్ జలసంధి సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా ఎదుర్కొందన్న మంత్రి
- దేశంలో ఎక్కడా ఇంధన కొరత తలెత్తలేదని తెలిపిన కేంద్రమంత్రి పురి
- ముడిచమురు దిగుమతులను 41 దేశాలకు విస్తరించామని వెల్లడి
- భారత్‌కు అతిపెద్ద ఎల్పీజీ సరఫరాదారుగా నిలిచిన అమెరికా

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# జలపోరులో నిలిచేదెవరు? గెలిచేదెవరు?

తెలంగాణలో ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే సెంటిమెంట్ రగులుతోంది. ప్రధానంగా "నీటి సెంటిమెంట్" తో ప్రతిపక్ష బీఆర్ఎస్ అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తుంది. తెలంగాణకు దక్కాల్సిన నీటిని ఏపీకి తరలిస్తున్నారని, గోదావరి, కృష్ణా నదీ జలాలపై రగడ మొదలయింది. తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్ కు తాకట్టు పెడుతున్నారంటూ గులాబీ పార్టీ కాంగ్రెస్ పై మండి పడుతుంది. తన గురువు చంద్రబాబు కోసం గోదావరి, కృష్ణా నీటిని తెలంగాణకు దక్కకుండా ఏపీకి తరలించుకు పోతున్నా మౌనంగా ఉంటున్నారని ఆరోపణలను గుప్పిస్తుంది. దీనికి కాంగ్రెస్ పార్టీ ఘాటుగా కౌంటర్ ఇస్తుంది.

**నీళ్లు ప్రధానమైన సెంటిమెంట్ గా...**

తెలంగాణ రాజకీయాల్లో 'నీళ్లు' అనేది కేవలం వనరు మాత్రమే కాదు, ఉద్యమ పునాది నుంచి బలమైన భావోద్వేగ సెంటిమెంట్. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో "నీళ్లు, నిధులు, నియామకాలు" నినాదంలో నీళ్లే ప్రథమ స్థానంలో నిలిచాయి. సమైక్య రాష్ట్రంలో ప్రాజెక్టుల విషయంలో జరిగిన అన్యాయాన్ని ఎత్తిచూపుతూ రాజకీయ పార్టీలు ఎప్పుడూ ప్రజలను ఏకం చేస్తుంటాయి. తెలంగాణ ఉద్యమం వచ్చిందే నీళ్లు, నిధులు, నియామకాలు. సెంటిమెంట్ మానంగా దక్కాల్సిన కృష్ణా, గోదావరి జలాలు పాలకుల నిర్లక్ష్యంతో సీమాంధ్రకు తరలిపోయాయనే ఆవేదన తెలంగాణ సమాజంలో ఉండేది. తాగు, సాగునీరు అందక ఎండిన భూములు, వలసల నేపథ్యమే తెలంగాణ రాజకీయ అస్తిత్వానికి ప్రధాన ప్రాతిపదికగా మారింది.

**తీవ్ర రాజకీయ రగడ...**

ఏ పార్టీ అధికారంలో ఉన్నా నీటి హక్కుల రక్షణే ప్రధాన అజెండాగా సాగుతోంది. గోదావరి, కృష్ణా నదీ జలాల కేటాయింపులు, బోర్డుల సమావేశాల అజెండాలు రాష్ట్రంలో తరచూ తీవ్ర రాజకీయ రగడకు దారితీస్తున్నాయి. పక్క రాష్ట్రాల ప్రాజెక్టుల విస్తరణ లేదా కొత్త ప్రతిపాదనలు పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుల విషయంలో కేంద్రం వద్ద రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవడంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాలు జరుగుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమదే నీటి హక్కుల పరిరక్షణ అంటుంటే, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ తదితర ప్రతిపక్షాలు సెంటిమెంట్ అస్త్రం ప్రయోగిస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఎత్తిపోతల పథకాల ప్రారంభాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే కీలక శక్తిగా ఉంటాయి. నీటి కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందనే చిన్న సంకేతం కూడా తెలంగాణలో వెంటనే బలమైన రాజకీయ వ్యతిరేకతను, సెంటిమెంట్‌ను రగిలిస్తుంది. మరి ఈ సెంటిమెంట్ ఎప్పటి వరకూ కొనసాగిస్తారో.. ఎవరు అధిగమించి అధికారాన్ని చేపడతారో చూడాల్సి ఉంది.

# జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరి పోరు

- మొదటి పేజీ తరువాయి

నితిన్ నబిన్‌తో భేటీ అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో బీజేపీ ఎవరితోనూ పొత్తులు పెట్టుకోదు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్ర పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, కేవలం అభిప్రాయ భేదాలు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. సరైన సమయం చూసి పలువురు కీలక నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వంలో పెరుగుతున్న అవినీతిపై పోరాడాలని, అధికారంలోకి వచ్చేందుకు పక్కా రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని జాతీయ నాయకత్వం తమకు సూచించినట్లు రామచందర్ రావు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ఆరు గ్యారెంటీల అమలు తీరును ప్రజల్లోకి బలంగా తీసుకెళతామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు. అన్ని మండలాల్లో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో 'డబుల్ ఇంజిన్ సర్కార్'ను ఏర్పాటు చేయడమే తమ అంతిమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలు రాష్ట్రంలో పార్టీ బలాన్ని నిరూపించుకోవడానికి ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# జగిత్యాల జిల్లాలో గ్యాంగ్ రేప్..

- మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనలో నిందితులతో పాటు వారికి సహకరించిన మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి శుక్రవారం సాయంత్రం న్యాయస్థానం ఎదుట హాజరు పరిచినట్లు మల్యాల సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 3న నిజామాబాద్‌కు చెందిన ఓ మహిళ నూకపల్లి శివారులోని రెండు పడకగదుల ఇళ్ల కాలనీలో తనకు తెలిసినవారి ఇంటికి వచ్చింది. మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన శివరాత్రి నరేశ్, గుర్రం శ్రీకాంత్ అనే యువకులు సదరు మహిళ ఉన్న ఇంట్లోకి ప్రవేశించి.. ఆమె తనకు సన్నిహితంగా వున్న ఓ వ్యక్తితో కలిసివున్న దృశ్యాలను తమ చరవాణిలో చిత్రీకరించారు. తర్వాత ఆమెపై వారిరువురు సామూహిక అత్యాచారానికి దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో జగిత్యాల జిల్లా ధరూర్ గ్రామానికి చెందిన మారవేని మల్లేశ్, రాజారం గ్రామానికి చెందిన గుర్రం అంజయ్య నిందితులకు సహకరించారు. అనంతరం నరేశ్, శ్రీకాంత్ బాధిత మహిళకు ఫోన్ చేసి తాము తీసిన వీడియోను పలువురికి పంపిస్తామని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడంతో గురువారం బాధితురాలు మల్యాల ఠాణాలో ఫిర్యాదు చేసింది. దీంతో నిందితులను అరెస్టు చేసి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ వివరించారు. నిందితులు వినియోగించిన ఇన్నోవా క్రిస్టా కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో ఏ–1 నిందితుడు శివరాత్రి నరేశ్‌పై 13, ఏ–2 నిందితుడు

గుర్రం శ్రీకాంత్‌పై 9 పాత కేసులతోపాటు రౌడీ షీట్లు ఉన్నట్లు వివరించారు. ఏ–3 నిందితుడు మారవేని మల్లేశ్‌పై 2, గుర్రం అంజయ్యపై ఒక కేసు గతంలో నమోదై ఉన్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళలపై వేధింపులు, లైంగిక దాడులు, సామాజిక మాధ్యమాల ద్వారా బెదిరింపులకు పాల్పడే వ్యక్తులపట్ల చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాజ్‌కుమార్ హెచ్చరించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్థుల కదలికలపై కూడా ప్రత్యేక నిఘావేస్తామని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో సీఐతోపాటు ఎస్సై సందీప్, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

చేనేత కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. భారతీయ సంస్కృతికి, వారసత్వానికి చేనేత ప్రతీక అని, గద్వాల, పోచంపల్లి, నారాయణపేట వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నకు, నేతన్నకు సమాన ప్రాధాన్యతను ఇస్తోందని మంత్రి తెలిపారు. చేనేత రంగానికి ఇప్పటివరకు రూ.980 కోట్లు విడుదల చేశామని, అందులో చేనేత రుణమాఫీ కింద రూ.49.27 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. 'నేతన్న భరోసా' ద్వారా ఏడాదికి రూ.18,000 ఆర్థిక సాయం, 'నేతన్నకు భద్రత' కింద రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని, ఐఐహెచ్‌టీ ద్వారా యువతకు ఆధునిక నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికలను నిర్వహిస్తామని, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

- మొదటి పేజీ తరువాయి

రీయింబర్స్‌మెంట్ హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ దుయ్యబట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బోర్డులను రద్దు చేసి, జీఎస్టీ విధించి దెబ్బతీస్తే.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పథకాలను నిలిపివేసి నేతన్నలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కక్షపూరిత వైఖరి వీడి, రద్దు చేసిన పథకాలను తక్షణమే పునరుద్ధరించి నేతన్న కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఈ నెల 11 లోపు కృష్ణా నీటిని విడుదల చేయకపోతే నార్లాపూర్ ను ముట్టడిస్తాం

- మొదటి పేజీ తరువాయి

రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 11వ తేదీలోపు పంపులను ఆన్ చేయకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి భారీ సంఖ్యలో రైతులతో నార్లాపూర్ ప్రాజెక్టును ముట్టడిస్తామని హెచ్చరించారు.

కృష్ణా నదికి ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తున్నప్పటికీ, నీళ్లు లేవంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలమూరు బిడ్డనని చెప్పుకుంటూనే ఏపీకి నీళ్లు తరలించేందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు రేవంత్ సహకరిస్తున్నారని ఆరోపించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తిగా పక్కన పెట్టేశారని విమర్శించిన ఆయన... కర్ణాటక నుంచి వచ్చే వృథా నీటితోనే డిసెంబర్ వరకు జూరాలకు పుష్కలంగా నీరు అందుతుందని, వెంటనే ఎత్తిపోతల పంపులు ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

# ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లు మా అంతర్గత విషయం: అమెరికాకు భారత్ గట్టి కౌంటర్

- మొదటి పేజీ తరువాయి

దీనిపై ఇతరుల వ్యాఖ్యలు అనవసరమని స్పష్టం చేసింది. విదేశీ నిధుల నియంత్రణకు సంబంధించి అమెరికాతో సహా ప్రపంచంలోని అనేక దేశాల్లో కఠినమైన చట్టాలు అమలులో ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తుచేసింది.

అమెరికాకు చెందిన రిపబ్లికన్ పార్టీ ప్రతినిధి రైలీ మూర్ ఆగస్టు 4న మాట్లాడుతూ, ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లు క్రైస్తవులపై జరుగుతున్న స్పష్టమైన దాడి అని ఆరోపించారు. ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ రద్దయినా లేదా పునరుద్ధరణ జరగకపోయినా.. చర్చిలు, మతపరమైన స్వచ్ఛంద సంస్థలను ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకునే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విమర్శలపై గురువారం విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. భారత్‌లో చట్టాల రూపకల్పనకు పటిష్ఠమైన

ప్రజాస్వామ్య ప్రక్రియ ఉందని, దేశీయ చట్టాలను సరైన కోణంలో అర్థం చేసుకోవాలని ఆయన సూచించారు.

విదేశాల నుంచి వచ్చే విరాళాలను నియంత్రించే 2010 నాటి చట్టానికి సవరణలు చేస్తూ ప్రభుత్వం ఈ కొత్త బిల్లును ప్రతిపాదించింది. దీని ప్రకారం, ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ రద్దయిన లేదా గడువు ముగిసిన సంస్థల ఆస్తులను, విదేశీ విరాళాలను నిర్వహించడానికి ప్రభుత్వం నియమించిన అధికారికి అధికారాలు లభిస్తాయి. అయితే, ప్రార్థనా స్థలాల మతపరమైన స్వభావాన్ని యథాతథంగా కాపాడతామని ఈ బిల్లులో స్పష్టం చేశారు.

# భయపడొద్దు, నేనున్నాను:

## టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా

- మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశంలో తృణమూల్ రెబల్స్‌తో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ), ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన శివసేన ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొంటూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. "ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.

# హర్మూజ్ సంక్షోభం వచ్చినా... ఒక్క పెట్రోల్ బంక్ కూడా మూతపడలేదు

హర్మూజ్ జలసంధి వద్ద భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తలెత్తినప్పటికీ, దేశంలో ఎక్కడా ఇంధన కొరత ఏర్పడకుండా భారత్ సమర్థవంతంగా ఎదుర్కొందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి స్పష్టం చేశారు. ముడిచమురు దిగుమతులకు సంబంధించి ప్రత్యామ్నాయ దేశాలను అన్వేషించడం, దేశీయంగా ఉత్పత్తిని పెంచడంతో పాటు మౌలిక సదుపాయాల విస్తరణ వంటి వ్యూహాత్మక చర్యల వల్లే ఇది సాధ్యమైందని ఆయన వివరించారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) వార్షిక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గతంలో భారత్ తన ముడిచమురు అవసరాలతో పాటు, 90 శాతం ఎల్పీజీ, 60 శాతం గ్యాస్ దిగుమతుల కోసం హర్మూజ్ జలసంధిపైనే అధికంగా ఆధారపడేదని మంత్రి గుర్తుచేశారు. సరఫరా వ్యవస్థలో ఆటంకాలు ఏర్పడిన తరుణంలో ప్రభుత్వం సత్వరమే స్పందించిందని ఆయన తెలిపారు. "దేశవ్యాప్తంగా ఉన్న 1,07,000 ఇంధన రిటైల్ అవుట్‌లెట్లలో ఒక్కటి కూడా నిల్వలు లేక మూతపడలేదని నేను గర్వంగా చెప్పగలను" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముడిచమురు దిగుమతి చేసుకునే దేశాల సంఖ్యను గతంలో ఉన్న 27 నుంచి 41కి పెంచుకున్నామని పురి వెల్లడించారు. అలాగే 2014లో దేశంలో 52,000గా ఉన్న పెట్రోల్ బంకుల సంఖ్య నేడు 1,07,000కు పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం అమెరికా మన దేశానికి అతిపెద్ద ఎల్పీజీ సరఫరాదారుగా అవతరించిందని, మన మొత్తం దిగుమతుల్లో సుమారు 67 శాతం వాటా అక్కడి నుంచే వస్తోందని ఆయన పేర్కొన్నారు. సముద్ర గర్భంలో చమురు, సహజ వాయువు నిక్షేపాల అన్వేషణను ప్రోత్సహించే లక్ష్యంతో రూ.84,000 కోట్ల వ్యయంతో చేపట్టిన 'సముద్ర మంథన్' కార్యక్రమానికి ఇటీవల ఆమోదం తెలిపినట్లు మంత్రి వెల్లడించారు. ఇక ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ (ఇ20) నాణ్యతపై వస్తున్న ఆందోళనలను ఆయన తోసిపుచ్చారు. అతికొద్ది ప్రాంతాల్లో మాత్రమే స్వల్ప ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాలతో భవిష్యత్తులో తలెత్తే ఎలాంటి భౌగోళిక, రాజకీయ సవాళ్లనైనా భారత్ అధిగమించగలదని హర్దీప్ సింగ్ పురి ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో సురక్షితమైన, స్థిరమైన ప్రపంచ ఇంధన వ్యవస్థ ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

# ప్రశాంత్ కిశోర్‌తో డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ భేటీ.. బీజేపీ సీరియస్ వార్నింగ్!

- మొదటి పేజీ తరువాయి

ఎన్సీపీ నేత పార్థ్ పవార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. గంటల తరబడి సాగిన ఈ చర్చల్లో పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై మంతనాలు జరిపినట్లు ఎన్సీపీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది జనవరిలో తన భర్త, మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించిన తర్వాత సునేత్ర పవార్, ప్రశాంత్ కిశోర్‌తో భేటీ కావడం ఇది రెండోసారి. ఈ భేటీపై మహారాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ బవాన్‌కులే స్పందించారు. "కూటమిలో చీలికలు తెచ్చే ఎలాంటి చర్యలకు పూనుకోవద్దు" అని ఆయన హితవు పలికారు. ఇది ఎన్సీపీ అంతర్గత వ్యవహారమే అయినప్పటికీ, మహాయుతిలోని భాగస్వామ్య పక్షాలన్నీ కూటమి ధర్మానికి కట్టుబడి ఉండాలని, మిత్రపక్షాలను ఇబ్బంది పెట్టే పనులు చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల బీహార్‌లోని బంకిపుర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం గమనార్హం. గత మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న బంకిపూర్ నియోజకవర్గంలో ప్రశాంత్ కిశోర్ గెలుపొందిన నేపథ్యంలో, ఈ భేటీకి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. అయితే, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపైనే చర్చించినట్లు ఎన్సీపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## ఆర్థిక వ్యవస్థకు ‘చేనేత’ కీలకం: కిషన్‌రెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్: దేశంలో చేనేత రంగం ద్వారా కోట్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోందని, ఆర్థిక వ్యవస్థకు చేనేత కీలకమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో అతిపెద్ద కుటీర పరిశ్రమ చేనేత అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని బండి సంజయ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్




# అక్రమ కట్టడాలతో..! ప్రభుత్వ ఖజానాకు చిల్లు..!

- దుండిగల్ టౌన్‌ప్లానింగ్‌లో రాజ్యమేలుతున్న వసూల్ దారులు..!
- అధికారపార్టీ నేతల సిఫార్సులు ఉన్నాయని సిఎంసి నుండి ఫోన్‌లు..?
- ఇదే అదనుగా మరో 10 అక్రమ కట్టడాలకు సహకరించడమే ఏసిపి-టిపిఎస్ విధులు..?
- అలంకార ప్రాయంగా సర్కిల్ డిప్యూటీ కమిషనర్.. బెల్లం కొట్టిన రాయిలా మౌనం..
- డీసీ దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం.. తిలాపాపం తలాపిడికెడు..?
- అక్రమ షెడ్డు, కట్టడాలపై ఫిర్యాదు చేసినా, దున్నపోతు మీద వర్షం పడిన వైనం..?

- అధికారుల జేబులు నింపుతున్న అక్రమ నిర్మాణాలు, షెడ్లు..?
- మాజీ కౌన్సిలర్ ఫిర్యాదు చేసినా..! ఏసిపి-టిపిఎస్ అక్రమార్కులకే ప్రాధాన్యత..?
- పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ భారీ షెడ్డు నిర్మాణం..
- పక్కనే మరో మార్వాడి అక్రమ నిర్మాణం..




దుండిగల్ పియస్ సమీపంలో, భారీ అక్రమ షెడ్డు నిర్మాణం..

-5లో

## వర్షంలోనే వార్డుల బాట పట్టిన మంత్రి పొంగులేటి

- ఏదులాపురంలో క్షేత్రస్థాయి పర్యటన.. ప్రజల సమస్యలపై నేరుగా ఆరా
- రూ.100 కోట్ల నిధులతో మోడల్ మున్సిపాలిటీగా ఏదులాపురం రూపకల్పన

-7లో

01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసిఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

‘ ఐదు రోజులకు ’

‘4 సెం.మీ 4 సెం.మీ’

‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’

93948 55244

షరతులు వర్తిస్తాయి

## దుండిగల్‌లో భూ సేకరణకు..! అసైనీలు సంపూర్ణ సమ్మతి..!

50 మంది అసైనీల సమ్మతితో.. 382 ఎకరాలకు పైగా భూమి అభివృద్ధికి సిద్ధం..!

మాధవ్ పత్తి..
మేడ్చల్ జిల్లా బ్యూరో,
పెన్ పవర్, ఆగష్టు 7:

గండిమైసమ్మ-దుండిగల్ మండలం, దుండిగల్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 453, 454, ప్రభుత్వ అసైన్డ్ భూములను, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, రైతులు స్వచ్ఛందంగా ఇవ్వడానికి ఏకగ్రీవంగా అంగీకరించినట్టు మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్, దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి తెలిపారు.. దుండిగల్ గ్రామంలో ల్యాండ్ పూలింగ్ కోసం, పలుమార్లు నిర్వహించిన గ్రామసభలు శుక్రవారం విజయవంతం అయ్యాయి.. దుండిగల్ గ్రామసభలో ల్యాండ్ పూలింగ్‌కు అసైనీలు ఏకగ్రీవ మద్దతు తెలిపారు.. అసైనీలకు ఒక్కో ఎకరానికి 750 చదరపు గజాలు -- కొనుగోలు దారులకు 600 చదరపు గజాల చొప్పున నిర్ణయించారు.. దీంతో 50 మంది రైతులు, సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.. ప్రభుత్వ ప్రతిపాదన ప్రకారం అసైనీ భూమి కలిగిన వారికి ఎకరానికి 750 చదరపు గజాల నివాస స్థలం, అలాగే కొనుగోలు చేసిన వారికి ఎకరానికి 600 చదరపు గజాల నివాస స్థలం కేటాయించనున్నట్లు గ్రామసభలో వివరించారు.. ఈ నిర్ణయంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు..

అసైనీ రైతులు, భూ సమీకరణకు సమ్మతి తెలుపుతూ అంగీకార పత్రం అందజేత..



-4లో

## ‘ఇలాగైతే కుబేరుడూ కూలికి వెళ్తాడు’

- కోటీశ్వరులకూ రైతుబంధు ఇస్తారా?
- ఒక్క తెల్లకార్డూ తొలగించలేని పరిస్థితి
- ఉచిత పథకాలపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- కోర్టుకు హాజరైన సందీప్‌కుమార్ సుల్తానియా



కూర్చుంటే సొమ్ము.. నిలుచుంటే సొమ్ము.. ఎలా పడితే అలా పరిమితికి మించి అమలు చేస్తున్న ఉచిత పథకాలతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయంటూ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇన్ని ఉచిత పథకాలు అమలు చేస్తూ పోతే కుబేరుడైనా పనికి ఆహారం వంటి పథకం కింద కూలి పనికి వెళ్తాడని... ఆ ఖాతా పేరూ ‘కుబేర’ అని వ్యాఖ్యానించింది. కంటోన్మెంట్ బోర్డుకు రూ.33.42 కోట్లు విడుదల చేయాలని 2024లో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలంటూ ఇచ్చిన వినతిపత్రాలపై చర్యలు తీసుకోకపోవడంతో కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు జె.రామకృష్ణ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక శుక్రవారం విచారణ చేపట్టారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా వ్యక్తిగతంగా హాజరై రూ.24 కోట్లు గత మే నెలలో చెల్లించామని, మిగిలినది వాయిదాల పద్ధతిలో ఆరు నెలల్లో చెల్లిస్తామని చెప్పారు. ఈ దశలో పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు

-6లో

## పెట్టుబడులకు గమ్యస్థానం తెలంగాణ



హైదరాబాద్ పెన్ పవర్: పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు తెలంగాణ రాష్ట్రానికి తొలి ప్రాధాన్యమిచ్చి గమ్యస్థానంగా ఎంచుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సుల్ జనరల్ శ్రీకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ప్రత్యేక విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ భవిష్యత్తు కార్యాచరణను, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను భట్టి విక్రమార్క వివరించారు. అభివృద్ధి చెందుతున్న రంగాల్లో పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కోసం పునాదులు వేయడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కొత్త ఆలోచనలను, నాణ్యమైన ఉపాధిని సృష్టించడంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అడుగులు వేయాలని పారిశ్రామికవేత్తలను ఆయన ఆహ్వానించారు. శ్రీకర్‌రెడ్డి మాట్లాడుతూ భారత దేశంలో సమ్మిళిత ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడుతూనే, ప్రవాసులకు సైతం ప్రయోజనం చేకూర్చేలా బలమైన భాగస్వామ్యాలను అన్వేషించాలని వ్యాపార వర్గాలను కోరారు. అనంతరం పెట్టుబడులు, సాంకేతిక సహకారం, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ఆవిష్కరణలు తదితర అంశాలపై ఎన్నారైలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.


అసైనీ రైతులు, భూ సమీకరణకు సమ్మతి తెలుపుతూ అంగీకార పత్రం అందజేత..

# దుండిగల్‌లో భూ సేకరణకు..! అసైనీలు సంపూర్ణ సమ్మతి..!

మాధవ్ పత్తి..
మేడ్చల్ జిల్లా బ్యూరో,
పెన్ పవర్, ఆగష్టు 7:

గండిమైసమ్మ-దుండిగల్ మండలం, దుండిగల్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 453, 454, ప్రభుత్వ అసైన్డ్ భూములను, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, రైతులు స్వచ్ఛందంగా ఇవ్వడానికి ఏకగ్రీవంగా అంగీకరించినట్టు మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్, దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి తెలిపారు.. దుండిగల్ గ్రామంలో ల్యాండ్ పూలింగ్ కోసం, పలుమార్లు నిర్వహించిన గ్రామసభలు శుక్రవారం విజయవంతం అయ్యాయి.. దుండిగల్ గ్రామసభలో ల్యాండ్ పూలింగ్‌కు అసైనీలు ఏకగ్రీవ మద్దతు తెలిపారు.. అసైనీలకు ఒక్కో ఎకరానికి 750 చదరపు గజాలు -- కొనుగోలు దారులకు 600 చదరపు గజాల చొప్పున నిర్ణయించారు.. దీంతో 50 మంది రైతులు, సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.. ప్రభుత్వ ప్రతిపాదన ప్రకారం అసైనీ భూమి కలిగిన వారికి ఎకరానికి 750 చదరపు గజాల నివాస స్థలం, అలాగే కొనుగోలు చేసిన వారికి ఎకరానికి 600 చదరపు గజాల నివాస స్థలం కేటాయించనున్నట్లు గ్రామసభలో వివరించారు.. ఈ నిర్ణయంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు..

గ్రామ సభలో ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్‌కు, మాజీ సర్పంచ్ గణేష్ నివాస స్థలాల ప్రతిపాదన..



## 50 మంది అసైనీల సమ్మతితో.. 382 ఎకరాలకు పైగా భూమి అభివృద్ధికి సిద్ధం..!

- 453-454 ప్రభుత్వ అసైనీ భూమిలో ఆక్రమణలపై ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్ స్పష్టత..
- సంబంధిత ఆక్రమణలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, తగు చర్యలు..!
- అక్రమ గదుల విషయాన్ని ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్న ఆర్డీవో..

## సర్వే నెం. 453 అసైన్డ్ భూమి వివరాలు..

గ్రామాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా అవసరాల కోసం భూముల కేటాయింపుపై కూడా గ్రామసభలో వివరాలు వెల్లడించారు.. సర్వే నెంబర్-453 (మొత్తం విస్తీర్ణం: 145 ఎకరాలు 23 గుంటలు) ఇందులో డబుల్ బెడ్‌రూం ఇళ్ళ నిర్మాణానికి-16 ఎకరాలు కేటాయించగా, ఓఆర్ఆర్‌కి - 1 ఎకరం 19 గుంటలు, శ్మశానవాటికకు - 3 ఎకరాలు, రహదారులకు - 1 ఎకరం 12 గుంటలు, మొత్తం ప్రజా అవసరాలకు కేటాయింపు: 21 ఎకరాలు 31 గుంటలు, కేటాయించినట్టు అధికారులు తెలిపారు..

## మాజీ సర్పంచ్ గణేష్ కీలక ప్రతిపాదన..

దుండిగల్ గ్రామంలో అసైన్డ్ భూముల రైతులతో నిర్వహించిన ల్యాండ్ పూలింగ్ సమావేశంలో రైతులు తమ సంపూర్ణ సమ్మతిని తెలిపారు.. అనంతరం దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్, రైతుల పక్షాన కీలక ప్రతిపాదన పెట్టారు.. 50 మంది రైతులకు ఒకేచోట నివాస స్థలాల కేటాయింపులో పలు డిమాండ్‌లు ప్రతిపాదించారు.. రైతుల అందరికీ ఇటు ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుకే నివాస స్థలాలు ఇవ్వాలని వినతిపత్రం ఇచ్చినట్లు కావలి గణేష్ తెలిపారు.. డబుల్ బెడ్‌రూం ఇళ్ళ నుండి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుకు నడుమ ఉన్న స్థలాన్ని కేటాయించాలని ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్, తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డిని రైతులు కోరారు.. ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా భూములు ఇవ్వడానికి సమ్మతి పత్రం తోపాటు, నివాస స్థలాల కేటాయింపు కోసం షరతులతో కూడిన వినతి పత్రాన్ని అందజేసినట్టు దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ 'పెన్ పవర్' ప్రతినిధితో తెలిపారు..

- దుండిగల్ గ్రామసభలో ల్యాండ్ పూలింగ్‌కు అసైనీల ఏకగ్రీవ మద్దతు..
- సుమారు 50 మంది అసైనీలు సమ్మతి పత్రాలు అందజేత..
- అసైనీలకు ఎకరానికి 750, కొనుగోలు దారులకు 600 గజాలు..
- ఒక్కో రైతుకు ఎకరంన్నరకి 1125 గజాలు ఇవ్వడానికి ప్రభుత్వ అంగీకారం..
- సభలో అధికారుల ముందు, మాజీ సర్పంచ్ గణేష్ కీలక ప్రతిపాదన..
- రైతుల అందరికీ "ఓఆర్ఆర్" సర్వీస్ రోడ్డు లోనే ప్లాట్‌లు ఇవ్వాలని వినతిపత్రం..
- సర్వే నెం. 453, 454లో మొత్తం 511.24 ఎకరాల భూమి..
- ప్రజా అవసరాలకు 129.28 ఎకరాలు పోగా, మిగులు 382.36 ఎకరాలు..
- సీఎం రేవంత్‌రెడ్డికి గ్రామ సభలో కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు..

## సర్వే నెం.454 అసైన్డ్ భూమి వివరాలు..

దుండిగల్ సర్వే నెంబర్ 454 అసైన్డ్ భూమి (మొత్తం విస్తీర్ణం: 366 ఎకరాలు 01 గుంట) ఇందులో.. డబుల్ బెడ్‌రూం గృహాలకు - 9 ఎకరాలు 17 గుంటలు కేటాయించగా, ఓఆర్ఆర్‌కు-31 ఎకరాలు 33 గుంటలు, రహదారులకు - 6 ఎకరాలు 07 గుంటలు, దేవాలయాలు - 3 ఎకరాలు కేటాయించగా, కోర్టు కేసుల్లో - 3 ఎకరాలు 20 గుంటలు ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు.. పల్లవి ఆశ్రమానికి - 1 ఎకరం 50 గుంటలు, శ్మశానవాటికకు -3 ఎకరాలు 05 గుంటలు, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్‌టిఎ) కార్యాలయం కోసం - 50 ఎకరాల భూమి కేటాయించారు.. మొత్తం ప్రజా భూమి, 107 ఎకరాలు 37 గుంటలు ప్రజా అవసరాలకు కేటాయించినట్లు దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి, తెలిపారు..

దుండిగల్ భూ సేకరణ అంశం విజయవంతంగా ముగిసినప్పటికీ, మరికొన్ని అంశాలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.. సర్వే నెంబర్ 453, 454, ప్రభుత్వ అసైన్డ్ భూమిలో కొందరు వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు అసైనీల వద్ద కొనుగోలు చేసుకున్న భూముల్లో, దాదాపు 50 ఎకరాల్లో ఆక్రమణలో ఉన్నట్టు తెలుస్తోంది.. అందులోనే పల్లవి ఆశ్రమం సమీపంలోనూ కొందరు 202-23లో అక్రమ కట్టడాలు వెలిశాయి.. ఓ ప్రజాప్రతినిధి పేరు కూడా పెట్టారని, స్థానికులు ఆరోపిస్తుండగా.. ఇదే విషయాన్ని మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్‌తో ప్రస్తావించగా, ఆయన స్పందించారు.. అలాంటి సమస్యాత్మక ఆక్రమణలపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆర్డీవో తెలిపారు.. సర్వే నెంబర్. 453, 454, ప్రభుత్వ అసైన్డ్ భూమి మొత్తం హెచ్ఎండిఏకు కేటాయించామని, ఆక్రమణలో ఎంతటి వారున్నా..? ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం, కొనుగోలు దారులకు ఎకరానికి 600 గజాలు కేటాయించి, భూమి స్వాధీనం చేసుకుంటామని ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్ వెల్లడించారు..


నివాస స్థలాకు ప్రత్యేక ప్రతిపాదనకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు..


గ్రామ సభలో మాట్లాడుతున్న దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి..




# అక్రమ కట్టడాలతో..! ప్రభుత్వ ఖజానాకు చిల్లు..!

- దుండిగల్ టౌన్‌ప్లానింగ్‌లో రాజ్యమేలుతున్న వసూల్ దారులు..!
- అధికారపార్టీ నేతల సిఫార్సులు ఉన్నాయని సిఎంసి నుండి ఫోన్‌లు..?
- ఇదే అదనుగా మరో 10 అక్రమ కట్టడాలకు సహకరించడమే ఏసిపి-టిపిఎస్ విధులు..?
- అలంకార ప్రాయంగా సర్కిల్ డిప్యూటీ కమిషనర్.. బెల్లం కొట్టిన రాయిలా మౌనం..
- డీసీ దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం.. తిలాపాపం తలాపిడికెడు..?
- అక్రమ షెడ్డు, కట్టడాలపై ఫిర్యాదు చేసినా, దున్నపోతు మీద వర్షం పడిన వైనం..?

- అధికారుల జేబులు నింపుతున్న అక్రమ నిర్మాణాలు, షెడ్లు..?
- మాజీ కౌన్సిలర్ ఫిర్యాదు చేసినా..! ఏసిపి-టిపిఎస్ అక్రమార్కులకే ప్రాధాన్యత..?
- పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ భారీ షెడ్డు నిర్మాణం..
- పక్కనే మరో మార్వాడి అక్రమ నిర్మాణం..


దుండిగల్ పియస్ సమీపంలో, భారీ అక్రమ షెడ్డు నిర్మాణం..

దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పట్టణ ప్రణాలికా వ్యవస్థ, కరప్షన్ మత్తులో జోగుతున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి... ఓవైపు అధికారపార్టీ, విపక్ష పార్టీల నాయకులే తమ బంధువులకు, స్నేహితులకు సంబంధించిన అక్రమ కట్టడాలు, షెడ్లకు రూ.లక్షల్లో ఒప్పందం కుదుర్చుకుని, అధికారుల వద్ద సిఫార్సులు చేస్తూనే..! మరోవైపు ఆ ముగ్గురు కీలక అధికారులకు నాయకులే సెటిల్మెంట్‌ల వ్యవహారం చక్కబెడుతున్నారని విశ్వసనీయ సమాచారం..? దీనికి తోడు, అగ్నికి ఆజ్యం పోసిన చందంగా, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి, అధికార పార్టీ నాయకుల సిఫార్సులు విధిగా అమలు చేయాలని అనధికారిక ఉత్తర్వులు జారీచేశారని ఆరోపణలు.. అందుకే తాజా టిఫిన్స్ పక్కన కూల్చేసిన అక్రమ రెసిడెన్షియల్ భవనాన్ని, కమర్షియల్ కాంప్లెక్స్‌గా మారిన వైనం.. జనార్ధన్ రెడ్డి, లావణ్యల రెండు పర్మిషన్‌లతో ఒకటే వ్యాపార సముదాయంగా అక్రమ భవన నిర్మాణంపై అధికారుల మౌనం..

**సిఎంసి బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 7:**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ అధికారుల బరితెగింపు విధులతో, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.. అందుకు నిదర్శనంగా సంబంధిత, ప్రమాదకర అక్రమ కట్టడాలు కూడా దర్శనమిస్తాయి.. ముఖ్యంగా సిఫార్సుల మాటున అక్రమ నిర్మాణాల దందా, “మూడు పూవులు ఆరు కాయలు” అన్న చందంగా అధికారుల విధులు విరాజిల్లుతోందని పలువురు వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు.. దుండిగల్ టౌన్‌ప్లానింగ్ ‘ఏసిపి-టిపిఎస్’, టిజి-బిపాస్ చట్టాలు, నిబంధనలు ధిక్కరించి విధులు నిర్వర్తిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.. సిఫార్సులకు ప్రాధాన్యత ఇచ్చేటట్లు అయితే, ఈ మాత్రం దానికి, సిఎంసి కమిషనర్ “ఎస్‌టిఎఫ్” కమిటి నియామకం దేనికి సంకేతం..? అక్రమ నిర్మాణాల నియంత్రణకా..? టౌన్‌ప్లానింగ్ దందా బలోపేతానికా..? అంటూ ఎద్దేవా చేసేవారు ఉన్నారు.. నేతల సిఫార్సులు అమలు చేసే అధికారులకు, నాయకుల ఇంటివద్దనే కార్యాలయం కేటాయిస్తే, మరింత సులువుగా ఉంటుందికదా అంటూ, పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. దుండిగల్ టౌన్‌ప్లానింగ్‌లో ఓ ముఖ్య అధికారి గతంలో హెచ్ఎండిఏలో విధులు ఎలగబెట్టారట, అక్రమార్కులకు ఎలా సహకరించాలో..! సలహాలు సూచనలు ఇస్తూ, ఆయన తన నైపుణ్యాన్ని అంతా ప్రదర్శిస్తున్నాడని ఆరోపణలు.. సారు అవినీతి దందాకోసం, ప్రశ్నించిన విలేఖరుల ఫోన్‌లు బ్లాక్ చేయడంలోనూ సిద్ధహస్తులని, స్పష్టమవుతుంది. ఏ మేరకు అక్రమ కట్టడాల దందాకు పాల్పడుతున్నాడో.. దుండిగల్ సర్కిల్-59 సిఎంసిలో, ప్రమాదకర అక్రమ నిర్మాణాలే సాక్ష్యం..

నిరంజన్ కాలనీలో రెండు పర్మిషన్ లతో, ఒకటే భారీ కమర్షియల్ కాంప్లెక్స్..




## భారీ అక్రమ షెడ్డుకు.. ముడుపులెన్ని ముట్టాయో..?

దుండిగల్ సర్కిల్-59 సిఎంసి కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ భారీ అక్రమ షెడ్డుకు, సంబంధిత అధికారులకు భారీగానే ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి.. మరోవైపు అనుమతుల్లేని ఈ భారీ షెడ్డుకు ఓ ప్రత్యేకత కూడా ఉంది.. దుండిగల్ పోలీస్ స్టేషన్ సమీపంలోని, పెట్రోల్ బంకు వెనుకవైపు, దాదాపు 3 ఏళ్ళ క్రితమే షెడ్డు పనులు ప్రారంభించగా, అప్పుడున్న మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో, పనులు నిలిపి వేశారు.. ఆతర్వాత మరో మున్సిపల్ కమిషనర్ హయాంలోనూ, నిర్మాణం చేపట్టలేదు.. మున్సిపాలిటీ కాస్త, సిఎంసిగా మారడంతో, కరప్షన్ దందాకు అడ్డు ఉండదేమో అనిపిస్తుంది.. అందుకే, ఈ అక్రమ షెడ్డు నిర్మాణంపై స్థానిక మాజీ కౌన్సిలర్ మహేందర్ యాదవ్ ఫిర్యాదు చేసినా, డిప్యూటీ కమిషనర్, ఏసిపి-టిపిఎస్, బరితెగించి నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. సిఫార్సుల మాటున,అక్రమ నిర్మాణాల దందా సాగుతుందని, తీవ్రంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు..

ఏసిపి శ్రీనివాస్ సమక్షంలో, సీజ్‌చేసి, కూల్చిన అక్రమ నిర్మాణం.. ప్రస్తుతం ఇలా కమర్షియల్ కాంప్లెక్స్..

పియస్ సమీపంలో రెండు పర్మిషన్‌లతో ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్..



## పక్కనే రెండు పర్మిషన్‌లతో..! ఒకటే కమర్షియల్ భవనం..

దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్‌లో అక్రమ నిర్మాణాల దందాకు బ్రాండ్ అంబాసిడర్‌లు ఉన్నారనే చెప్పాలి.. దీనిపై డిప్యూటీ కమిషనర్‌మౌనం వీడాలని పలువురు సూచిస్తున్నారు.. దుండిగల్ పోలీస్ స్టేషన్ సమీపంలోనే, మరో అక్రమ నిర్మాణానికి, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏసిపి-టిపిఎస్‌లే కీలకంగా సహకరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి..ఓ మార్వాడి రెండు రెసిడెన్షియల్ పర్మిషన్‌లు తీసుకుని, అధికారుల అండతో దర్జాగా, అక్రమ సెల్లార్‌తో పాటు, రెండు అనుమతులు కలిపి, ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు.. ఈ వ్యవహారంలో నిర్మాణ దారుని సామాజిక వర్గానికి చెందిన అధికారి, ముఖేష్ సింగ్, కీలకపాత్ర ఉన్నట్టు తెలుస్తోంది..? అందుకే చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.. సర్కిల్ కార్యాలయానికి దగ్గరలోనే ఈ నిర్మాణం కొనసాగుతుంటే, అధికరులు ఇంత బరితెగించి విధులు నిర్వర్తించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. మొదట్లో పనులు నిలిపివేసిన టిపిఎస్ ముఖేష్ సింగ్, ఇపుడు దర్జాగా పనులు చేస్తుంటే, చర్యలు చేపట్టకుండా, మౌనం వెనుక ఆంతర్యం, లంచాలేనా..? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



# తెలంగాణ టీడీపీకి కొత్త అధ్యక్షుడు



**హైదరాబాద్, ఆగస్టు 7, పెన్ పవర్:**
గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఏ క్షణంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అక్కడ అన్ని రాజకీయ పార్టీలు సన్నాహాలు మొదలుపెట్టాయి కూడా. ఈ విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ ముందు వరుసలో ఉంది. మరోవైపు భారత రాష్ట్ర సమితి సైతం గట్టిగానే ప్రయత్నాలు చేయనుంది. బిజెపి సైతం బలమైన అభ్యర్థులను రంగంలోకి దించాలని చూస్తోంది. సాధారణంగా గ్రేటర్ హైదరాబాద్ అంటే ఆంధ్ర సెటిలర్స్ ఎక్కువగా ఉంటారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఏ క్షణంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అక్కడ అన్ని రాజకీయ పార్టీలు సన్నాహాలు మొదలుపెట్టాయి కూడా. ఈ విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ ముందు వరుసలో ఉంది. మరోవైపు భారత రాష్ట్ర సమితి సైతం గట్టిగానే ప్రయత్నాలు చేయనుంది. బిజెపి సైతం బలమైన అభ్యర్థులను రంగంలోకి దించాలని చూస్తోంది. సాధారణంగా గ్రేటర్ హైదరాబాద్ అంటే ఆంధ్ర సెటిలర్స్ ఎక్కువగా ఉంటారు. అందుకే అందరి దృష్టి వారిపై ఉంది. మరోవైపు జనసేన సైతం అభ్యర్థులను బరిలో దించి కీలక స్థానాలను కైవసం చేసుకోవాలని చూస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ పాత్ర ఎలా ఉండబోతుంది అనేది చర్చ. మొన్నటి
సార్వత్రిక ఎన్నికలతో పాటు అంతకుముందు అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి పోటీ చేయలేదు. ఇప్పుడు గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటాలని ఆ పార్టీ ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ముందుగా తెలంగాణలో పార్టీ అధ్యక్ష పదవి భర్తీ చేసి.. బలోపేతంపై ఫుల్ ఫోకస్ పెట్టాలన్నది ఆలోచనగా తెలుస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికలతో పాటు సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయలేదు. మొన్నటి స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం బరిలో దిగలేదు. కానీ ఆ పార్టీ సానుభూతిపరులు కొన్నిచోట్ల పోటీ చేసి విజయం అందుకున్నారు. అయితే ఎందుకో తెలంగాణ టిడిపి విషయంలో చంద్రబాబు దూకుడుగా నిర్ణయాలు
తీసుకోలేదు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి అక్కడ అన్ని రాజకీయ పార్టీలు టిడిపి వైపు ఆశగా ఎదురు చూసేవి. కానీ తెలంగాణ సెంటిమెంట్ పుణ్యమా అని టిడిపి విషయంలో జరిగిన విష ప్రచారం కూడా ఎక్కువ. టిడిపి పోటీ చేసిన ప్రతిసారి కెసిఆర్ చంద్రబాబును బూచిగా చూపి లాభపడ్డారు. దీనిని గ్రహించిన చంద్రబాబు 2023 ఎన్నికల్లో పూర్తిగా పోటీ చేయలేదు. అప్పుడు భారత రాష్ట్ర సమితి
ఓడిపోయింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయకపోవడంతో.. మళ్లీ బీఆర్ఎస్ ఓడిపోయింది. అంటే చంద్రబాబు పై ఉన్న వ్యతిరేక ప్రచారాన్ని కెసిఆర్ అంతకు ముందు క్యాష్‌చేసుకున్నారన్నమాట. తెలంగాణలో సెంటిమెంట్ అనేది పూర్తిగా కనుమరుగయ్యింది. ప్రస్తుతం అభివృద్ధి అజెండాను తెలంగాణ ప్రజలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అందుకే టిడిపి బలోపేతానికి ఇదే సరైనసమయం అని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగా తెలంగాణ టిడిపి అధ్యక్ష బాధ్యతలను భర్తీ చేయాలని చూస్తున్నట్లు సమాచారం. తెలంగాణలో పార్టీని యాక్టివ్ చేస్తే చాలా మంది నేతలు ఆ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే మాజీ మంత్రి బాబు మోహన్, మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి పార్టీలో పని చేసేందుకు ముందుకు వచ్చారు. మీరే కాదు పదుల సంఖ్యలో నాయకులు తిరిగిటిడిపిలోకి క్యూ కట్టే అవకాశం ఉంది. చాలామంది చంద్రబాబుకు స్వచ్ఛందంగా టచ్ లోకి వస్తున్నారని కూడా తెలుస్తోంది. తెలంగాణ టిడిపి బాధ్యతలు తీసుకునేందుకు చాలా మంది నేతలు ఇప్పుడు
ముందుకు వస్తున్నారు. భారత రాష్ట్ర సమితి నాయకత్వాన్ని విభేదిస్తూ బయటకు వచ్చారు కవిత. ఆమె సైతం టిడిపిలో పనిచేసేందుకు అప్పట్లో ముందుకు వచ్చారని ప్రచారం సాగింది. అయితే నందమూరి కుటుంబం నుంచి మహిళా నేతగా ఉన్న హరికృష్ణ కుమార్తె సుహాసిని సైతం ప్రస్తుతం ఉపాధ్యక్షురాలుగా ఉన్నారు. మరోవైపు నందమూరి తారకరత్న భార్య అలేఖ్య రెడ్డి సైతం బాధ్యతలు అప్పగిస్తే తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. బిసి వర్గానికి చెందిన అరవింద్ కుమార్ గౌడ్ సైతం పార్టీ అధ్యక్ష బాధ్యతలు ఆశిస్తున్నారు. అయితే ముందుగా బలమైన నేతలను చేర్చుకొని తర్వాత అధ్యక్ష బాధ్యతలను అప్పగిస్తారని టిడిపిలో ఒక ప్రచారం ఉంది. మరి అందులో నిజం ఎంత ఉందో తెలియాలి.

# సరళా సాగర్ ప్రాజెక్టు...

**వరంగల్, ఆగస్టు 7, పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లా మదనాపూర్ మండలంలోని చిన్నవాగు (ఊకచెట్టు వాగు)పై ఉన్న సరళా సాగర్ ప్రాజెక్టు సాధారణ ఆనకట్టలకు భిన్నమైనది. గేట్లు ఎత్తాల్సిన అవసరం లేకుండా, విద్యుత్‌సహాయం లేకుండా కేవలం గాలి--నీటి పరస్పర చర్యతో ఆటోమేటిక్‌గా పనిచేసే ఈ వ్యవస్థ ఇప్పటికీ ఇంజనీర్లను ఆశ్చర్యపరుస్తోంది. ఇది స్థానిక వనరులు, విదేశీ సాంకేతిక జ్ఞానం, భౌతిక శాస్త్ర సూత్రాలసమ్మేళనంగా నిలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లా మదనాపూర్ మండలంలోని చిన్నవాగు (ఊకచెట్టు వాగు)పై ఉన్న సరళా సాగర్ ప్రాజెక్టు సాధారణ ఆనకట్టలకు భిన్నమైనది. గేట్లు ఎత్తాల్సినఅవసరం లేకుండా, విద్యుత్ సహాయం లేకుండా కేవలం గాలి--నీటి పరస్పర చర్యతో ఆటోమేటిక్‌గా పనిచేసే ఈ వ్యవస్థ ఇప్పటికీ ఇంజనీర్లను ఆశ్చర్యపరుస్తోంది. ఇది స్థానిక వనరులు, విదేశీ సాంకేతికజ్ఞానం, భౌతిక శాస్త్ర సూత్రాల సమ్మేళనంగా నిలుస్తుంది. 1940 చివరలో వనపర్తి సంస్థానాధీశులు రాజా రామేశ్వరరావు ఈ ప్రాజెక్టును రూపొందించారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో సైఫన్ టెక్నాలజీనిచూసిన తర్వాత, దానిని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అనుసరించారు. తల్లి సరళాదేవి పేరు మీద ఈ ఆనకట్టకు పేరు పెట్టారు. 1949లో పునాదులు వేయబడి 1959లో పూర్తయిన ఈ ప్రాజెక్టు
స్వాతంత్ర్యానంతర కాలంలోనే సాగునీటి రంగంలో కొత్త మార్గం చూపింది. ఇది కేవలం నీటి నిల్వ కాకుండా, మానవ ప్రమేయం లేని ఆటోమేటిక్ వ్యవస్థగా రూపొందింది. సాధారణ ఆనకట్టల్లో గేట్లు తెరిచిమూయాల్సి వస్తుంది. కానీ ఇక్కడ క్యూ ఆకారంలోని గొట్టాలు (సైఫన్లు) అమర్చబడ్డాయి. ఇవి ఫిజిక్స్‌లోని వాక్యూమ్ సూత్రం మీద ఆధారపడి పనిచేస్తాయి. డ్యాంలో నీటి మట్టం నిర్ణీత స్థాయిని దాటగానేగొట్టాల్లోకి నీరు చేరుతుంది. మరింత పెరిగితే గాలి పూర్తిగా బయటకు వెళ్లి శూన్యత ఏర్పడుతుంది. ఆ ప్రెజర్ తేడా వల్ల నీరు వేగంగా కిందకు లాగబడి నదిలోకి ప్రవహిస్తుంది. నీటి మట్టం తగ్గగానే గాలి తిరిగిప్రవేశించి ప్రవాహం ఆగిపోతుంది. ఇలా గేట్లు, మోటార్లు లేదా మానవ నియంత్రణ అవసరం లేకుండా పూర్తి స్వయంచాలకంగా నడుస్తుంది. ఆసియాలో ఇలాంటి సైఫన్ వ్యవస్థ ఉన్న ప్రాజెక్టుల్లో ఇది రెండోది. చిన్న సామర్థ్యం (సుమారు 0.5 టీఎంసీ) ఉన్నప్పటికీ, వేల ఎకరాల సాగుకు మద్దతు ఇస్తూ స్థిరమైన నీటి నిర్వహణకు ఉదాహరణగా నిలుస్తోంది. సుమారు 4,500 ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు స్థానిక రైతులకు జీవనాధారంగా మారింది. వర్షాధార ప్రాంతాల్లో నీటి లభ్యతను నిర్ధారించడం ద్వారా పంటల ఉత్పాదకతను పెంచింది. ఇలాంటి సహజ ఆధారిత పరిష్కారాలునేటి కాలంలో మరింత అవసరం. వాతావరణ మార్పులు, విద్యుత్ కొరత, నిర్వహణ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో సరళా సాగర్ లాంటి మోడళ్లు స్ఫూర్తినిస్తాయి. ఈ వ్యవస్థ గురుత్వాకర్షణ, వాతావరణ పీడనం, శూన్యత వంటి ప్రాథమిక సూత్రాలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. నీరు పైనుంచి కిందకు ప్రవహించే సహజ ధోరణిని నియంత్రించడం ద్వారా వరద నీటిని సురక్షితంగా విడుదలచేస్తుంది. ఇది పర్యావరణపరంగా కూడా లాభదాయకం. విద్యుత్ వినియోగం లేకపోవడం, యంత్రాల నిర్వహణ ఖర్చు తగ్గడం, దీర్ఘకాలిక మన్నిక పెరగడం వంటి ప్రయోజనాలు ఉన్నాయి. ఆధునిక ఇంజనీర్లు ఈ సాంకేతికతను చూసి ఆశ్చర్యపోవడం సహజం, ఎందుకంటే ఇప్పటి అధునాతన సెన్సార్లు, కంప్యూటర్ నియంత్రణలు లేకుండానే దశాబ్దాలుగా నమ్మకంగా పనిచేస్తోంది. సరళా సాగర్ కేవలం ఒక
ఆనకట్ట కాదు. ఇది మానవ ఆలోచన, ప్రకృతి శక్తుల సమన్వయానికి ప్రతీక. విదేశీ సాంకేతికతను స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చి, దీర్ఘకాలం నిలిచే వ్యవస్థను సృష్టించడం దీని గొప్పతనం.

ఆధునిక ప్రాజెక్టులు సంక్లిష్ట యంత్రాలపై ఆధారపడుతున్నప్పుడు, ఇలాంటి సాధారణమైన కానీ సమర్థవంతమైన పరిష్కారాలను పునఃసమీక్షించాల్సిన అవసరం ఉంది.

# బరి తెగించిన విద్యాసంస్థలు

**హైదరాబాద్, ఆగస్టు7, పెన్ పవర్:**
ఇది మామూలు మోసం కాదు. వాళ్లు మామూలు వ్యక్తులు కాదు. చేసిన పన్నాగం అంతకుమించిన స్థాయిలో ఉంది. వాళ్ళు ఏకంగా హైడ్రా రంగనాథ్ కే టోపీ పెట్టారు. హైదరాబాద్ నగరంలో ఆక్రమణలులేకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా అనే వ్యవస్థను ఏర్పాటు చేసింది.. దీని ద్వారా చెరువులను.. కుంటలను.. నాలాలాను కాపాడే ప్రయత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో హైడ్రా వ్యవస్థ
అత్యంత దూకుడుగా పని చేస్తోంది. ఇది మామూలు మోసం కాదు. వాళ్లు మామూలు వ్యక్తులు కాదు. చేసిన పన్నాగం అంతకుమించిన స్థాయిలో ఉంది. వాళ్ళు ఏకంగా హైడ్రా రంగనాథ్ కే టోపీ పెట్టారు. హైదరాబాద్ నగరంలో ఆక్రమణలు లేకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా అనే వ్యవస్థను ఏర్పాటు చేసింది.. దీని ద్వారా చెరువులను.. కుంటలను.. నాలాలాను కాపాడే ప్రయత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో హైడ్రా వ్యవస్థ అత్యంత దూకుడుగా పని చేస్తోంది. హైడ్రా కమిషనర్ గా రంగనాథ్ ఆక్రమణల విషయంలో ఉక్కు పాదం మోపుతున్నారు. ఏ మాత్రం దాన్ని కదుగు వేయకుండా ఆక్రమణలనుపడగొడుతున్నారు. చెరువులను కాపాడుతున్నారు. ప్రకృతి వనరులను సంరక్షిస్తున్నారు. హైడ్రా రంగనాథ్ చేస్తున్న మంచి పనులను కొంతమంది జీర్ణించుకోలేకపోతున్నారు. అక్రమార్కులు కోర్టులలోపిటిషన్లు దాఖలు చేసి.. ఆయన కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారు. ప్రభుత్వ లక్ష్యం మీద నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు. అక్రమార్కుల వ్యవహార శైలి ఇలా ఉంటే.. కార్పొరేట్ కాలేజీ నిర్వాహకుల తీరు
మరో విధంగా ఉంది. వీరు ఏకంగా ఫైర్ ఎన్‌ఓసిపై రంగనాథ్ కే టోపీ పెట్టారు. సంతకాలు ఫోర్జరీ చేశారు. ఏకంగా ఇంటర్ బోర్డుకు సబ్మిట్ చేశారు. అధికారులు సంతకం ఫోర్జరీ జరిగిందని విచారణలోగుర్తించారు. ఆ ఎనిమిది కాలేజీలకు సంబంధించిన గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్ బోర్డుకు ఇప్పటికే ఫిర్యాదు అందింది. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ 8 కాలేజీ ల మీద లేక్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.
బర్కత్పురా ప్రాంతానికి చెందిన హైందవి జూనియర్ కాలేజీ.. ఎస్ ఆర్ నగర్ కు చెందిన రేసోనన్స్ జూనియర్ కాలేజీ.. మెహదీపట్నం కి చెందిన ప్రియాంక జూనియర్ కాలేజీ.. విద్యానగర్ ప్రాంతానికి చెందినమదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజీ.. చాంద్రాయణ గుట్ట ప్రాంతానికి చెందిన శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ.. చిక్కడపల్లికి చెందిన న్యూ ఎరా కాలేజీ.. శివరాంపల్లికి చెందిన షాహీన్ జూనియర్ కాలేజీ.. తెల్లాపూర్
ప్రాంతానికి చెందిన వశిష్ట జూనియర్ కాలేజీ నిర్వాహకుల మీద పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంకా 60 కాలేజీల ఎన్‌ఓసి లను కూడా స్క్రూట్ ని చేస్తున్నట్టు పోలీసు అధికారులుప్రకటించారు. హైదరాబాద్ నగరంలో ఫైర్ ఎన్‌ఓసి జారీ చేసే విషయంలో హైడ్రా అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. అన్ని నిబంధనలు పాటించిన కాలేజీలకు మాత్రమే ఎన్వోసీ ఇస్తోంది. కాలేజీ గుర్తింపు రద్దుఅవుతుంది. అందువల్లే కాలేజీ యాజమాన్యాలు ఈ దుర్మార్గానికి పాల్పడ్డాయి. హైడ్రా రంగనాథ్ కు ఏకంగా టోపీ పెట్టిన ఈ కాలేజీ యాజమాన్యాల మీద కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ కాలేజీ యాజమాన్యాల మీద ఇప్పటికే పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఉపక్రమిస్తున్నారు.

# ‘ఇలాగైతే కుబేరుడూ కూలికి వెళ్తాడు’

-3 పేజి తరువాయి
వినిపిస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చి రెండేళ్లయినా సొమ్ము చెల్లించలేదన్నారు. ఈ దశలో న్యాయమూర్తి స్పందిస్తూ “అధికారులు ఏం చేయగలరు? మనకు వచ్చే ఆదాయమెంత. ఖర్చెంత? రాష్ట్ర బడ్జెట్‌లో జీతాలు, అప్పులకూ పోను.. మిగిలినదంతా సంక్షేమ పథకాలకే వెచ్చించే పరిస్థితి. లబ్ధిదారులు బైక్, ఐఫోన్‌తో ఉచిత బియ్యం కోసం వెళుతున్నారు. కోటీశ్వరులకూ రైతుబంధు ఇవ్వడమేంటి? ప్రభుత్వంపై ఎంత భారం పడుతోంది? భవిష్యత్తులో పిల్లలకు ఏం మిగులుతుంది” అని ప్రశ్నించారు.

**ఒక్క తెల్లకార్డునైనా తొలగించగలరా?**

రాష్ట్రంలో ఇన్ని ఉచిత పథకాల అమలుపై న్యాయమూర్తి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ.. “ఒక తెల్లకార్డునైనా తొలగించగలరా? అలా తొలగిస్తే అదో రాజకీయమవుతుంది. ప్రభుత్వ శాఖాపరమైన వ్యవహారాల్లో ఒక్కో అధికారిపై 3 నుంచి 4 వేల కేసులున్నాయి. ప్రస్తుత అధికారిపై 100కు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏ అధికారైనా ఏమీ చేయలేరు. రేపు మీరే ముఖ్యమంత్రి అయినా ఏమీ చేయలేని పరిస్థితి. ఇది రాజకీయ ఉపన్యాసం కాదు. ఆవేదనతో చెబుతున్నా. అప్పులు తీర్చడానికి ప్రభుత్వ భూములను విక్రయిస్తుంటే భవిష్యత్తు తరాల పరిస్థితి ఏమిటి?
అప్పు చేసి ఎవరైనా బెంజ్ కారు కొంటారా, ఎర్రబస్సులో వెళ్లే వాళ్లం.. ఎయిర్‌బస్‌లో వెళతామంటే ఆ కుటుంబం ఎంత కాలం నిలబడుతుంది? రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలుంటే 1.03 కోట్ల కుటుంబాలకు ఉచిత పథకాలు అందిస్తున్నారు. ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఇది దీర్ఘకాలం ఆచరణ సాధ్యం కాదు. సమాజం ప్రమాదంలో పడబోతోంది. ఇవన్నీ ఎంతవరకు సాధ్యమో ప్రభుత్వాలే తెలుసుకోవాలి” అని న్యాయమూర్తి అన్నారు. ప్రస్తుత కేసులో చెల్లింపులకు సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలని చెబుతూ విచారణను 19కి వాయిదా వేశారు.

# గ్రాడ్యుయేట్ ఎన్నికల కోసం కమలం, హస్తం వ్యూహాలు

**హైదరాబాద్, ఆగస్టు 7, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఎమ్మెల్సీ ఎన్నికల వేడి ప్రారంభం కాబోతోంది. హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్, అలాగే వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల స్థానాల గడువు2027 మార్చి నాటితో ముగియనుండటంతో, కేంద్ర ఎన్నికల సంఘం మరో రెండు మూడు నెలల్లోనే కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టేందుకు సమాయత్తమవుతోంది. రాజకీయ పార్టీల్లోఅభ్యర్థుల ఎంపిక, ఓటర్ల నమోదు బాధ్యతలపై ముందస్తు చర్చలు జోరందుకున్నాయి. సాధారణంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోరు అనగానే కేవలం ఓటింగ్ కాకుండా, దానికి ముందు ఓటర్లుగా పట్టభద్రులనుసంతృప్తికరంగా నమోదు చేయించడమే అభ్యర్థి సగానికి పైగా గెలుపును నిర్ణయిస్తుంది. దీంతో ప్రధాన పార్టీలు రంగంలోకి దిగకముందే ఆశావహులు తమ స్థాయిలో గ్రౌండ్ వర్క్ ప్రారంభించారు. పట్టభద్రులనియోజకవర్గ ఎన్నికలు అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికల తరహాలో ఉండవు. ప్రతి ఆరేళ్లకు ఒకసారి పాత ఓటర్ల జాబితా రద్దయి కొత్తగా ఫారం-18 ద్వారా ఓటర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈక్రమంలో ఏ పార్టీ అయితే ముందుగానే తమ అభ్యర్థిని ఖరారు చేస్తుందో, ఆ నాయకుడే సొంత వ్యయంతో, నెట్‌వర్క్‌తో పట్టభద్రులతో ఫారాలు పూర్తి చేయించి ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తారు. ఓటర్ల నమోదులో ఆధిక్యత సాధించిన అభ్యర్థికే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లు పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందుకే నోటిఫికేషన్ రాకముందే టికెట్ ఆశిస్తున్న నాయకులు డిగ్రీ కళాశాలలు,ఉద్యోగుల సంఘాలు, ఐటీ కంపెనీలు , సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల వేదికగా తమ ప్రచార పర్వాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలో ఈసారి అభ్యర్థుల పోటీ తీవ్రంగా ఉంది. సామ రామ్మోహన్ రెడ్డి వంటి యువ నేతలు పోటీకి రెడీ అవుతున్నారు. మరోవైపు, ఉపఎన్నికలో గెలిచిన తీన్మార్ మల్లన్న మళ్లీ పోటీకిఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. తన సోషల్ మీడియా నెట్‌వర్క్, గ్రాడ్యుయేట్ గ్రూపులతో పాటు గతంలో సంపాదించిన ఓటు బ్యాంకును నిలబెట్టుకోవడానికి ఆయన క్షేత్రస్థాయిలోకసరత్తు మొదలుపెట్టారు. మరోవైపు భారతీయ జనతా పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. పట్టభద్రులు, పట్టణ ప్రాంత విద్యావంతులు, ఉద్యోగులుసాంప్రదాయకంగా తమకే అనుకూలంగా ఉంటారనేది బీజేపీ నమ్మకం. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానంలో గతంలో ఎన్. రామచందర్‌రావు విజయం సాధించిన చరిత్ర ఉండటంతో, ఈ సీటునుతిరిగి కైవసం చేసుకోవాలని కమలం పార్టీ పట్టుదలతో ఉంది. సీనియర్ నాయకులతో పాటు యువ మోర్చా, విద్యార్థి సంఘాల రికార్డు ఉన్న నాయకులు ఈ సీటు నుంచి పోటీ చేసేందుకు ఆసక్తిచూపుతున్నారు. బీజేపీ సైతం ఓటర్ల నమోదు ప్రారంభమయ్యే నాటికే అధికారికంగా లేదా సూచనప్రాయంగా అభ్యర్థులను ప్రకటించి ఫీల్డ్‌లోకి దించాలని భావిస్తోంది. ఈ మొత్తం సమీకరణాల్లో బీఆర్ఎస్ పార్టీవైఖరి ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల అనంతరం గులాబీ పార్టీ తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోంది. అయితే పట్టభద్రుల ఓటర్లలో మళ్లీ పట్టు సాధించకపోతే అర్బన్ ఓటర్లలో పార్టీప్రభావం తగ్గిపోతుందనే ఆందోళన బీఆర్ఎస్ అధిష్టానంలో ఉంది. మరి బీఆర్ఎస్ తరఫున పోటీ ఉంటుందా లేదా అంటే.. కచ్చితంగా అభ్యర్థులను నిలబెట్టక తప్పని పరిస్థితి. అయితే అధికార కాంగ్రెస్,దూకుడు మీదున్న బీజేపీని తట్టుకుని, ఆర్థికంగా, యంత్రాంగ పరంగా ఓటర్ల నమోదు ప్రక్రియను భుజాన వేసుకునే బలమైన అభ్యర్థిని వెతకడమే బీఆర్ఎస్‌కు పెద్ద పరీక్షగా మారింది. వాట్సాప్ గ్రూపులు,యూట్యూబ్ ఛానెళ్లు, ఫేస్‌బుక్ ఐటీ కమ్యూనిటీలలో ఇప్పటికే ఓటర్ల నమోదు అవగాహన ప్రచారాలు మొదలయ్యాయి. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఉద్యోగుల పీఆర్సీ, పెన్షన్ సవరణలు వంటిఅంశాలు ప్రధాన ఎన్నికల అజెండాగా మారనున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు రంగానికి చెందిన నిరుద్యోగ పట్టభద్రులు ఎటువైపు మొగ్గు చూపుతారనే అంశం గెలుపోటముల్ని నిర్ణయించనుంది. రాబోయే మార్చి నాటికి ముగిసే ఈ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ఎన్నికలు కేవలం ఇద్దరు ఎమ్మెల్సీలను ఎన్నుకోవడమే కాకుండా,రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనపై పట్టభద్రుల తీర్పుగా, బీజేపీ అర్బన్ ఇమేజ్‌కు సవాలుగా, అలాగే బీఆర్ఎస్ పుంజుకునేందుకు లభించే అవకాశంగా మారనున్నాయి. ఓటర్ల నమోదు నాటికేఅభ్యర్థులను ఖరారు చేసి వ్యూహాత్మకంగా అడుగులు వేసే పార్టీకే విజయావకాశాలు మెండుగా ఉంటాయని అనుకోవచ్చు.

## టెక్నో, ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ పేర్లపై విద్యశాఖ నిఘా

**హైదరాబాద్, ఆగస్టు7, పెన్ పవర్:**
మీరుండే ఏరియాలోనో, ఊర్లోనో ఉండే ప్రైవేటు స్కూల్స్ పేర్లను ఎప్పుడైనా గమనించారా..? కచ్చితంగా ప్రైవేట్ స్కూల్ పేర్లలో ఇంటర్నేషనల్, టెక్నో, ఒలింపియాడ్, టాలెంట్ వంటి పదాలు కనిపిస్తాయి. అయితే అటువంటి పదాలను స్కూల్ నేమ్ బోర్డులో వాడొద్దనే రూల్ ఉందనే విషయం తెలుసా..? అటువంటి పేర్లు ఉపయోగించరాదని రాష్ట్ర ప్రభుత్వం 2009లో జారీ చేసిన జీవో నెం.91 స్పష్టంగాపేర్కొన్నప్పటికీ.. చాలా జిల్లాల్లో ఇప్పటికీ వందలాది పాఠశాలలు ఈ నిబంధనను ఉల్లంఘిస్తున్నట్లు తేలింది. ప్రభుత్వం నిషేధించిన ఈ పేర్లను కొనసాగిస్తూ కొన్ని విద్యాసంస్థలు తల్లిదండ్రులనుఆకర్షిస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాల విద్యాశాఖ అధికారిక డేటాబేస్ ఆధారంగా నిర్వహించిన విశ్లేషణ ప్రకారం.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని మొత్తం 3,697 పాఠశాలల్లో కనీసం601 స్కూల్స్ అంటే దాదాపు 16.3 శాతం విద్యాసంస్థలు, నిషేధిత పదాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పదాలను తమ పేర్లలో కొనసాగిస్తున్నాయని తేలింది. వీటిలో అత్యధికంగా మోడల్ అనేపదం 210 పాఠశాలల పేర్లలో ఉండగా.. టాలెంట్ 73, ఇంటర్నేషనల్ 72 పాఠశాలల పేర్లలో కనిపించింది. అదనంగా కాన్సెప్ట్, ఎక్సలెన్స్, బ్రిలియంట్, క్రియేటివ్ వంటి పదాలు కూడా విస్తృతంగావినియోగంలో ఉన్నట్లు గుర్తించారు. 2009లో జారీ చేసిన జీవో-91 ప్రకారం.. ఇటువంటి పేర్లు పాఠశాలలు పెట్టుకుంటే ఇతర సంస్థల కంటే మెరుగైన విద్య అందిస్తున్నాయనే తప్పుడు అభిప్రాయాన్నితల్లిదండ్రుల్లో కలిగిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. ఈ పేర్లను ఆధారంగా చేసుకుని అధిక ఫీజులు వసూలు చేసే అవకాశం ఉందన్న కారణంతో ఈ నిబంధన తీసుకొచ్చారు. అయినప్పటికీ దాదాపు 17సంవత్సరాలు గడిచినా ఆ ఉత్తర్వుల అమలు పూర్తిస్థాయిలో జరగలేదని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. విద్యావేత్తలు ఈ ధోరణిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహా పేర్లు విద్యా నాణ్యతకు కొలమానంకావని, కేవలం తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ఉపయోగించే మార్కెటింగ్ వ్యూహాలేనని మాజీ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ శాంతా సిన్హా పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లోవిద్య కూడా ఒక వస్తువులా మారిపోయిందని, పిల్లలకు మంచి విద్య అందించాలనే తల్లిదండ్రుల ఆకాంక్షను కొందరు విద్యాసంస్థలు బ్రాండింగ్ ద్వారా వినియోగించుకుంటున్నారని ఆమెవ్యాఖ్యానించారు. తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై శేఖర్ రావు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇంటర్నేషనల్, మోడల్, టెక్నో వంటి పదాలను చూసి చాలామంది తల్లిదండ్రులు ఆ పాఠశాలలు మెరుగైన విద్య అందిస్తాయని భావిస్తున్నారని, కొందరు యాజమాన్యాలు ఈ అభిప్రాయాన్ని మార్కెటింగ్ సాధనంగా ఉపయోగిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వఉత్తర్వులు ఉన్నప్పటికీ వాటి అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందని, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు. ఈ విషయంపై హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య స్పందిస్తూ.. రెండు సంవత్సరాల క్రితం నిబంధనలను ఉల్లంఘించిన పలు పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత కొన్ని విద్యాసంస్థలు తమ పేర్లనుమార్చుకున్నాయని..ప్రస్తుతం కొత్తగా గుర్తింపు కోసం వచ్చే పాఠశాలలకు నిషేధిత పదాలతో పేర్లకు అనుమతి ఇవ్వడం లేదని చెప్పారు. ఇదిలా ఉండగా, కొందరు తల్లిదండ్రులు కూడా పాఠశాల పేర్లు తమ నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్నాయని అంగీకరిస్తున్నారు.

# ఘనంగా ముందస్తు బోనాల వేడుకలు

## విశ్వశాంతి విద్యాలయంలో భక్తి పారవశ్యం

## విద్యార్థులతో కళకళలాడిన పాఠశాల ప్రాంగణం



ముందస్తు బోనాల వేడుకల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యం

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 7:** తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా, అమ్మవారి భక్తి సంప్రదాయానికి నిదర్శనంగా నిలిచిన బోనాల పండుగను పురస్కరించుకుని గార్ల మండల కేంద్రంలోని స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో శుక్రవారం ముందస్తు బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యాలయం ఆవరణ అంతా పండుగ శోభతో కళకళలాడగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని భక్తి భావాన్ని చాటిచెప్పారు.ఈ కార్యక్రమానికి విద్యాలయ కరస్పాండెంట్ వద్లమూడి దుర్గాప్రసాద్, బీరవెల్లి సంజీవరెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి, సంప్రదాయబద్ధంగా బోనం సమర్పించి పాలకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి విశ్వాసాలకు ప్రతీక అని ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందించే గొప్ప వేడుకని విద్యార్థులు చిన్నప్పటి నుంచే మన పండుగల విశిష్టతనుతెలుసుకొని,సంస్కృతి--సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అనంతరం విద్యార్థులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి సంప్రదాయ దుస్తులు ధరించి బోనాల ఎత్తుకొని దేవతమూర్తుల పాటలకు, నృత్యాలు వేశారు విద్యాలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది.ఈ కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయ ప్రిన్సిపల్ రమేష్, ఉపాధ్యాయ, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సదస్సును విజయవంతం చేయాలి

## గార్ల మండల స్థాయి సమావేశంలో జిల్లా నాయకుల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నాయకులు జన్ను దినేష్

**గార్ల, పెన్ పవర్ ఆగస్టు 7:** సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎంఆర్పీఎస్--ఎంఎస్పీ నూతన మండల కమిటీల జాతీయ సదస్సును విజయవంతం చేయాలని ఎంఆర్పీఎస్--ఎంఎస్పీ జిల్లా నాయకులు జన్ను దినేష్ ఏకు శంకర్ లు పిలుపునిచ్చారు. ఈ మేరకు గార్ల మండల కేంద్రంలోని స్థానిక వర్తక సంఘం భవనంలో శుక్రవారం మండల ఇంచార్జ్ ఇరుగు రవీందర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు సామాజిక న్యాయం సాధన, ఎస్సీ వర్గీకరణ అమలు, మాదిగల హక్కుల పరిరక్షణ కోసం ఎంఆర్పీఎస్ ఉద్యమం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. వరంగల్‌లో జరగనున్న జాతీయ సదస్సు ఉద్యమ చరిత్రలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.గార్ల మండలంలోని ప్రతి గ్రామం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, యువత, మహిళలు సదస్సుకు హాజరయ్యేలా ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరు సదస్సు విజయవంతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆరోగ్యశ్రీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్ పి కొరవి మండల ఇన్చార్జి దూడపంగు శ్రీనివాస్ బాసి పంగు జయరాజు గార్ల మండల నాయకులు కొత్తపల్లి వెంకన్న సిరిపంగి నారాయణ ఇల్లుటూరి శ్రీనివాస్ ఇమ్మడి వెంకన్న పుల్లూరు వెంకటేశ్వర్లు బొజ్జ బిక్షం పందుల కృష్ణ జిల్ల పల్లి వెంకటేశ్వర్లు అంకె పాక కిరణ్ కుమార్ బాసిపంగు చిరంజీవి చిలుకూరి పెద్ద వెంకన్న గిన్నారపు మురళి తారక రామారావు పందుల పృథ్వి గడ్డం శ్రీశైలం ఏలూరు సాయికుమార్ కాంపాటి హర్షవర్ధన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# భర్తను చంపేందుకు భార్య భారీ స్కెచ్



భార్యాభర్తలు (ఫైల్)



ప్రియుడు (ఫైల్)

**ఖమ్మం, పెన్ పవర్, ఆగస్టు 7:** వివాహేతర సంబంధం నేపథ్యంలో తన భార్య తన ప్రియుడితో కలిసి తనను చంపాలని చూస్తుందని ఒక వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు ఘటన వెలుగులోకి వచ్చింది. తన భార్య, ఒక కొరియర్ బాయ్ తో అక్రమ సంబంధం పెట్టుకొని. తానును హత్య చేయడానికి ప్లాన్ చేస్తున్నాడని భర్త ఆరోపిస్తూ మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామానికి చెందిన గాదే రాజేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.బాధితుడి కథనం ప్రకారం, సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన భవానితో 2016లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తాను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తుండగా, నివాసం మాత్రం ఏదులాపురం మున్సిపాలిటీలోని సాయి గణేష్ నగర్ లో ఉంటున్నాడు. ఈ క్రమంలో భార్యకు కొరియర్ బాయ్ సైదులుతో వివాహేతర సంబంధం ఏర్పడిందని ఆరోపించారు.గత నెల 27న మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వెళ్లగా, తన భార్య మరో వ్యక్తితో సన్నిహితంగా ఉండడాన్ని చూసి అనుమానం నిజమైందని పేర్కొన్నారు. మరుసటి రోజు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించిన అనంతరం తన అన్నను తీసుకురావడానికి వెళ్తుండగా సైదులు తనను వెంబడించాడని ఆరోపించారు. అక్కడి నుంచి తప్పించుకుని ఇంటికి చేరిన అనంతరం భార్య మొబైల్ ఫోన్‌ను పరిశీలించగా, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో తనను ఎలాగైనా చంపాలని, ఇంట్లో కాకుండా బయట ప్రమాదంలా కనిపించేలా యాక్సిడెంట్ చేయించాలని, లేదంటే తాను చనిపోతానంటూ ప్రియుడికి పంపినట్లు ఆరోపిస్తున్న సందేశాలు కనిపించాయని తెలిపారు.ఆ చాటింగ్ స్క్రీన్‌షాట్లను సేకరించి ఈ నెల 1న డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో భార్య, ఆమెతో సంబంధం ఉన్న వ్యక్తిపై ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ విషయమై ఖమ్మం రూరల్ పోలీసులను వివరణ కోరగా, ఫిర్యాదు సీపీ కార్యాలయం ద్వారా తమకు ఎండార్స్ అవుతుందని, కేసు స్వభావాన్ని బట్టి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ కొనసాగుతోందని తెలిపారు.

# 102 మంది మహిళలతో బోనాల సమర్పణ

**హైదరాబాద్ పెన్ పవర్:** కొత్తపేట లోని శ్రీ ప్రసన్న మహంకాళి దేవాలయం నుండి వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం వరకు 102 మంది మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో భక్తిశ్రద్ధలతో బోనాలను శిరస్సుపై ధరించి ఊరేగింపుగా వెళ్లారు.ఈ వేడుకలు మన ఊరి కట్టుబాట్లను, భక్తిభావాన్ని మరియు తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటిచెప్పేలా సాగాయి.మహిళలందరూ కలిసికట్టుగా పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించడం భక్తిపారవశ్యాన్ని, మహిళా సమైక్యతను ప్రతిబింబించింది.

తెలుగుదనానికి, భక్తికి అద్దంపట్టే ఇటువంటి ఉత్సవాలు మన సాంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఎంతగానో తోడ్పడతాయి.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

# వర్షంలోనే వార్డుల బాట పట్టిన మంత్రి పొంగులేటి

- ఏదులాపురంలో క్షేత్రస్థాయి పర్యటన.. ప్రజల సమస్యలపై నేరుగా ఆరా
- రూ.100 కోట్ల నిధులతో మోడల్ మున్సిపాలిటీగా ఏదులాపురం రూపకల్పన

**ఖమ్మం, పెన్ పవర్, ఆగస్టు 7:** వర్షం కురుస్తున్నా వెనుకడుగు వేయలేదు. గొడుగు పట్టుకుని నేరుగా ప్రజల్లోకి వెళ్లారు. వార్డుల వీధుల్లో కాలినడకన పర్యటిస్తూ స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్‌తో కలిసి ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డులైన సాయిగణేష్ నగర్, ఇందిరమ్మ కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, వర్షపు నీటి పారుదల వంటి సమస్యలను ప్రజలు నేరుగా మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటన మధ్యలో సాయిగణేష్ నగర్‌లోని ఓ టీ దుకాణం వద్ద మంత్రి ఆగి స్థానికులతో కలిసి టీ తాగుతూ వారి సమస్యలను తెలుసుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలతో ఆప్యాయంగా మమేకమై వారి ఇబ్బందులను ఓపికగా విన్న మంత్రి, అభివృద్ధి పనుల్లో రాజీ ఉండదని స్పష్టం చేశారు.

ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా రూ.100 కోట్ల నిధులు మంజూరు చేశారని మంత్రి తెలిపారు. ఈ నిధులతో శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా మెరుగుదల, లోతట్టు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తుమ్మ చెట్ల తొలగింపు వంటి పనులను చేపట్టి రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా ఏదులాపురాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలకు సంబంధించిన అర్హుల దరఖాస్తులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు. మున్సిపాలిటీలో కొనసాగుతున్న పార్కుల అభివృద్ధి పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వార్డులలో పర్యటిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

# కలుపు మందు అమ్మితే కఠిన చర్యలు తప్పవు



పత్తి పంటను పరిశీలిస్తున్న (ఏడీఏ) అజ్మీరా శ్రీనివాస్ రావు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న (ఏడీఏ) అజ్మీరా శ్రీనివాస్ రావు.

**గార్ల ,పెన్ పవర్, ఆగస్టు 7:** నిషేధిత కలుపు మందు పారాక్వాట్ నిల్వ ఉంచినా, రైతులకు విక్రయించినా సంబంధిత పురుగు మందుల వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే షాపుల లైసెన్సులను సైతం రద్దు చేస్తామని మహబూబాబాద్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) అజ్మీరా శ్రీనివాస్ రావు హెచ్చరించారు.శుక్రవారం గార్ల మండలంలోని పుల్లూరు గార్ల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి రామారావుతో కలిసి పురుగు మందులు, ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో నిషేధిత పారాక్వాట్ కలుపు మందు నిల్వలు ఉన్నాయా, రైతులకు విక్రయిస్తున్నారా అని రికార్డులను పరిశీలించారు. పారాక్వాట్ అత్యంత విషపూరితమైన కలుపు మందు అని, దీని వినియోగం పంటలకు, భూసారానికి, పర్యావరణానికి హానికరమని తెలిపారు. ఈ కారణంగానే ప్రభుత్వం దీని విక్రయాన్ని నిషేధించిందని చెప్పారు. అయినప్పటికీ ఎవరైనా రైతులకు ఈ మందును విక్రయిస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.వ్యాపారులు ఎరువులు, పురుగు మందుల విక్రయాలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని దుకాణాల యజమానులకు సూచించారు. ప్రతి దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు నవీకరించడంతో పాటు, ధరల పట్టికను వినియోగదారులకు స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు.తనిఖీల అనంతరం పుల్లూరులోని పత్తి పంట పొలాలను సందర్శించిన ఏడీఏ అజ్మీరా శ్రీనివాస్ రావు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు, ముఖ్యంగా యూరియా, కాంప్లెక్స్ ఎరువులను పరిమితంగా ఉపయోగించాలని, వాటికి ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులు, సేంద్రియ ఎరువులను అధికంగా వినియోగించా లని సూచించారు. సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా భూమిలో సేంద్రియ కార్బన్ శాతం పెరిగి భూసారం మెరుగుపడటంతో పాటు పంటల దిగుబడులు కూడా మెరుగ్గా ఉంటాయని వివరించారు.పంటల సాగులో సమీకృత యాజమాన్య పద్ధతులను పాటించాలని, ప్రత్తి లో తొలి దశలో ఆశించే రసం పీల్చే పురుగులైన పేను బంక పచ్చ దోమ నివారణకు అసెటామాప్రిడ్ లేదా తియోమితక్సమ్ వంటి మందులను 13.0.45 తో కానీ 19.19.19 తో కానీ కలిపి వాడాలన్నారుఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి శాస్త్రీయ సలహాలతో సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది, ఎరువు పురుగు మందుల దుకాణాల యజమానులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం వెంటనే మూడో పిఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి



టీఈజీఏ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నాయక్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 7:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల కోసం ఎదురుచూస్తున్నారని, ముఖ్యంగా మూడో పీఆర్సీ కమిషన్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగావత్ శ్రీనివాస్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరాష్ట్రంలో సుమారు నాలుగు లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, లక్షన్నర మందికి పైగా ఉపాధ్యాయులు, లక్షలాది మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ పాలనలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ పథకాల అమలు, విద్య, వైద్యం, శాంతిభద్రతలు, పరిపాలన వంటి అన్ని రంగాల్లో వారి సేవలు అమూల్యమైనవని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమాన వేతనాలు, మెరుగైన సేవా సౌకర్యాలు కల్పిస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం మొదట 43 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిందని, అనంతరం తొలి పీఆర్సీ సిఫార్సుల మేరకు సుమారు 30 శాతం ఫిట్‌మెంట్ అమలు చేసిందన్నారు.

అయితే రెండో పీఆర్సీ అంశం పూర్తిగా పరిష్కారం కాకముందే మూడో పీఆర్సీ కమిషన్ ఏర్పాటుపై ప్రభుత్వం స్పందించకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోందని తెలిపారు.ఉద్యోగుల వేతన సవరణ, డీఏ బకాయిలు, పదోన్నతులు, ఖాళీ పోస్టుల భర్తీ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు తదితర అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఉద్యోగులు రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముకలుగా నిలుస్తున్న నేపథ్యంలో వారి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే మూడో పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి, ఉద్యోగులకు న్యాయం చేయాలని గంగావత్ శ్రీనివాస్ నాయక్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# చంద్రబాబు పార్టీలో ప్రకృతి.. సాగునీటి సమస్య తీర్చిన వరదలు



**హైదరాబాద్ పెన్ పవర్:** మానవ ప్రయత్నం ఎంత ఉన్నప్పటికీ... ప్రకృతి సహకరిస్తేనే ఏ పనైనా కొలిక్కి వస్తుంది. అది ప్రభుత్వమైనా, ప్రైవేటు వ్యక్తులైనా ప్రకృతి దయ లేనిదే ఆశించిన ఫలితం దక్కదంటారు. ఎండైనా, వానైనా, గాలైనా... ఈ సహజ పరిస్థితులు అనుకూలిస్తేనే అసలు సిసలు ఫలితం సాధ్యం. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, ద్రవ్యోల్బణం, ధరలు పెరుగుతాయనే ఆందోళనతో ప్రభుత్వాలు ఉక్కిరిబిక్కిరి అవుతుండటం తెలిసిందే. ఈ తరుణంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విషయంలో మాత్రం ప్రకృతి అసాధారణ రీతిలో సహకరిస్తుండటం విశేషంగా చెబుతున్నారు.

రాష్ట్రానికి నాల్గోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు తరచుగా వర్షాభావ పరిస్థితులపై ప్రత్యర్థుల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటుంటారు. ఆయన పాలనా కాలంలో సరిగా వర్షాలు కురవకపోతే ఆ నిందను ఆయనపై మోపేందుకు ఎప్పుడూ ఉత్సాహం చూపుతుంటారు. కానీ, ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందనే చెప్పాలని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏకంగా 50 శాతం మేర లోటు వర్షపాతం నమోదైనప్పటికీ, ప్రధాన ప్రాజెక్టులు మాత్రం జలకళను సంతరించుకోవడం రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. గత రెండు నెలల్లో దేశంలో 44.63 సెంటీమీటర్ల వర్షం కురవాల్సివుండగా, 39.55 సెం.మీ వర్షం మాత్రమే కురిసింది. ఇక ఏపీ విషయానికి వస్తే జూన్ 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 28.19 సెం.మీ. సాధారణ వర్షపాతం నమోదు అవ్వాల్సివుంది. కానీ ఇప్పటివరకు కేవలం 14.27 సెం.మీ. వర్షమే కురిసింది. అంటే దాదాపు 49.4 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలోని 28 జిల్లాల్లో కరువు పరిస్థితులపై ఆందోళనలు నెలకొన్నాయి. అయితే అదృష్టవశాత్తూ ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలో ప్రధాన నదులైన కృష్ణా, గోదావరికి భారీగా వరద వస్తోంది. దీంతో చాలావరకు సాగు, తాగునీటి సమస్య తీరినట్లైందని వ్యాఖ్యానిస్తున్నారు.ఒక విధంగా ఈ పరిస్థితి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి బాగా కలిసివచ్చిందని చెబుతున్నారు. ప్రధానంగా కృష్ణా నదికి గత కొద్దిరోజులుగా వస్తున్న వరదతో శ్రీశైలం జలాశయం క్రమంగా నిండుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 149 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇంకా 66 టీఎంసీలు నీరు చేరితే గరిష్ట సామర్థ్యం సాధించినట్లు అవుతుందని చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరద మరో మూడు నాలుగు రోజులు కొనసాగే అవకాశం కనిపిస్తుండటంతో శ్రీశైలంతోపాటు రాయలసీమ ప్రాజెక్టులకు సాగు, తాగునీరు సమస్య లేనట్లే అంటున్నారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వానికి ఊపిరి పోసినట్లే అంటున్నారు.ఎగువ నుంచి వరద రాని పక్షంలో ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి చేరుకుని చాలా సమస్య ఎదుర్కొనే పరిస్థితి ఉండేదని అంటున్నారు. ఒకవిధంగా ఈ పరిస్థితి చంద్రబాబుకు కొత్త శక్తిని ఇచ్చినట్లే అంటున్నారు. గతంలో ఎప్పుడూ కూడా ప్రకృతి చంద్రబాబుకు ఈ విధంగా సహరించిన పరిస్థితి లేదని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. చంద్రబాబు 1995లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 2004 వరకు కొనసాగారు. అయితే ఎన్నడూ లేనట్లు 1998-2004 మధ్య రాష్ట్రం తీవ్ర దుర్భిక్షాన్ని ఎదుర్కొందని గుర్తుచేస్తున్నారు. అయితే ఇప్పుడు ప్రాజెక్టుల కారణంగా రాష్ట్రంలో చాలా వరకు ఈ పరిస్థితులను అధిగమించడం కూడా కూటమి సర్కారుకు కలిసివచ్చిన అంశంగానే చెబుతున్నారు.

# జగన్ లాయల్టీ కార్డ్...



**విజయవాడ, ఆగస్టు 7, పెన్ పవర్:**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనుసరిస్తున్న శైలి హాట్ టాపిక్‌గా మారింది. క్రిమినల్ ఆరోపణలు , కేసులు ఎదుర్కొంటున్న స్వపక్ష నాయకులు, నేరుగాబాధితులను పరామర్శించడానికి బదులుగా, నిందితులు లేదా కేసుల్లో చిక్కుకున్న తన సొంత పార్టీ నాయకులకు బహిరంగ మద్దతు తెలపడం చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి సీదరిఅప్పలరాజు, తమ్మినేని సీతారం, ముస్తఫా, విరూపాక్షి అలాగే పలువురు సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టుల సందర్భాలలో జగన్ ప్రదర్శించిన వైఖరి దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. ఇది రాజకీయఅవగాహన లేక చేస్తున్న పని కాదని, దీని వెనుక అత్యంత పక్కాగా లెక్కించిన పొలిటికల్ క్యాలిక్యులేషన్ ఉందనేది ఎక్కువ మంది అభిప్రాయం. ఈ వ్యూహంలో మొదటి , అత్యంత ప్రధానమైన అంశంక్యాడర్‌కు లాయల్టీ సిగ్నల్ ఇవ్వడం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్రమైన చట్టపరమైన, పోలీసు ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న తమ పార్టీ కార్యకర్తలకు మీ వెనుక నేనున్నాను అనే కొండంత అభయాన్నిఅందించడం ద్వారా పార్టీ క్యాడర్ చెల్లాచెదురు కాకుండా జగన్ కాపాడుకుంటున్నారు. విపక్షంలో ఉన్నప్పుడు అధినేతే తమ రక్షణకు నిలబడకపోతే ద్వితీయ శ్రేణి నాయకత్వం, గ్రౌండ్ లెవల్ శ్రేణులుఉత్సాహం కోల్పోతాయి. తప్పు ఒప్పనేది పక్కనబెడితే, నా మనుషుల కోసం నేను ఎంతటి రాజకీయ ఒత్తిడికైనా ఎదురెళ్తాను అనే భావనను క్యాడర్‌లో నూరిపోయడం ద్వారా పార్టీ నిర్మాణం పడిపోకుండా ఆయన వ్యూహాత్మక రక్షణ కవచం నిర్మిస్తున్నారు.అలాగే రెడ్ బుక్ రాజ్యాంగం, రాజకీయ కక్షసాధింపు అనే కౌంటర్ నరేటివ్‌ను సెట్ చేయడం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమపార్టీ నేతలను రాజకీయ కక్షసాధింపుతోనే కేసుల్లో ఇరికిస్తున్నారని ప్రచారం చేయడం జగన్ వ్యూహంలో భాగం. ఏ కేసు వచ్చినా, దానిని తీవ్రమైన నేరంగా చూడకుండా పాలనా యంత్రాంగం, పోలీసు వ్యవస్థల దుర్వినియోగం గా వర్గీకరించడం ద్వారా కేసు తీవ్రతను తగ్గించే యత్నం చేస్తున్నారు. తద్వారా నిందితుడిని నిందితుడిగా కాకుండా రాజకీయ బాధితుడి గా ప్రజల్లో ప్రొజెక్ట్ చేసేందుకు వైఎస్సార్‌సీపీమీడియా , సోషల్ మీడియా వేదికలను వినియోగిస్తున్నారు.అదే సమయంలో బిసి, సామాజికవర్గ సమీకరణల రక్షణ కూడా చూస్తున్నారు. సీదరి అప్పలరాజు కేసునే ఉదాహరణగా తీసుకుంటే, ఆయన్ను ఉత్తరాంధ్ర బిసి నేతగా ప్రొజెక్ట్ చేస్తూ ప్రభుత్వం బిసిలపై వేధింపులకు దిగుతోందనే కార్డ్‌ను ప్రయోగించారు. తద్వారా మూల నేరం లేదా కేసులోని అసలు నిజానిజాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించి, దానినిసామాజిక వర్గాల పోరుగా లేదా అధికారిక దమనకాండగా మార్చడంలో జగన్ రాజకీయవ్యూహాలు పన్నుతున్నారు. ఇలాగే అంబటి రాంబాబు, విరూపాక్షి వంటి నేతల విషయంలోనూ జరిగింది. ఇటువంటి ఎత్తుగడలు తాత్కాలికంగా కోర్టులు లేదా మీడియా ఇచ్చే సమాధానాలకు అతీతంగా, వారి సొంత ఓటు బ్యాంకులో మా నేతను తొక్కుతున్నారు అనే సెంటిమెంట్‌ను రగిలిస్తాయి. అయితే, ఈ రాజకీయ లెక్కల్లో ఉన్న అత్యంత ప్రమాదకరమైన మైనస్ పాయింట్ న్యూట్రల్ ఓటర్లలో తీవ్రమైన ప్రతికూలత . సామాన్య ప్రజలు, మధ్యతరగతి , విద్యార్థులు న్యాయం వైపు లేదా బాధితుల వైపు నిలబడటాన్నిఆశిస్తారు. తప్పు చేసిన వారికి, లేదా హిట్ అండ్ రన్ కేసుల్లో రక్షణగా నిలిచారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి పార్టీ అధినేతే స్వయంగా వెళ్ళి అండగా నిలవడం సమాజానికి తప్పు సంకేతాలుపంపుతుందని, నేరస్థులకు రాజకీయం అభయహస్తం ఇస్తోందనే భావన బలపడుతుందని అధికార పార్టీ విమర్శిస్తోంది. వైఎస్ జగన్ చేస్తున్న ఈ రాజకీయ కసరత్తు అంతా తమ కోర్ ఓటు బ్యాంక్ , క్యాడర్‌రీటెన్షన్ కోసమే. న్యూట్రల్ ఓటర్ల ఆగ్రహం కంటే, పార్టీ శ్రేణులు భయపడి పక్కకు తప్పుకోకుండా ఉండటమే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్సార్‌సీపీకి అత్యంత కీలకమైన మనుగడ ప్రశ్నగా ఆయనభావిస్తున్నారు. తన మనుషుల కోసం నిలబడే నేతగా గుర్తింపు తెచ్చుకోవాలనే జగన్ మార్క్ హై-స్టేక్స్ పొలిటికల్ గేమ్‌లో ఇది ఒక భాగమే తప్ప, ఆయనకు రాజకీయ జ్ఞానం లేక చేస్తున్న పొరపాటుమాత్రం కాదని అనుకోవచ్చు.

# టార్గెట్ లోకేష్.. డీఎస్సీపైనే వైసీపీ పోరాటం

**విజయవాడ, ఆగస్టు 7, పెన్ పవర్:**

ఆంధ్రప్రదేశ్ రాజకీయం ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాలతో కొత్త మలుపు తిరగనుంది. ఇటీవల కాలంలో అధికార కూటమి ప్రభుత్వంపై ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ సమరశంఖం పూరిస్తూ వరుస ఉద్యమాలకు శ్రీకారం చుట్టింది. అందులో ముఖ్యంగా మెగా డీఎస్సీ నియామకాలపై అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగాయంటూ నిర్వహించిన నిరసనలు, సమావేశాలు, రిలే నిరాహార దీక్షలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వీధుల్లో పోరాడిన వైఎస్సార్‌సీపీకి, అభియోగాల్లో నిజాయితీ ఉంటే అసెంబ్లీ సమావేశాలకు వచ్చి ప్రత్యక్ష చర్చకు దిగాలి అని అధికార పక్షం విసిరిన చాలెంజ్ ఇప్పుడు ప్రధాన రాజకీయ పరీక్షగా మారింది.మెగా డీఎస్సీ వివాదంపై పారదర్శకమైన చర్చ జరపాలనే విజ్ఞప్తులతో వైఎస్సార్‌సీపీ నేతలు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తోసిపుచ్చడం ప్రతిపక్షానికి ఊహించనిచట్టపరమైన షాక్‌గా మారింది. రాజకీయ లబ్ధి కోసం వేసే పిల్‌లను అనుమతించలేమని న్యాయస్థానం స్పష్టం చేయడంతో, ఈ అంశాన్ని న్యాయపోరాటం కంటే సభా వేదికగానే తేల్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తమ పారదర్శకతను నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతుండటంతో, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ వేదికను వాడుకుంటుందా లేదా అనే అంశంపై సోషల్ మీడియా, రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు జోరందుకున్నాయి.అసెంబ్లీకి హాజరయ్యే విషయంలో వైఎస్సార్‌సీపీ ముందున్న అతిపెద్ద సవాలు ప్రతిపక్ష హోదా గుర్తింపు . తగినంత సంఖ్యాబలం లేదన్న కారణంతోస్పీకర్ స్థానం ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంతో వైఎస్సార్‌సీపీ గత సమావేశాలను బహిష్కరించింది. అయితే, ఇప్పుడు డీఎస్సీ వంటి అత్యంత ప్రజాదరణ పొందిన ఉద్యమం చేతిలో ఉండటంతో, నిరసనను సభ బయటకే పరిమితం చేస్తే.. ప్రభుత్వ సవాల్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకే వైఎస్సార్‌సీపీ పారిపోయింది అని అధికార పక్షం ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే అవకాశం ఉందని భావిస్తున్నారు.మరోవైపు, అధికార కూటమి నేతలు సైతం శాసనసభ వేదికగా ప్రతిపక్షాన్ని గణాంకాలతో నిలదీసేందుకు పక్కా నివేదికలతో సిద్ధమవుతున్నారు. తమ ప్రభుత్వంలో కల్పించిన ఉద్యోగ అవకాశాలు, స్పోర్ట్స్ కోటా పరిశీలన పద్ధతులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సభ ముందు ఉంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు సభకు వస్తే డీఎస్సీతో పాటు శాంతిభద్రతల అంశం, ఇటీవల ఎమ్మెల్యేల అరెస్టుల వ్యవహారాలపై ఉభయ పక్షాల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ ముందు ప్రస్తుతం రెండు మార్గాలు మిగిలాయి. మొదటిది, పాత పద్ధతిలోనే సభా బహిష్కరణ కొనసాగించడం, రెండవది, నిరసన ముద్రను దాటుకుని సభా వేదికపైకి వచ్చి స్పీకర్ స్థానాన్ని ప్రశ్నిస్తూనే డీఎస్సీ అక్రమాలపై మంత్రి నారా లోకేష్‌ను నేరుగా నిలదీయడం. ఈరెండింటిలో వైఎస్సార్‌సీపీ ఎంచుకునే వ్యూహం రాబోయే రోజుల్లో ఆ పార్టీ పొలిటికల్ మైలేజ్‌ను నిర్ణయించనుంది. ఈ అవకాశాన్ని వైఎస్సార్‌సీపీ ఎంతవరకు సద్వినియోగం చేసుకుంటుందో లేక వీధిపోరాటాలకే తన వ్యూహాన్ని పరిమితం చేస్తుందో తెలియాలంటే ఈ నెల 17 వరకు వేచి చూడాల్సిందే. 2029 ఎన్నికల రేసులో ప్రధాన ప్రతిపక్షంగా తమ ఉనికిని మరింత బలంగా చాటుకోవడానికివైఎస్సార్‌సీపీకి ఒక సువర్ణావకాశం అని చెప్పవచ్చు.

## పెండింగ్ సమస్యలపై ఉద్యోగ సంఘాల ఫైట్

**విశాఖపట్టణం, ఆగస్టు 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో గత కొంతకాలంగా మౌనంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు మళ్లీ ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమవుతున్నాయి. నూతన ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సదుపాయాలు, పెండింగ్ బకాయిల పరిష్కారానికి సమయం ఇచ్చిన ఉద్యోగులు.. ఇప్పుడు తమ ప్రధాన డిమాండ్ల సాధనకు సమరశంఖం పూరిస్తున్నారు. 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు, మధ్యంతర భృతి ప్రకటన, నిలిచిపోయిన కరువు భత్యం బకాయిల విడుదలపై కాలయాపన జరుగుతోందంటూ ఏపీ ఎన్జీవో , ఏపీ జేఏసీ అమరావతి వంటి ప్రధాన సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. రెండేళ్లుగా నిశ్శబ్దంగా ఉన్నప్పటికీ, తమ ఆర్థిక, సర్వీసు హక్కుల సాధన కోసం ఇకపై ప్రత్యక్ష పోరాటాలు తప్పవని ఉద్యోగ నాయకులు హెచ్చరిస్తున్నారు.ఉద్యోగ సంఘాలు లేవనెత్తుతున్న డిమాండ్లలో 12వ పీఆర్సీ చైర్మన్‌ను తక్షణమే నియమించడంతో పాటు వేతన వ్యత్యాసాన్ని భర్తీ చేసేందుకు వీలుగా తక్షణ ఐఆర్‌ను ప్రకటించడం అత్యంత కీలకమైనవిగా మారాయి. వీటితో పాటు పాత పెన్షన్ విధానం అమలు లేదా సీపీఎస్, జీపీఎస్ వివాద పరిష్కారం, ఎంప్లాయీస్ హెల్త్ కార్డ్స్ బగ్గుమంటున్న లోపాలు, ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది క్రమబద్ధీకరణ, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన పెంపుదలలు ప్రధాన ప్రతిబంధకాలుగా ఉన్నాయి. పొరుగు రాష్ట్రమైన తెలంగాణతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా తమ వేతన సవరణ ప్రక్రియను ప్రారంభించిన వేళ, ఏపీలో స్పష్టమైన గడువు లేకపోవడం ఉద్యోగ వర్గాల్లో తీవ్ర అసహనాన్ని నింపుతోందిఈ నిరసనలపై ప్రభుత్వం తరపున ప్రతిస్పందనలు వెలువడుతున్నాయి. ఇటీవల ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం దాదాపు 21 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా సమావేశమై వారి 50కి పైగా డిమాండ్లను ఆలకించింది. పెండింగ్ బకాయిల విడుదలకు చర్యలు తీసుకుంటామని, పీఆర్సీ, ఐఆర్ విజ్ఞప్తులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే, గత ప్రభుత్వం వదిలివెళ్లిన భారీ ఆర్థిక లోటు, రూ. వేల కోట్ల పెండింగ్ బిల్లుల భారం కారణంగా వెంటనే నిధులుకేటాయించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది. రాజకీయ సమీకరణాల పరంగా పరిశీలిస్తే, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగుల పాత్ర అత్యంతనిర్ణయాత్మకమైనది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పీఆర్సీ అమల్లో జాప్యం, పోలీసు కేసుల నమోదు, పెండింగ్ బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్న ఉద్యోగ వర్గాలు కూటమి వైపు మొగ్గుచూపాయి. ప్రస్తుతం అదే ఉద్యోగులు మళ్లీ రోడ్డెక్కితే అది కూటమి ప్రభుత్వ రాజకీయ ఇమేజ్‌కు పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. అందుకే ప్రభుత్వం సామరస్యంగా ఇరువర్గాల మధ్యచర్చల ప్రక్రియను నిరంతరం కొనసాగించే ప్రయత్నం చేస్తోంది. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ ఉద్యోగ సంఘాల నిరసనలను తమకు అనుకూలంగా మలుచుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఎన్నికల ముందుఉద్యోగులకు అసంఖ్యాక హామీలు ఇచ్చిన కూటమి నాయకులు, అధికారంలోకి వచ్చాక పీఆర్సీ, ఐఆర్ ఊసెత్తడం లేదు అని ఉద్యోగ సంఘాల డిమాండ్లకు మద్దతు ఇస్తూ, వారి నిరసనల ఆధారంగా రాజకీయాంశంగా మార్చేందుకు ప్రతిపక్షం వ్యూహరచన చేస్తోంది. సంవత్సరాల పాటు పెండింగ్‌లో ఉన్న 40 సమస్యలు సత్వరం పరిష్కరించాలని ఆర్థిక శాఖ అధికారులను ప్రభుత్వ ఉద్యోగుల సంఘంనేతలు కలిశారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ ఆధ్వర్యంలో స్పెషల్ ఛీఫ్ సెక్రెటరీ రావత్, ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణతో ఈ సాయంత్రం సమావేశమయ్యారు. గతంలోఉద్యోగులకు ఇచ్చిన హామీలు ఇంతవరకూ అమలుకాలేదని వారికి వివరించారు. సెప్టెంబర్ 30లోగా సీపీఎస్‌పై నిర్ణయం తీసుకుంటామని గతంలో చెప్పారని గుర్తు చేశాయి ఉద్యోగ సంఘాలు. డీఏలచెల్లింపునకు జీవోలు ఇచ్చినప్పటికీ ఇంతవరకూ అమలుకాలేదన్నారు. బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారనేదానిపై కూడా క్లారిటీ ఇవ్వడం లేదన్నారు. డీఏ బకాయిలు చెల్లించకున్నా ఉద్యోగుల ఖాతాల నుంచిఇన్‌కంట్యాక్స్ కట్ చేశారని ఆర్థికశాఖాధికారులకు ఉద్యోగులు తెలియజేశారు. పీఆర్సీ చర్చల్లో డీఏల ప్రస్తావన రాకున్నా రిటైర్మెంట్ సమయంలో ఇస్తామని జీవోలు ఇచ్చారని... డీఏ బకాయిలను వడ్డీతో సహాచెల్లించాలని అధికారులను కోరారు. సమస్యలు పరిష్కారం కాకుంటే త్వరలోనే కలిసొచ్చే ఉద్యోగ సంఘాలతో కార్యాచరణ రూపొందిస్తామని అల్టిమేటం ఇచ్చారు. నెల రోజుల్లో సమస్యలకు పరిష్కార మార్గంచూపాలని సూచించారుఏపీ ఉద్యోగ సంఘాల ఉద్యమం కేవలం ఒక సర్వీసు డిమాండ్ల పోరాటంగా కాకుండా రాష్ట్ర రాజకీయ స్థిరత్వాన్ని ప్రభావితం చేసే శక్తిగా రూపాంతరం చెందుతోంది. ఆర్థిక సంక్షోభంఒకవైపు, ఉద్యోగుల ఆకాంక్షలు మరోవైపు ఉన్న తరుణంలో సీఎం చంద్రబాబు ప్రభుత్వం వ్యూహాత్మకంగా త్వరితగతిన పీఆర్సీ కమిషన్‌ను ప్రకటించి, కొంతమేర ఐఆర్‌ను కేటాయించడం ద్వారా మాత్రమే ఈ ఆందోళనల జ్వాలలను చల్లార్చగలదన్నఅంచనాలు ఉన్నాయి. మరి ప్రభుత్వం ఏం చేయబోతోంది?

## ఇక బెజవాడలో మెట్రో అడుగులు

**విజయవాడ, ఆగస్టు 7 పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి కీలకమైన భూసేకరణకు తొలి అడుగు పడింది. ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ టీమ్ గన్నవరం

ప్రాంతంలో పర్యటించింది. విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులో ఫేజ్-1 భాగంగా మొదటి కారిడార్ విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం వరకు ప్లాన్ చేశారు. ఈ రూట్‌లో గన్నవరం దగ్గర నిర్మించాల్సిన మెట్రో స్టేషన్‌ల కోసం 1.35 ఎకరాలను భూమి అవసరం ఉందని గుర్తించారు అధికారులు. గన్నవరంలోనే హెచ్‌సీఎల్ పక్కనే ఎన్టీఆర్ వెటర్నరీ కాలేజీ లైవ్‌స్టాక్ యూనిట్ దగ్గర మొత్తం 61.15 ఎకరాల భూమి ఉంది. దీనిని మెట్రో డిపో నిర్మాణం కోసం సమీకరించాలని నిర్ణయించారు. ఈభూముల సమీకరణకు సంబంధించి మెట్రోరైలు కార్పొరేషన్ ప్రతినిధులు గన్నవరం తహసీల్దార్, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇతర శాఖల అధికారులు పర్యటించారు. అక్కడ స్థానికంగాభూసేకరణ రైతుల వివరాలు, అక్కడి పరిస్థితులపై నివేదిక సమర్పించాలని రెవెన్యూ శాఖను కోరారు. అలాగే ప్రతిపాదిత భూముల్లో కొలతలు కూడా తీసుకున్నారు.విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్ట్ లోభాగంగా మొదటి దశలో కారిడార్ 1ఏ పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం వరకు ఉంది. 1బీ కింద పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి పెనమలూరు వరకు ప్లాన్ చేశారు. మొత్తం దూరం 38.40కి.మీ కాగా.. ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.11,009 కోట్లుగా ఉంది. భూసేకరణ కోసం రూ.1,152 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. రెండో దశలో భాగంగా విజజయవాడ పండిట్ నెహ్రూబస్టాండ్ నుంచి అమరావతి (రిజర్వాయర్ స్టేషన్) దూరం: 27.75 కి.మీ ప్రతిపాదించారు. విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్ట్ తొలిదశలో చేపట్టబోయే కారిడార్ 1ఏ, కారిడార్ 1బీ కింద కృష్ణా, ఎన్టీఆర్‌రెండు జిల్లాల పరిధిలో 82.66 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. వీటిలో కృష్ణా జిల్లా పరిధిలో 70.95 ఎకరాలు, ఎన్టీఆర్ పరిధిలో 11.71 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు.మొదటిదశ కారిడార్ 1ఏ రూట్‌లో పండిట్ నెహ్రూ బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ సౌత్ ఢ ఈస్ట్, బీసెంట్ రోడ్, సీతారాంపురం సిగ్నల్, మాచవరం డౌన్, పడవలరేవు, గుణదల, రామవరప్పాడు రింగ్, ప్రసాదం పాడు,ఎనికేపాడు, నిడమానూరు, శ్రీ చైతన్య కాలేజీ, గూడవల్లి, వేల్పూరు, కేసరపల్లి, గన్నవరం విమానాశ్రయం, గన్నవరం బస్టాండ్ వరకు మెట్రో స్టేషన్లు ప్లాన్ చేశారు. 1బీలో పండిట్ నెహ్రూ బస్ స్టేషన్,విక్టోరియా జూబ్లీ మ్యూజియం, ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం, టిక్కెల్ రోడ్డు, డీవీ మేనర్, బెంజ్ సర్కిల్, ఆటోనగర్ గేట్, అశోక్ నగర్, కృష్ణానగర్, కానూరు సెంటర్, తాడిగడప, పోరంకి, పెనమలూరుమీదుగా ప్లాన్ చేశారు.

## ఎండిపోతున్న పంటలు... ఎల్ నినో ప్రభావం..

**ఒంగోలు, ఆగస్టు 7 పెన్ పవర్:** :మార్కాపురం జిల్లా కనిగిరి నియోజకవర్గంలో నిమ్మసాగు ఎక్కువగా ఉంది. మార్కాపురం, కనిగిరి, వైపాలెం, గిద్దలూరు, దర్శి, కొండేపి, కందుకూరు నియోజకవర్గాల్లో 4 వేల హెక్టార్లలో సాగుచేస్తుండగా..కేవలం కనిగిరి ప్రాంతంలోనే 2 వేల హెక్టార్లు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం నిమ్మసాగుపై చూయించింది. ఆగస్టు రెండో వారం వస్తున్నా ఇప్పటి వరకు చినుకు జాడ లేకపోవడంతో రైతులుఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడకపోతే నిమ్మ చెట్లు ఎండిపోయే ప్రమాదం ఉంది.రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతం ఏదైనా ఉందంటే అది పశ్చిమ ప్రకాశమే.. ప్రస్తుత మార్కాపురం జిల్లా.వ్యవసాయం మినహా మరేయితర పరిశ్రమలు లేని ఏకైక జిల్లా మార్కాపురం. వ్యవసాయం కూడా కేవలం వర్షాల మీద మాత్రమే ఆధారపడాలి. వర్షాలు పడితేనే ఇక్కడ ప్రజలకు పంటలైనా, నీళ్లైనా.. ఏదైనావర్షమే ఆధారం. ఎలాంటి పంట కాల్వలు లేని జిల్లా కూడా మార్కాపురమే! గతేడాది మొంథా తుఫాను పుణ్యమా అంట వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు నిండి నీటికి ఇబ్బంది లేకుండా ఉంది. కానీ,ఈ ఏడాది ఆగస్టు మొదటి వారం గడుస్తున్నా కనీసం చినుకు కూడా లేదు. ఈ ఎల్‌నినో ప్రభావం రైతులపై ఎక్కువగా పడింది.మార్కాపురం జిల్లాలో బోరు కింద పండించే పంటలు కంటే వర్షాల మీదఆధారపడి పండేంచేవే ఎక్కువ. హార్టికల్చర్ కింద మాత్రం కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాల్లో నిమ్మ సాగు మాత్రం కొన్ని ప్రాంతాల్లో ఉంది. ఇప్పుడు ఆ నిమ్మ సాగు కూడా ప్రమాదంలో పడింది. ఈప్రాంతం నుంచి బెంగళూరు, హైదరాబాద్‌కు నిమ్మకాయలు ఎక్కువగా ఎగుమతి అవుతుంటాయి. రోజుకు కొన్ని వందల బస్తాలను రైతులు ఎగుమతి చేస్తుంటారు.గతేడాది మొంథా తుఫాను తర్వాతచెప్పుకోదగ్గ వర్షాలు ఇప్పటి వరకు నమోదుకాలేదు. ఎండలు ఎక్కువగా నమోదు కావడం, వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటాయి. దాంతో కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని నిమ్మ తోటలు ఎండిపోతున్నాయంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కనిగిరి, హనుమంతునిపాడు, వెలిగండ్ల, సీఎస్‌పురం, పామూరు, పీసీపల్లి మండలాల్లో రెండు వేల హెక్టార్లలో నిమ్మసాగు చేస్తున్నారు. ఏటా జూలై చివరి వారం నుంచి అయినా ఈ ప్రాంతంలో వర్షాలు నమోదయ్యేయి. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు చినుకు జాడే లేదు. దాంతో ఎండల ధాటికి నిమ్మకాయలు గిడసబారిపోతున్నాయి. కాయపరిమాణం కూడా తక్కువగా ఉంటుంది. ఈ కారణంతో రూ. 80 నుంచి రూ. 100 పలకాల్సిన నిమ్మ ధర రూ. 50కు మించి పెరగడం లేదు. వర్షాలు పడకపోతే ఈ ఏడాది నిమ్మ చెట్లు పూర్తిగా ఎండిపోయేపరిస్థితికి వస్తాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## మొన్న ఇండియా.. నేడు అమెరికా.. 24 గంటల్లో రెండు ప్రజాస్వామ్య దేశాల్లో మెటాకు షాక్..




ప్రపంచపు అతిపెద్ద టెక్ దిగ్గజాల్లో ఒకటైన మెటా కేవలం 24 గంటల వ్యవధిలోనే రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల్లో తీవ్ర విమర్శలు, చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంది. అయితే ఈ రెండు దేశాల్లోనూ ఈ పరిణామాలు ముగిసిన విధానం ఇప్పుడు గ్లోబల్ టెక్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భారత్‌లో కేవలం ఒక క్షమాపణ, వివరణతో వివాదం తాత్కాలికంగా ముగియగా అమెరికాలో మాత్రం మెటాపై ఏకంగా 1 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,000 కోట్లకు పైగా) భారీ జరిమానా పడింది.

భారత్‌లో మెటా ప్లాట్‌ఫామ్‌లైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో చోటుచేసుకున్న కొన్ని ఘటనలు తీవ్ర దుమారం రేపాయి. ముఖ్యంగా నీట్ పరీక్షల నిరసనలకు సంబంధించి ప్రధానమంత్రి వీడియో సందేశాన్ని తాత్కాలికంగా తొలగించడం లేదా పరిమితం చేయడం పెద్ద వివాదానికి దారితీసింది. దీనికి తోడు ప్లాట్‌ఫామ్‌లలో వేగంగా విస్తరిస్తున్న డీప్‌ఫేక్ కంటెంట్, పిల్లలపై లైంగిక దాడులకు సంబంధించిన అక్రమ ప్రకటనలు ప్రత్యక్షమవడంపై ప్రజాప్రతినిధులు, సాంకేతిక నిపుణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెటా కంటెంట్ మోడరేషన్ విధానాలను తీవ్రంగా తప్పుపట్టారు. అయితే ఈ పరిణామాలపై స్పందించిన మెటా సంస్థ జరిగిన పొరపాట్లకు క్షమాపణలు తెలుపుతూ వివరణ ఇచ్చింది. తొలగించిన కంటెంట్‌ను పునరుద్ధరించడంతో పాటు, భవిష్యత్తులో తమ సెక్యూరిటీ వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తామని హామీ ఇవ్వడంతో ఇక్కడ వివాదం తాత్కాలికంగా చల్లారింది.

అమెరికాలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపించింది. అక్కడ మెటాకు కేవలం వివరణలు ఇచ్చే అవకాశం లేదా క్షమాపణలతో సరిపెట్టుకునే వెసులుబాటు దక్కలేదు. డిజిటల్ భద్రత, వినియోగదారుల గోప్యత, డేటా రక్షణ నియమావళిని ఉల్లంఘించినందుకు అమెరికా నిబంధనల సంస్థలు అత్యంత కఠినంగా వ్యవహరించాయి. మెటా తప్పులను తీవ్రంగా పరిగణిస్తూ 1 బిలియన్ డాలర్ల భారీ జరిమానా విధించాయి. వినియోగదారుల హక్కులు, డిజిటల్ భద్రత విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే టెక్ దిగ్గజాలైనా సరే భారీ ఆర్థిక పరిణామాలు అనుభవించాల్సిందేనని అమెరికా మరోసారి స్పష్టమైన సంకేతం ఇచ్చింది. ఈ రెండు ఘటనలు ప్రపంచవ్యాప్తంగా ఒక ఆసక్తికరమైన చర్చకు దారితీశాయి. ఒకే తరహా సమస్యలపై రెండు దేశాల ప్రభుత్వాలు వ్యవహరించిన తీరు భిన్నమైన వైఖరిని స్పష్టం చేస్తోంది. భారత్‌లో సంభాషణ, వివరణ, తప్పును సరిదిద్దుకునే అవకాశానికి ప్రాధాన్యం ఇస్తే అమెరికా మాత్రం చట్టపరమైన చర్యలు, భారీ జరిమానాల ద్వారా టెక్ దిగ్గజాలను బాధ్యతాయుతంగా వ్యవహరించేలా ఒత్తిడి తెస్తోంది. డీప్‌ఫేక్‌ల వ్యాప్తి, తప్పుడు సమాచారం, పిల్లల ఆన్‌లైన్ భద్రత వంటి అంశాల్లో గ్లోబల్ టెక్ కంపెనీలపై అంతర్జాతీయంగా ఒత్తిడి రోజురోజుకూ పెరుగుతోంది. సమస్య ఒకటే అయినప్పటికీ ఒకచోట ఒక క్షమాపణతో వ్యవహారం ముగుస్తుంటే మరోచోట అదే అంశం వేల కోట్ల రూపాయల జరిమానాకు దారితీస్తుండటం విశేషం.

## చేనేతలపై మనసు పెట్టేసిన చంద్రబాబు!



రాష్ట్రానికి త్వరలోనే హ్యాండ్లూమ్ కళ రానుందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం గతం లోను.. ప్రస్తుతం కూడా చేనేతలకు అనుకూలంగా అనేక నిర్ణయాలు తీసుకుందన్నారు. చేనేతలకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సహకారాన్ని అందించే –నేతన్న సేవ–లో పథకాన్ని చంద్రబాబు ప్రారంభించా రు. 71,536 చేనేత కుటుంబాలకు రూ.179 కోట్లను విడుదల చేశారు. స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకునేలా ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నా మన్నారు. –నేతన్న సేవ–లో పథకం కింద 71,536 కుటుంబాలకు రూ.25 వేల చొప్పున ఇస్తున్నామని చం ద్రబాబు తెలిపారు. రూ.179 కోట్లు నేతన్నలకు అందిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాదు... చెప్పని వాటినీ అమలు చేస్తున్నాం అనడానికి నేతన్న సేవలో పథకమే నిదర్శనమని అన్నారు. చేనేత కేవలం ఒక వృత్తే కాదు... భారతీయ సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. దేశం గర్వించే కళ చేనేత అని చంద్రబాబు పేర్కొన్నారు. మన రాష్ట్రం అనేక చేనేత కళలకు నిలయ మని అన్నారు. అలాంటి వర్గానికి ఆసరాగా ఉంటున్నామన్నారు. చీరాల పేరు వింటేనే ఇక్కడి నేతన్నల నైపుణ్యం గుర్తుకు వస్తుందన్నారు. చీరాల పట్టు, కాటన్ చీరలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయన్నారు. చీరాల ఖర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు భారీగా ఎగుమతి అయ్యేవన్నారు. చేనేత ఉత్పత్తుల్లో ఒకప్పుడు 'మినీ ముంబై'గా పేరొందిన చీరాలకు పూర్వ వైభవం తెస్తామని చంద్రబాబు తెలిపారు చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, పెడన, శ్రీకాళహస్తి, నరసాపురం... ఇలా రాష్ట్రంలో అనేక చేనేత ఉత్పత్తులు విశిష్ట గుర్తింపు పొందాయని చంద్రబాబు తెలిపారు. 1.27 లక్షల మం ది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. సంప్రదాయం, సృజనాత్మకత కలగలిసిన అపూర్వమైన నైపుణ్యం వీరందరిలో కనిపిస్తుందన్నారు. నేతన్న సేవ పథకమే కాదు... ఇప్పటికే నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కలుగుతోందన్నారు. చేనేతలకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్ అందిస్తున్నామన్నారు. 85 వేల మంది చేనేతలకు ఫించన్‌గా రూ.4 వేల చొప్పున నెలకు రూ.35 కోట్లు ఇస్తున్నాం. రూ.420 కోట్లు ఏడాదికి ఖర్చు పెడుతున్నామన్నారు.

# చావు కోసం చెక్-ఇన్.. ఈ హోటల్‌లో రూమ్ దొరికితే... బయటకు చెక్‌అవుట్ కాదు, నేరుగా మోక్షమే!



సాధారణంగా హోటల్ అంటే ఏముంటుంది? రూమ్ బుక్ చేసుకోవాలి.. సెల్ఫీలు దిగాలి.. ఫుడ్ ఆర్డర్ చేయాలి.. చివరికి చెక్‌అవుట్ చేసి ఇంటికి వెళ్లాలి. కానీ ఓ హోటల్ మాత్రం ఈ రూల్స్ అన్నింటినీ తలకిందులు చేస్తోంది. ఇక్కడికి వచ్చే వారు టూర్ కోసం కాదు... జీవితానికి చివరి అధ్యాయం ప్రశాంతంగా ముగించుకోవడానికి వస్తారు. మరీ విచిత్రంగా చెప్పాలంటే... ఇక్కడ చెక్‌ఇన్ చేసిన తర్వాత "చెక్‌అవుట్ ఎప్పుడు?" అని ఎవరూ అడగరు. ఉత్తరప్రదేశ్‌లోని పవిత్ర నగరం వారణాసిలో ఉన్న 'ముక్తి భవన్' ఇప్పుడు సోషల్ మీడియాలో మరోసారి చర్చనీయాంశమైంది. పేరు భవన్ అయినా చాలామంది దీన్ని "మరణానికి చివరి అడ్రెస్"గా అభివర్ణిస్తుంటారు. కాశీలో చివరి శ్వాస విడిస్తే మోక్షం లభిస్తుందని హిందూ విశ్వాసం. అదే నమ్మకంతో దేశం నలుమూలల నుంచి వృద్ధులు, వారి కుటుంబ సభ్యులు ఇక్కడికి చేరుకుంటారు. అయితే ఇక్కడ కూడా ఒక చిన్న "రూల్ బుక్" ఉంది. గరిష్ఠంగా 14 రోజులు మాత్రమే ఉండేందుకు అనుమతి. ఈ గడువులో మరణం సంభవిస్తే కుటుంబ సభ్యులు అక్కడే అంత్యక్రియల ఏర్పాట్లు చేసుకుంటారు. కానీ 14 రోజులు పూర్తయ్యాక కూడా ఆరోగ్యం నిలకడగా ఉంటే? క్షమించాలి... రూమ్ ఖాళీ చేయాల్సిందే. ఎందుకంటే మరో కుటుంబం కూడా అదే ఆశతో క్యూలో ఉంటుంది. పరిస్థితిని బట్టి నిర్వాహకులు కొద్ది రోజుల పొడిగింపు ఇచ్చిన సందర్భాలూ ఉన్నాయని చెబుతారు. ముక్తి భవన్‌లో భజనలు, వేదమంత్రాల పఠనం, పూజలు నిరంతరం జరుగుతుంటాయి. జీవితాంతం పరుగులు తీసిన మనిషికి చివరి రోజుల్లో ఒక ఆధ్యాత్మిక ప్రశాంతత కల్పించడమే దీని లక్ష్యం. ఇక్కడికి వచ్చినవారు తమ కుటుంబ సభ్యులతో కలిసి చివరి క్షణాలను గడుపుతారు. ఈ సేవలో దాదాపు 40 ఏళ్లుగా ఉన్న నిర్వాహకుల్లో ఒకరు మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు 12 వేల మందికిపైగా చివరి శ్వాస విడిచిన సందర్భాలను ప్రత్యక్షంగా చూశానని చెప్పారు. ఆయన మాటల్లో చెప్పాలంటే... చివరి క్షణాల్లో చాలా మంది ఒకే మాట అంటారట. "అంత కోపం ఎందుకు చేశాం? చిన్న చిన్న విషయాలకు ఎందుకు మనుషులను దూరం చేసుకున్నాం?" అని పశ్చాత్తాపపడతారట. బ్యాంక్ బ్యాలెన్స్, ఆస్తులు, హోదాలు కాదు... బంధాలు, ప్రేమ, క్షమించే మనసే చివరికి గుర్తుకొస్తాయని ఆయన చెబుతున్నారు. మరి ముక్తి భవన్ చెప్పే అసలు సందేశం ఏంటంటే... కోపాన్ని ఈఎంఐల్లో దాచుకోకండి.. అదే రోజున క్లోజ్ చేయండి. మనసులో ద్వేషం, పగ, అహంకారం స్టాక్ పెట్టుకుంటే చివరికి అవే భారమవుతాయి. జీవితం ఎప్పుడు ముగుస్తుందో ఎవరికీ తెలియదు కాబట్టి ప్రేమగా మాట్లాడటం, క్షమించడం, బంధాలను కాపాడుకోవడమే నిజమైన "లైఫ్ లగ్జరీ" అని ఈ భవన్ నిశ్శబ్దంగా గుర్తు చేస్తోంది.

# ఈఎంఐ కట్టకపోతే ఫోన్ లాక్.. 2027 నుంచి కొత్త రూల్స్.. ఆర్బీఐ కీలక నిర్ణయం



మనదేశంలో ఐఫోన్ లేదా ఒక మంచి స్మార్ట్‌ఫోన్ కొనే ముచ్చట రాగానే సగం మందికి గుర్తొచ్చే ఏకైక మాట ఈఎంఐ. నెలకు వెయ్యో రెండు వేలో కడితే చాలు.. చేతిలో కొత్త ఫోన్ మెరిసిపోతుంది కదా అని డబ్బా కొట్టుకుంటూ షాప్ నుంచి బయటకు వస్తుంటాం. తొలి నెల డౌన్ పేమెంట్ కట్టేసి ఫోన్ పట్టుకెళ్లాక ఆ తర్వాత వచ్చే నెలానెలా వాయిదాలను కాస్త తేలిగ్గా తీసుకునే 'మహా మేధావులకు' భారతీయ రిజర్వ్ బ్యాంక్ గట్టి షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇన్నాళ్లూ ఈఎంఐలు కట్టకపోతే రికవరీ ఏజెంట్లు పదే పదే ఫోన్లు చేసి విసిగించేవారు.. లేదా ఇంటికి వచ్చి రచ్చ చేసేవారు. కానీ 2027 జనవరి 1 నుంచి ఈ రికవరీ సీన్ పూర్తిగా మారిపోబోతోంది. మీరు గనుక క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించకపోతే బ్యాంకులు లేదా ఫైనాన్స్ కంపెనీలు డైరెక్ట్‌గా మీ చేతిలో ఉన్న ఫోన్‌నే ఊచల వెనక్కి నెట్టేస్తాయి. అంటే నాన్–పేమెంట్ బ్యాచ్‌కు చెక్ పెట్టడానికి ఆర్బీఐ రిమోట్ డివైజ్ లాకింగ్ అనే కొత్త మార్గదర్శకాలను రంగంలోకి దించుతోంది. ఈ కొత్త నిబంధనల వెనుక ఉన్న టైమ్‌లైన్ చూస్తే ఎవరైనా సరే వాయిదాల విషయంలో కాస్త భయపడాల్సిందే. మీరు ఈఎంఐ కట్టడంలో విఫలమై మొదటి 30 రోజులు దాటితే మీ ఫోన్‌కు పాక్షికంగా పక్షవాతం వస్తుంది. అంటే ఆర్బీఐ భాషలో దీనిని పార్షియల్ లాక్ అంటారు. ఈ దశలో ఫోన్‌లోని కొన్ని ముఖ్యమైన ఫీచర్లు, యాప్‌లు పనిచేయడం మానేస్తాయి. ఒకవేళ మొదటి నెల పోతే పోయిందిలే అని రెండో నెల కూడా 'చూద్దాంలే' అంటూ నిర్లక్ష్యం చేసి 60 రోజులు దాటేశారో ఇక అంతే సంగతులు. సదరు ఫైనాన్స్ కంపెనీలు మీ ఫోన్‌ను పూర్తిగా లాక్ చేసేస్తాయి. ఫోన్ మాత్రమే కాదు.. మీరు లోన్‌పై తీసుకున్న ల్యాప్‌టాప్, టాబ్‌లకు కూడా ఇదే డిజిటల్ తాళం వర్తిస్తుంది. అయితే వినియోగదారుల అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆర్బీఐ కాస్త దయ తలచింది. ఫోన్ పూర్తిగా లాక్ అయినప్పటికీ ఇన్‌కమింగ్ కాల్స్, ఎస్ఎంఎస్ లు, ఎమర్జెన్సీ కమ్యూనికేషన్ సేవలు మాత్రం యథాతథంగా పనిచేస్తాయి. దీనివల్ల లాభం ఏంటంటే అప్పు ఇచ్చిన కంపెనీ వాడు ఫోన్ చేసి "ఏరా బాకీ ఎప్పుడు కడతావ్?" అని తిట్టడానికి మీతో మాట్లాడటానికి లైన్ ఎప్పుడూ క్లియర్‌గానే ఉంచుతారన్నమాట. ఇక అందరినీ వేధించే ప్రధాన సందేహం ఏంటంటే ఫోన్ లాక్ చేస్తే లోపలున్న పర్సనల్ సమాచారం ఏమైపోతుంది అని.. దీనిపై ఆర్బీఐ చాలా స్పష్టమైన హామీ ఇచ్చింది. డివైజ్ లాక్ చేసే ప్రక్రియలో లెండర్లకు వినియోగదారుల వ్యక్తిగత డేటాపై ఎలాంటి యాక్సెస్ ఉండదు. మీ ఫోన్‌లో ఉన్న ప్రైవేట్ ఫోటోలు, వీడియోలు, కాంటాక్ట్స్, బ్యాంకింగ్ యాప్స్ లేదా ఇతర గోప్యమైన సమాచారాన్ని చూడటానికి కానీ సేకరించడానికి కానీ ఫైనాన్స్ కంపెనీలకు అస్సలు అనుమతి లేదు. వాళ్లకు కావాల్సిందల్లా మీరు కట్టాల్సిన బాకీ పైసలు మాత్రమే తప్ప మీ పర్సనల్ ముచ్చట్లు కాదని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రావడానికి ఇంకా సమయం ఉన్నందున ఇకపై లోన్ ఇచ్చే ముందే "నాయనా.. నువ్వు సమయానికి ఈఎంఐ కట్టకపోతే నీ ఫోన్‌ను రిమోట్‌గా లాక్ చేస్తాం" అని కంపెనీలు కస్టమర్లకు ముందే స్పష్టంగా చెప్పి వారి అంగీకారం తీసుకోవడం తప్పనిసరి. ప్రస్తుతం దేశంలో 'బై నౌ -- పే లేటర్' సంస్కృతి విపరీతంగా పెరిగిపోయి చాలామంది జేబులో రూపాయి లేకపోయినా ఖరీదైన గ్యాడ్జెట్స్ కొనేస్తున్నారు. ఈ కొత్త విధానంతో 2027 నుంచి ఈ "బై నౌ -- పే లేటర్" కాస్త "బై నౌ -- పే కరెక్ట్‌లీ.. లేకపోతే డబ్బా గోవిందా"గా మారబోతోంది. కాబట్టి స్మార్ట్‌ఫోన్లతో షో చేసే మహానుభావులు ఇప్పటినుంచే నెలానెలా ఈఎంఐలు కట్టే మంచి అలవాటు చేసుకుంటే మంచిది.. లేదంటే మీ చేతిలో ఉన్న ఆ ప్లాటినం ఫోన్ కేవలం ఒక సమాధి రాయిలా మారిపోవడం ఖాయం..

## టాక్సీ ప్రయాణాల్లోనూ ఇన్సూరెన్స్ ఆప్షన్.. ప్రభుత్వం స్పందిస్తుందా?





రోజూ ఆఫీసులకు, సొంత పనులకు క్యాబ్‌లు, బైక్ టాక్సీలపై వెళ్లేవారి సంఖ్య బాగా పెరిగింది. అయితే ఈ ప్రయాణాలు ఎంతవరకు సురక్షితం అనే ప్రశ్న మళ్లీ మొదలైంది. బెంగళూరుకు చెందిన ఇంటీరియర్ డిజైనర్ సాని కృష్ణకు ఎదురైన ఘోర ప్రమాదం, ఆ తర్వాత ఆమె పడిన వేదన ఇప్పుడు అందరినీ భయపెడుతోంది. ర్యాపిడో ప్రయాణంలో జరిగిన ఈ ఘటనతో, రైడ్ షేరింగ్ యాప్‌లలో కచ్చితమైన ఇన్సూరెన్స్ సదుపాయం ఉండాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

**కలవరపెడుతున్న ఘోర ప్రమాదం:**

కేరళకు చెందిన సాని కృష్ణ బెంగళూరులో ఇంటీరియర్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. జూన్ 17న ఆమె బైరాసంద్ర నుంచి డొమ్లూర్ ఆఫీస్‌కు వెళ్లడానికి ర్యాపిడో బైక్ టాక్సీ బుక్ చేసుకున్నారు. మార్గమధ్యలో రైడర్ తీవ్ర నిర్లక్ష్యంతో ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించడంతో బైక్ అదుపుతప్పింది. ఈ ఘోర ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడ్డారు.

**ఆస్పత్రి బిల్లులు.. కోలుకోలేని దెబ్బ:**

ఈ ప్రమాదంలో సాని కృష్ణ తొమ్మిది పక్కటెముకలు విరగడం, భుజం దెబ్బతినడం, ఊపిరితిత్తులు పాడవడం వంటి తీవ్ర గాయాలకు గురయ్యారు. అత్యవసర పరిస్థితిలో ఆమె ప్లీహం తొలగించాల్సి వచ్చింది. ఇక ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ కూడా చేశారు. బెంగళూరు, కేరళలోని ఆసుపత్రుల్లో చికిత్స పొందేసరికి దాదాపు రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఖర్చయింది.

**కంపెనీ వైఖరిపై తీవ్ర నిరసన:**

మహిళల భద్రత అని ప్రచారం చేసుకునే సంస్థ, ప్రమాదం జరిగిన తర్వాత తనను పూర్తిగా వదిలేసిందని సాని సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రూ. 1 లక్ష ఇన్సూరెన్స్ ఇచ్చి చేతులు దులుపుకుందని, పెద్ద మొత్తంలో ఆసుపత్రి బిల్లులు తామే భరించాల్సి వచ్చిందని తెలిపారు. ఇక న్యాయం కోసం ఆమె కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించడానికి సిద్ధమయ్యారు.

**ఇన్సూరెన్స్ ఆప్షన్ కచ్చితం కావాలి:**

మనం బస్సు లేదా రైలు టికెట్లు బుక్ చేసుకునేటప్పుడు స్వల్ప రుసుముతో ఇన్సూరెన్స్ ఆప్షన్ ఎంచుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ నిత్యం వేలాది మంది ప్రయాణించే క్యాబ్‌లు, బైక్ టాక్సీలలో అలాంటి బలమైన భద్రతా కవచం లేదు. ఇక కేవలం నామమాత్రపు బీమా కాకుండా, వైద్య ఖర్చులు పూర్తిగా కవర్ అయ్యేలా సమగ్ర ఇన్సూరెన్స్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైడ్ షేరింగ్ కంపెనీలు కేవలం లాభాలు, ప్రచారాలపైనే కాకుండా ప్రయాణికుల ప్రాణాలకు బాధ్యత వహించాలి. ఈ దిశగా ప్రభుత్వం తక్షణమే స్పందించి, టాక్సీ ప్రయాణాల్లో కచ్చితమైన ఇన్సూరెన్స్ ఆప్షన్‌ను నిబంధనగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు సరైన భరోసా లభిస్తుంది.

# ట్రంప్ చిక్కుముడి?

"మేము పని పూర్తి చేశాక, మీ ప్రభుత్వాన్ని మీరే స్వాధీనం చేసుకోండి. ఇది మీ చేతికి వస్తుంది. బహుశా తరాలుగా మీకు దక్కే ఏకైక అవకాశం ఇదే కావచ్చు" అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2026 ఫిబ్రవరి 28న ఇరానీయులను ఉద్దేశించి ప్రకటించారు. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్ సర్వోన్నత నేత అయతొల్లా అలీ ఖమేనీని హతమార్చి, ఆ దేశంపై యుద్ధం ప్రకటించిన తర్వాత ఈ మాటలన్నారు. ఐదున్నర నెలలు గడిచినా, వారాల్లో ముగుస్తుందని ట్రంప్ భావించిన యుద్ధం ఇప్పటికీ కొనసాగుతోంది. ఇస్లామిక్ రిపబ్లిక్ కేవలం మనుగడ సాగించడమే కాకుండా, స్వదేశంలో, ప్రాంతీయంగా తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. దాడులు, కాల్పుల విరమణలు, చర్చలు, హెచ్చరికలు, తిరిగి దాడులు, యూ-టర్న్‌ల మధ్య ట్రంప్ ఊగిసలాడుతూ, గౌరవప్రదమైన నిష్క్రమణ కోసం అన్వేషిస్తున్నారు. కానీ యుద్ధం అసంపూర్తిగానే మిగిలిపోగా, రిస్క్ తీసుకోవడానికి వెనుకాడని టెహ్రాన్ ముందు ట్రంప్ ఒక వ్యూహాత్మక ప్రతిష్టంభనలో చిక్కుకుపోయారు. అమెరికా, ఇజ్రాయెల్ ఈ యుద్ధాన్ని నాలుగు ప్రధాన లక్ష్యాలతో ప్రారంభించాయి. ఇరాన్ అణు కార్యక్రమాన్ని ధ్వంసం చేయడం, క్షిపణి సామర్థ్యాన్ని కూల్చడం, హమాస్, హౌతీలు వంటి మిత్రపక్షాలకు మద్దతును అంతం చేయడం, పాలన మార్పు తీసుకురావడం. మొదటి మూడు లక్ష్యాలూ నాలుగో లక్ష్యంతో విడదీయరానివి కావడంతో, పాలన మార్పే ఈ యుద్ధానికి కేంద్ర వ్యూహాత్మక లక్ష్యంగా మారింది. కేవలం వైమానిక దాడుల ద్వారానే పాలన మార్పు తీసుకురావడం ట్రంప్ ముందున్న అసలైన సవాలు -భూసైన్యాన్ని దింపేందుకు ఆయన సిద్ధంగా లేరు. టెహ్రాన్‌పై తిరుగుబాటుకు నాయకత్వం వహించగల విశ్వసనీయ మిత్రపక్షం అమెరికాకు లేదు.

2026 ఫిబ్రవరి నాటికి, ఇజ్రాయెల్ నిరంతర ఒత్తిడితోపాటు రెండు పరిణామాలు, ఇరాన్‌ను స్వల్పకాలిక యుద్ధంలోనే ఓడించవచ్చన్న నమ్మకాన్ని ట్రంప్‌కు కలిగించాయి. మొదటిది -జనవరిలో అమెరికా వెనిజులాపై చేసిన దండయాత్ర, ప్రాణనష్టం లేకుండా అధ్యక్షుడు నికొలస్ మదురోను బంధించడం ద్వారా అద్భుత విజయంగా ముగియడం. రెండోది -జనవరిలో ఇరాన్‌లో చెలరేగిన హింసాత్మక నిరసనలు, టెహ్రాన్ ప్రభుత్వం తీవ్రంగా బలహీనపడిందన్న నమ్మకాన్ని వాషింగ్టన్, టెల్ అవీవ్‌లలో బలపరిచాయి. నాయకత్వాన్ని తుదముట్టిస్తే ప్రభుత్వం కుప్పకూలిపోతుందని భావించారు. ఇది తీవ్రమైన తప్పుడు అంచనాగా తేలింది. ఇరాన్ ప్రతిస్పందన మూడు మూలస్తంభాలపై ఆధారపడింది. రాజ్యాన్ని కాపాడుకోవడం, యుద్ధాన్ని ప్రాంతీయంగా విస్తరించడం, హోరిజాంటల్ ఎస్కలేషన్ ద్వారా అమెరికా ఆర్థిక వ్యయాన్ని పెంచడం. నాయకుడిని తొలగిస్తే కుప్పకూలిపోయే వ్యక్తిత్వ-ఆధారిత నియంతృత్వ పాలనగా ట్రంప్ ఇరాన్‌ను తప్పుగా అంచనా వేశారు. కానీ ఇరాన్ రాజ్యం లోతుగా పాతుకుపోయిన సంస్థాగత వ్యవస్థ, షియా త్యాగ భావనలను రాజకీయ విప్లవ ఆదర్శాలతో మేళవించిన సిద్ధాంతంపై ఆధారపడి ఉంది. దాడి జరిగినప్పుడు, ఈ వ్యవస్థ మరింత సంఘటితమైంది, లక్షలాది మంది జెండా చుట్టూ ఏకమయ్యారు. రెండో అంశం -అమెరికా స్థావరాలను దుర్బలమైన లక్ష్యాలుగా టెహ్రాన్ మార్చేసింది. ప్రపంచ ముడిచమురులో దాదాపు 20 శాతం ఈ మార్గం గుండా వెళ్లే హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసి, పర్షియన్ గల్ఫ్‌ను యుద్ధభూమిగా మార్చేసింది. జలసంధి మూసివేతకు అమెరికా వద్ద ఎలాంటి ప్రత్యామ్నాయ ప్రణాళిక లేకపోవడం గమనార్హం. జలమార్గం మూతపడిన తర్వాతే యుద్ధ గతిశీలత మారడం మొదలైంది. అప్పుడే ట్రంప్ వ్యూహాత్మక చొరవను కోల్పోవడం మొదలుపెట్టారు. 40 రోజుల బాంబింగ్ తర్వాత, ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ప్రకటించారు. జూన్ 17న ఇరాన్‌తో అవగాహన ఒప్పందంపై సంతకం చేసినా, దీన్ని దేశీయంగా విజయంగా చూపించలేకపోవడంతో మళ్లీ సైనిక దాడులు ప్రారంభించారు, ప్రతిసారీ ఇరాన్ ప్రతీకార చర్యలతో స్పందించింది. దాదాపు ఐదు దశాబ్దాలుగా అమెరికా ఆంక్షల కింద జీవిస్తున్న టెహ్రాన్, ప్రాంతీయ శక్తి సమతూకాన్ని పునర్నిర్మించుకునే వ్యూహాత్మక అవకాశాన్ని చూస్తూ ఈ బాధను భరించేందుకు సిద్ధంగా కనిపిస్తోంది.

యుద్ధం సాగుతున్న కొద్దీ, అసమాన యుద్ధతంత్రం నీడల నుంచి బయటకు వచ్చిన ఇరాన్, సంఘర్షణ గమనాన్ని కూడా క్రమంగా శాసిస్తూ వచ్చింది. జూలైలో అమెరికా బాంబింగ్ మళ్లీ ప్రారంభం కాగా, వాషింగ్టన్ ప్రధాన లక్ష్యం హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడంపైకి మళ్లింది. యుద్ధం నాలుగో నెలలోకి అడుగుపెట్టేసరికి, పాలన మార్పునుంచి అణు కార్యక్రమ ధ్వంసం వరకూ.. అసలైన లక్ష్యాలను పక్కనపెట్టి, టెహ్రాన్ సృష్టించిన కొత్త వ్యూహాత్మక సమస్యతో వాషింగ్టన్ తలపడాల్సి వచ్చింది. జోర్డాన్, ఇరాకీ కుర్దిస్తాన్, సిరియా, పర్షియన్ గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ యుద్ధాన్ని విస్తరించగా, యెమెన్ హౌతీలు సౌదీ చమురు కేంద్రాలపై దాడి చేసి ఎర్ర సముద్ర తీర రేవులపై నౌకా దిగ్బంధనం విధించారు. ఆగస్టు తొలివారంలో వచ్చిన తాజా వార్తల ప్రకారం, హర్మూజ్ జలసంధి తెరిచేందుకు ఒమన్ మధ్యవర్తిత్వంలో ఇరాన్-అమెరికా చర్చలు తుది దశలో ఉన్నాయి, అయితే పూర్తిస్థాయి పునరుద్ధరణ ఇంకా ఖరారు కాలేదు. అదే సమయంలో, అమెరికా క్షిపణి రక్షణ వ్యవస్థల్లో మందుగుండు నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయినట్టు నివేదికలు వెలువడటం గమనార్హం. 21వ శతాబ్దంలో అమెరికా చేపట్టిన ప్రధాన సైనిక ప్రచారాలను పరిశీలిస్తే, ఆఫ్ఘానిస్తాన్, ఇరాక్, లిబియాలలో కనీసం తక్షణ సైనిక లక్ష్యాలనైనా అమెరికా సాధించింది. కానీ ఇరాన్ విషయంలో మాత్రం, తొలిదశలోనే అమెరికా యుద్ధాన్ని కోల్పోయింది. పశ్చిమాసియాలో బలహీనమైన ఉనికితో అమెరికా ఇప్పుడు మిగిలిపోగా, హర్మూజ్‌పై నియంత్రణతో ఇరాన్ ఒక పర్షియన్ గల్ఫ్ ప్రాంతీయ శక్తిగా తనను తాను తిరిగి నిలబెట్టుకుంటోంది. పాలన మార్పు సంగతి పక్కనపెడితే, తాను కూలదోయాలనుకున్న అదే పాలనతో ఒప్పందం కుదుర్చుకోవాలని నేడు ట్రంప్ కోరుకుంటున్నారు. ఈ పర్షియన్ చిక్కుముడిలో చిక్కుకుపోయిన ఆయన ముందు మంచి ఎంపికలు తక్కువగానే మిగిలాయి. ఓటమిని అంగీకరించి దౌత్యపరమైన సహనంతో ఒప్పందం కుదుర్చుకోవడం ఒకటైతే, 1956 సూయజ్ యుద్ధం నుంచి పర్షియన్ గల్ఫ్‌లో ఆధిపత్య శక్తిగా కొనసాగుతున్న వాషింగ్టన్‌కు ఇది గణనీయమైన వ్యూహాత్మక మూల్యంగా మారుతుంది. లేదంటే, విఫలమైన వైమానిక ప్రచారాన్ని పూర్తిస్థాయి దండయాత్రగా మార్చే అవకాశం ఉంది.

## పనికొచ్చే పలుకు




# సరిగ్గా వాడితే.. ఒక్క జీవితం చాలు!

ప్రముఖ అమెరికన్ గాయకుడు, నటుడు ఫ్రాంక్ సినాత్రా చెప్పిన ఓ ప్రముఖ సూక్తి ఇప్పటికీ కోట్లమందికి స్ఫూర్తి. జీవితం నిడివికంటే మనం తీసుకునే నిర్ణయాలే దాన్ని ప్రత్యేకంగా నిలుపుతాయని చెప్పే మాటలో ఎంతో నిగూడార్థం ఉంది. జీవితం ఎంతకాలం సాగిందనే దానికంటే, దాన్ని ఎంత అర్థవంతంగా గడిపామనేదే ముఖ్యం. ఇదే అంశాన్ని అమెరికాకు చెందిన దిగ్గజ గాయకుడు, నటుడు ఫ్రాంక్ సినాత్రా ఎంతో సులువైన పదాల్లో చెప్పారు. "ఈ జీవితం ఒక్కసారే లభిస్తుంది, కానీ మనం సరిగ్గా పావులు కదిపితే ఆ ఒక్కసారి చాలు" అన్నారాయన. ఆయన చెప్పిన ఈ మాటలు దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ ఎంతోమందిలో ఆలోచనలు రేకెత్తిస్తున్నాయి. మళ్లీ అవకాశం వస్తే బాగుణ్ణు అని గతాన్ని తలుచుకోవడం కంటే, చేతిలో ఉన్న ఒకే ఒక్క జీవితాన్ని సరైన నిర్ణయాలతో అందంగా తీర్చిదిద్దుకోవాలని ఈ సూక్తి ప్రభోధిస్తోంది.

'పావులు సరిగ్గా కదపడం' అంటే ఏమిటి?

'ప్లే యువర్ కార్డ్స్ రైట్' అనేది పేకాట నుంచి వచ్చిన నానుడి. మన చేతికి ఎలాంటి కార్డులు వచ్చాయనే దానికంటే, వాటిని ఎంత తెలివిగా వాడామనేదే విజయాన్ని నిర్ణయిస్తుంది. జీవితంలో కూడా మనకు లభించిన పరిస్థితులను ఎలా ఉపయోగించుకున్నాం, ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నాం అనేదే అసలైన విజయమని సినాత్రా స్పష్టం చేశారు.

సమాజంలో ధనం, హోదా లేదా ఆయుష్షు ఆధారంగా విజయాన్ని కొలుస్తారు. కానీ "నేను తృప్తిగా జీవించానా?" అని మనల్ని మనం ప్రశ్నించుకోవడమే అసలైన విజయం. చేసిన తప్పులనే తలుచుకుంటూ వర్తమానాన్ని పాడుచేసుకోకుండా, ధైర్యంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడం, ఇతరులకు మేలు చేయడం, ఆశయాలవైపు అడుగులు వేయడమే నిజమైన జీవితం.

ఎవరు ఈ ఫ్రాంక్ సినాత్రా?

1915 డిసెంబర్ 12న న్యూజెర్సీలోని హోబోకెన్‌లో జన్మించిన సినాత్రా, సాధారణ నేపథ్యం నుంచి వచ్చి అంతర్జాతీయ స్థాయి స్టార్‌గా ఎదిగారు. "ఆల్ బ్లూ ఐస్", "ది వాయిస్"గా ప్రసిద్ధి చెందిన ఆయన, ఆరు దశాబ్దాలకు పైగా వినోద ప్రపంచాన్ని ఏలారు. 'మై వే', 'ఫ్లై మీ టు ది మూన్', 'న్యూయార్క్, న్యూయార్క్', 'స్ట్రేంజర్స్ ఇన్ ది నైట్' వంటి ఎన్నో చిరస్మరణీయ పాటలను అందించారు.

సంగీతంతోపాటు నటుడిగానూ ప్రతిభ చాటారు. 1953లో వచ్చిన 'ఫ్రమ్ హియర్ టు ఎటర్నిటీ' చిత్రంలో నటనకుగాను ఉత్తమ సహాయ నటుడిగా ఆస్కార్ అవార్డును అందుకున్నారు. డీన్ మార్టిన్, సామీ డేవిస్ జూనియర్ వంటి ప్రముఖులతో కలిసి 'రాట్ ప్యాక్' బృందంలో సందడి చేశారు. గ్రామీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలు పొందారు. 1998 మే 14న తన 82వ ఏట ఆయన కన్నుమూశారు.

ఎప్పుడు చూడు ఇతరులతో పోల్చుకుంటూ, నిరంతరం అదనపు విజయాల వెనుక పరిగెత్తే నేటి జీవనశైలిలో సినాత్రా మాటలు ఒక కొత్త కోణాన్ని చూపిస్తాయి. ఫలితాల సంఖ్య కంటే అనుభవాల నాణ్యతకే ప్రాధాన్యమివ్వాలని గుర్తుచేస్తాయి. కెరీర్, బంధాలు, వ్యక్తిగత ఎదుగుదల ఏదైనా సరే.. రోజువారీ నిర్ణయాలే మన భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ఆత్మవిశ్వాసం, స్పష్టమైన లక్ష్యంతో జీవించే ఒక్క జీవితమైనా పరిపూర్ణమైన తృప్తిని ఇస్తుందనేదే సినాత్రా అందించిన అమూల్యమైన సందేశం.

# అ'నైపుణ్య భారతం'!?

**భారత్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) సంఖ్య 2,117కు చేరింది, 23.6 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఫోర్బ్స్ గ్లోబల్ 2000 జాబితాలోని 506 సంస్థలు ఇప్పటికే ఇక్కడ కేంద్రాలు నెలకొల్పాయి. బెంగళూరు 'ప్రపంచ జీసీసీ రాజధాని'గా, హైదరాబాద్ రెండో స్థానంలో నిలుస్తున్నాయి. అయితే, పట్టభద్రుల్లో సగంమందికి ఉద్యోగ నైపుణ్యాలు కొరవడటం ఆందోళనకరం. 2030 నాటికి ఐదువేల జీసీసీల లక్ష్యానికి నైపుణ్య పెంపే కీలకం.**




బహుళజాతి సంస్థలు తమ సాంకేతిక, నవకల్పన, ఖాతాదారుల సేవా అవసరాల కోసం భారత్‌లో ఏర్పాటు చేసుకుంటున్న ఆఫ్‌షోర్ కేంద్రాలే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు). రెండు దశాబ్దాల క్రితం ఐటీ పరిశ్రమను తీర్చిదిద్దిన బీపీవో నమూనాకు ఇవి ఆధునిక అవతారం. కొవిడ్ అనంతరం డిజిటలీకరణ వేగవంతం కావడంతో, దేశంలో జీసీసీల విస్తరణ, నవకల్పన కేంద్రాల ఏర్పాటు మరింత జోరందుకున్నాయి. 1985లో టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ డిజైన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో భారత్‌లో జీసీసీల చరిత్ర ఆరంభమైంది. 1998లో మైక్రోసాఫ్ట్ తన మొదటి పరిశోధన-అభివృద్ధి కేంద్రమైన ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పింది. అప్పటి నుంచి రెండు దశాబ్దాల్లో భారత్ వేలాది జీసీసీలకు ప్రధాన గమ్యస్థానంగా మారింది. డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి కార్యక్రమాలు, లాభదాయకమైన యూనికార్న్ పర్యావరణ వ్యవస్థ, వ్యాపార అనుకూల నిబంధనలు, పటిష్ఠ మౌలిక వసతులు కలిసి బహుళజాతి సంస్థలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాయి. దాదాపు 53,460 కళాశాలలు, 1,400 విశ్వవిద్యాలయాలతో ప్రపంచంలోనే అతిపెద్ద ఉన్నత విద్యా వ్యవస్థను కలిగిన భారత్, ఏటా లక్షలాది పట్టభద్రులను ఉత్పత్తి చేస్తోంది. తాజా నాస్కామ్-జిన్నోవ్ నివేదిక ప్రకారం, ప్రస్తుతం దేశంలో 2,117 జీసీసీలు, 3,728 యూనిట్ల ద్వారా పనిచేస్తుండగా, ఇవి 23.6 లక్షలమంది టెక్ నిపుణులకు ఉపాధి కల్పిస్తున్నాయి. 2021 నుంచి ఈ రంగం 32 శాతం వృద్ధి సాధించగా, ఫోర్బ్స్ గ్లోబల్ 2000 జాబితాలోని 506 సంస్థలు ఇప్పటికే భారత్‌లో తమ కేపబిలిటీ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. ఈ పర్యావరణ వ్యవస్థ మొత్తం ఆదాయం ఇప్పుడు 9,840 కోట్ల డాలర్లకు చేరుకుంది.

ఒకప్పుడు తక్కువ ఖర్చుతో బ్యాక్ ఆఫీస్ పనులకే పరిమితమైన దేశీయ జీసీసీలు, ఇప్పుడు బహుళజాతి సంస్థల కోసం ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ, పరిశోధన-అభివృద్ధి సేవలను అందిస్తున్నాయి. కేవలం అమలు కేంద్రాలుగా కాకుండా, సంస్థాగత వ్యూహాలను రూపొందించే వ్యూహాత్మక నాడీ కేంద్రాలుగా ఇవి పరిణామం చెందుతున్నాయని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. మరో ఐదేళ్లలో జీసీసీల ద్వారా భారత జీడీపీకి 47 వేలనుంచి 60 వేల కోట్ల డాలర్లు సమకూరుతాయని, సుమారు 2.5 కోట్ల ఉద్యోగాలు అందివస్తాయని అంచనా. 2022-23లో ఇంజినీరింగ్, పరిశోధన-అభివృద్ధి జీసీసీల ద్వారా 2,500 కోట్ల డాలర్ల ఆదాయం సమకూరగా, ఇది ఐటీ, బీపీవోల ద్వారా వచ్చిన రాబడికంటే అధికం కావడం విశేషం. నిరుడు భారత సేవా ఎగుమతుల విలువ 42,100 కోట్ల డాలర్లు కాగా, అందులో జీసీసీల వాటా 16,400 కోట్ల డాలర్లుగా నమోదైంది. నేడు దేశంలోని 35కి పైగా నగరాల్లో యాభై దేశాలకు చెందిన జీసీసీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వీటిలో సగానికి పైగా అమెరికాకు చెందినవే కాగా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాల సంస్థలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. దీంతో అగ్రశ్రేణి భారతీయ నిపుణులు అంతర్జాతీయ జీసీసీ బృందాలకు నాయకత్వం వహించేందుకు స్వదేశానికి తిరిగి వస్తున్నారు. ఆల్‌స్టోమ్ కంపెనీ పరిశోధన-అభివృద్ధిలో 40 శాతం, అడోబ్ సంస్థ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్‌లో మూడో వంతు కార్యకలాపాలు ఇండియాలోనే జరుగుతున్నాయి. ఇంటెల్ ఇండియా సెమీకండక్టర్ ఇంజినీరింగ్‌లో నిమగ్నమై ఉండగా, బాష్, మెర్సిడెస్ బెంజ్, వోల్వో, జనరల్ మోటార్స్ వంటి దిగ్గజ సంస్థలు భారీయెత్తున ఆటోమొబైల్ పరిశోధన కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. దేశంలో 1,200కు పైగా జీసీసీలు కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ సాంకేతికతలను వినియోగిస్తుండగా, ఎంటర్‌ప్రైజ్ ఏఐ ప్రతిభావంతుల నియామకంలో భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద కేంద్రంగా అవతరించింది. దేశంలోని 83 శాతం జీసీసీలు జనరేటివ్ ఏఐపైనా, 58 శాతం ఏజెంటిక్ ఏఐపైనా దృష్టి సారించాయి.

'భారత సిలికాన్ వ్యాలీ'గా పేరొందిన బెంగళూరులో వెయ్యికి పైగా జీసీసీలు ఉండటంతో, ఈ నగరం 'ప్రపంచ జీసీసీ రాజధాని'గా అవతరించింది. అయిదొందలకు పైగా జీసీసీలతో హైదరాబాద్ రెండోస్థానంలో నిలుస్తోంది. మైక్రోసాఫ్ట్, వెల్స్‌ఫార్గో వంటి టెక్, బీఎఫ్ఎస్ఐ దిగ్గజాలకు భాగ్యనగరం నిలయంగా మారింది. ప్రపంచంలోని టాప్ 18 ఫార్మా బహుళజాతి సంస్థల్లో తొమ్మిది హైదరాబాద్‌లోనే కేంద్రాలు కలిగి ఉండటం విశేషం. ఈ ఆవిష్కరణల కోసం జీసీసీలు భారతీయ విద్యాసంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకుంటున్నాయి. బాష్ సైబర్-ఫిజికల్ సిస్టమ్స్, ఏఐ కేంద్రాల కోసం ఐఐఎస్సీ, ఐఐటీ మద్రాస్‌లకు నిధులు సమకూర్చగా, హిందీ భాషా ఏఐ సూట్ అభివృద్ధి కోసం శాంసంగ్ వీఐటీతో చేతులు కలిపింది. అయితే, జీసీసీల విస్తరణ వేగానికి తగ్గట్టుగా నైపుణ్యాభివృద్ధి సాగడం లేదన్నది ఆందోళనకరమైన అంశం. భారత్ ఏటా సుమారు 3.7 కోట్ల మంది పట్టభద్రులను ఉత్పత్తి చేస్తున్నా, దాదాపు సగం మందిలో ఉద్యోగ నైపుణ్యాలు కొరవడుతున్నాయి. కేవలం 25 శాతం ఇంజినీరింగ్ పట్టభద్రులే ఐటీ శ్రామికశక్తిలోకి ప్రవేశించడానికి అర్హత సాధిస్తున్నారు. మెట్రో నగరాల్లో ప్రతిభావంతుల కొరత, పెరుగుతున్న నిర్వహణ వ్యయాల నేపథ్యంలో, జీసీసీలు ఇప్పుడు ద్వితీయ శ్రేణి నగరాలవైపు కూడా దృష్టి సారిస్తున్నాయి. 2019లో కేవలం 5 శాతంగా ఉన్న ద్వితీయ శ్రేణి నగరాల వాటా, 2025 నాటికి 7 శాతానికి చేరగా, 2028 నాటికి ఇది 30-40 శాతానికి పెరుగుతుందని అంచనా. కాబట్టి, జీసీసీలకు అవసరమైన నైపుణ్యాలను మరింతమందికి అలవరచడం అత్యావశ్యకం. 2030 నాటికి దేశంలో ఐదు వేల జీసీసీలను ఏర్పాటు చేసి, ఏటా 1,100 కోట్ల డాలర్లకు పైగా ఆదాయాన్ని అందుకోవాలని కేంద్రం సంకల్పించింది. ఈ లక్ష్య సాధనలో రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉంది. నైపుణ్య శిక్షణ, పరిశోధన మౌలిక సదుపాయాలు, విధాన సంస్కరణలపై సమన్వయంతో పెట్టుబడి పెట్టినప్పుడే, భారత్ కేవలం అమలు కేంద్రంగా కాకుండా, ప్రపంచ నవకల్పనలకు నిజమైన కేంద్రంగా ఎదగగలదు. ■



క్రమశిక్షణ.. వెతికితే దొరికేది కాదు. అది మనలోనే ఉంటుంది. దాన్ని సులభంగా ఆచరించగలిగేలా మన శరీరాన్ని తయారు చేసుకోవాలి. మంచి నిద్ర, బలమైన కండరాలు, రక్తంలో సమతుల చక్కెరస్థాయిలు, ప్రశాంతమైన నాడీ వ్యవస్థ ద్వారా ఇది సాధ్యమవుతుంది. శరీర జీవక్రియ ఆరోగ్యంగా ఉంటేనే మనసు కూడా శారీరక క్రమశిక్షణను అనుసరిస్తుంది. ఆరోగ్యకరమైన శరీరమే క్రమశిక్షణకు పునాది. అందుకే క్రమశిక్షణను వెతకడం మానేసి, దాన్ని పెంపొందించే శారీరక పరిస్థితులను నిర్మించుకోవాలి. శరీరం సహకరించినప్పుడే, మనసు కూడా నిలకడగా నడుస్తుంది.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# 40ఏళ్ల తరువాత క్షమాపణ




నలభై ఏళ్ల క్రితం దొంగిలించిన పుస్తకాన్ని క్షమాపణ లేఖ, 100 డాలర్లతో సహా తిరిగి పంపిన వింత ఘటన కాలిఫోర్నియాలో చోటుచేసుకుంది. యురేకా నగరంలోని 'బుక్‌లెగ్గర్' పుస్తక దుకాణానికి ఇటీవల ఓ పార్శిల్ చేరింది. అందులో ఎడ్వర్డ్ గోరీ రాసిన 'ది అన్‌స్ట్రంగ్ హార్ప్' పుస్తకం ఉంది. తాను హెచ్ఎస్‌యూ విద్యార్థిగా ఉన్నప్పుడు మద్యం, డ్రగ్స్ వ్యసనంతో తీవ్ర ఇబ్బందుల్లో ఉండేవాడినని, డబ్బు అవసరం కోసమే ఈ పుస్తకాన్ని దొంగిలించానని లేఖ రాసిన వ్యక్తి వెల్లడించారు. అప్పట్లో తనకు నిజంగా కావాల్సింది డబ్బుకంటే ఆధ్యాత్మిక మేల్కొలుపు అని, కాలక్రమేణా అలాంటి మార్పు తనలో వచ్చిందని పేర్కొన్నారు. తన గ్యారేజీలో ఉన్న ఓ పెట్టెలో ఇటీవల ఈ పుస్తకం మళ్లీ కనిపించడంతో, పాత తప్పును సరిదిద్దుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆనాటి దొంగ వివరించాడు.

# బాదంపప్పు, వాల్‌నట్స్ వంటి గింజలను ఎక్కువ కాలం పాటు ఇలా నిల్వ చేయండి..



గింజలు (నట్స్) ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఆహారాల్లో ఒకటి. బాదం, పిస్తా, అక్రోట్స్ వంటి నట్స్‌లో విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు సమృద్ధిగా ఉంటాయి. అయితే వీటి పూర్తి ప్రయోజనాలను పొందాలంటే సరైన పరిమాణంలో తీసుకోవడంతో పాటు వాటిని సరిగ్గా నిల్వ చేయడం కూడా చాలా ముఖ్యం. తేమ, వేడి, గాలి ప్రభావానికి గురైతే నట్స్ త్వరగా పాడైపోయే అవకాశం ఉంటుంది. తయారీ తేదీ, నిల్వ చేసే ఉష్ణోగ్రత వంటి అంశాలు కూడా వాటి నిల్వ కాలాన్ని ప్రభావితం చేస్తాయి. కొన్ని సులభమైన జాగ్రత్తలు పాటిస్తే నట్స్‌ను ఎక్కువకాలం తాజాగా ఉంచుకోవచ్చు. ముందుగా నట్స్‌ను తాజాగా కొనుగోలు చేయడం మంచిది. ఒకేసారి ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడం కంటే కొన్ని వారాల్లో వినియోగించగలిగేంత పరిమాణంలో కొనడం ఉత్తమం. ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసిన నట్స్‌ను సరిగా నిల్వ చేయకపోతే వేడి కారణంగా త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది. కొనుగోలు చేసే ముందు వీలైతే వాటి తాజాదనాన్ని రుచి చూసి నిర్ధారించుకోవడం మంచిది.

### తేమ వెళ్లకుండా..

నట్స్‌ను గాలి చొరబడని డబ్బాల్లో నిల్వ చేయడం ఉత్తమ మార్గం. గాలి లోపలికి వెళ్లకుండా ఉండటం వల్ల అవి ఎక్కువకాలం తాజాగా ఉంటాయి. ముఖ్యంగా బాదం, అక్రోట్స్ వంటి నట్స్ బయట వాసనలను సులభంగా పీల్చుకునే స్వభావం కలిగి ఉంటాయి. గాలి చొరబడని కంటైనర్లు ఈ సమస్యను నివారించడంలో సహాయపడతాయి. నట్స్‌ను ఎప్పుడూ చల్లని, పొడి ప్రదేశంలో ఉంచాలి. స్టవ్ పైన ఉన్న కిచెన్ క్యాబినెట్‌లలో లేదా అధిక వేడి ఉండే ప్రదేశాల్లో నిల్వ చేయడం మంచిది కాదు. అధిక ఉష్ణోగ్రతలకు గురైతే నట్స్ త్వరగా పాడై రుచి మారిపోతుంది. అలాగే నిల్వ చేసే ముందు అవి పూర్తిగా పొడిగా ఉన్నాయో లేదో కూడా నిర్ధారించుకోవాలి.

### రుచి తగ్గినట్లు అనిపిస్తే..

నట్స్ కొద్దిగా పాతబడి రుచి తగ్గినట్లు అనిపిస్తే, వాటిని ఓవెన్‌లో కొన్ని నిమిషాలు స్వల్పంగా వేడి చేయవచ్చు. ఇలా చేయడం వల్ల వాటి సహజ రుచి కొంతవరకు తిరిగి వచ్చే అవకాశం ఉంటుంది. అయితే నట్స్‌లోని సహజ నూనెలు పూర్తిగా చెడిపోయి ఉంటే ఈ పద్ధతి ఉపయోగపడదు. ఈ చిన్నచిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా నట్స్‌ను ఎక్కువకాలం తాజాగా ఉంచుకోవడంతోపాటు వాటి రుచి, నాణ్యతను కూడా కాపాడుకోవచ్చు.

# మధుమేహం ఉన్నవారికి వరం విటమిన్ డి.. సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి..



విటమిన్ డి శరీరానికి అత్యంత అవసరమైన పోషకాలలో ఒకటి. దీనిని సన్‌షైన్ విటమిన్ అని కూడా పిలుస్తారు. ఎముకల ఆరోగ్యంతోపాటు శరీరంలోని అనేక కీలక వ్యవస్థలు సక్రమంగా పనిచేయడానికి ఇది అవసరం. ఒక అధ్యయనం ప్రకారం విటమిన్ డి క్లోమగ్రంథి (ప్యాంక్రియాస్)లో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసి, నిల్వ చేసి, విడుదల చేసే బీటా కణాల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడే అవకాశం ఉందని పరిశోధకులు గుర్తించారు. దీంతో మధుమేహం చికిత్సలో విటమిన్ డి పాత్రపై కొత్త ఆశలు కనిపిస్తున్నాయి. పరిశోధకుల ప్రకారం శరీరంలో విటమిన్ డి స్థాయిలు ఎక్కువగా ఉండటం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. విటమిన్ డి రిసెప్టర్‌ను చురుకుగా చేయడం ద్వారా శరీరంలోని వాపులను తగ్గించే జన్యువుల పనితీరు మెరుగుపడి, ఒత్తిడిలో కూడా బీటా కణాలు మనుగడ సాగించేందుకు తోడ్పడతాయని అధ్యయనం పేర్కొంది. అయితే కేవలం విటమిన్ డి ఒక్కటే బీటా కణాలను పూర్తిగా రక్షించలేదని కూడా పరిశోధకులు వెల్లడించారు.

### సూర్యకాంతి తగలాలి..

శరీరంలో విటమిన్ డి లోపం రాకుండా ఉండాలంటే ప్రతిరోజూ కొంతసేపు సూర్యరశ్మిలో గడపడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు కనీసం ఐదు నిమిషాలపాటు ఎండలో ఉండటం వల్ల చర్మంలో ఉండే కొలెస్ట్రాల్‌పై సూర్యుని అతినీలలోహిత కిరణాలు ప్రభావం చూపి విటమిన్ డిగా మారుతుంది. అలాగే వారానికి కనీసం మూడు రోజులైనా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య సూర్యరశ్మి శరీరానికి అందితే విటమిన్ డి స్థాయిలు పెరగడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఆహారంలో విటమిన్ డి సమృద్ధిగా ఉండే పదార్థాలను చేర్చుకోవడం కూడా అవసరం. ముఖ్యంగా పుట్టగొడుగులు, గుడ్డు పచ్చసొన, కాడ్ లివర్ ఆయిల్, కొవ్వు ఎక్కువగా ఉండే చేపలు వంటి ఆహారాల్లో విటమిన్ డి లభిస్తుంది.

### ఈ ఆహారాలను తీసుకుంటే..

సోయా పాలు, మజ్జిగ వంటి పానీయాలను రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం కూడా విటమిన్ డి అందించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. అయితే ఇతర విటమిన్ డి ఫోర్టిఫైడ్ పానీయాలను తీసుకునే ముందు పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. విటమిన్ డి లోపం ఉన్నట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయినప్పుడు మాత్రమే వైద్యుల పర్యవేక్షణలో విటమిన్ డి సప్లిమెంట్లను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. స్వయంగా మందులు వాడటం ఆరోగ్యానికి హానికరమవుతుందని హెచ్చరిస్తున్నారు. విటమిన్ డి ఎక్కువగా కాడ్ లివర్ ఫిష్ ఆయిల్, ఎండబెట్టిన షిటాకే పుట్టగొడుగులు, గుడ్లు, పూర్తి పాలతో తయారుచేసిన మజ్జిగ, చెడార్ లేదా పార్మెసన్ చీజ్ వంటి ఆహారాల్లో లభిస్తుంది. వీటిని తీసుకోవడం ద్వారా మనం తగినంత విటమిన్ డిని పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# వయస్సు పెరుగుతున్న కొద్దీ చర్మంపై కనిపించే ముడతలను ఇలా తగ్గించుకోండి



వయసు పెరుగుతున్న కొద్దీ చర్మంపై ముడతలు కనిపించడం సహజం. అయితే కేవలం వయసే కాదు, చర్మంలో తేమ తగ్గడం, స్థితిస్థాపకత (ఎలాస్టిసిటీ) కోల్పోవడం, అధిక సూర్యరశ్మి, కాలుష్యం, ధూమపానం, అలాగే పోషకాహార లోపాలు కూడా ముడతలు త్వరగా రావడానికి కారణమవుతాయి. చాలా మంది వీటిని తగ్గించేందుకు ఖరీదైన యాంటీ ఏజింగ్ క్రీములను ఉపయోగిస్తుంటారు. అయితే ఇంట్లోనే లభించే కొన్ని సహజ పదార్థాలతో కూడా చర్మ సంరక్షణ చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అదే సమయంలో సమతుల్యమైన ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం కూడా ఎంతో ముఖ్యమని చెబుతున్నారు. మొట్టమొదటగా గుడ్డు తెల్లసొనను ఉపయోగించవచ్చు. ఒక గిన్నెలో గుడ్డు తెల్లసొనను బాగా గిలక్కొట్టి నేరుగా ముఖంపై రాసి, మృదువుగా మసాజ్ చేయాలి. సుమారు 15 నిమిషాలు లేదా పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇందులో ఉండే ప్రోటీన్, విటమిన్ బి, విటమిన్ ఇ చర్మాన్ని పోషించి ముడతలను తగ్గించడంలో సహాయపడతాయి.

### ఆలివ్ ఆయిల్, నిమ్మరసం..

ఆలివ్ ఆయిల్ కూడా చర్మానికి మంచి సహజ మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. రాత్రి నిద్రపోయే ముందు కొన్ని చుక్కల ఆలివ్ ఆయిల్‌ను ముఖంపై మృదువుగా మసాజ్ చేసి, అదనంగా ఉన్న నూనెను మృదువైన వస్త్రంతో తుడవాలి. ఇలా చేయడం వల్ల ఉదయానికి చర్మం మరింత మృదువుగా, తేమతో కనిపించే అవకాశం ఉంటుంది. నిమ్మరసంలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. కొద్దిగా నిమ్మరసాన్ని ముడతలు ఉన్న ప్రాంతాల్లో రాసి సున్నితంగా మసాజ్ చేయవచ్చు. ఇది చర్మాన్ని కాంతివంతంగా కనిపించేలా చేయడంలో తోడ్పడుతుంది. అయితే నిమ్మరసం ఆమ్ల గుణాలు కలిగి ఉండటంతో ఎక్కువగా లేదా తరచూ ఉపయోగించకుండా జాగ్రత్త వహించాలి. అలోవెరా జెల్‌లో ఉండే మాలిక్ యాసిడ్ చర్మ స్థితిస్థాపకతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. తాజా అలోవెరా ఆకులోని జెల్‌ను తీసి ముఖంపై రాసి 15 నిమిషాల తర్వాత కడిగేయాలి. లేదా విటమిన్ ఇ ఆయిల్‌తో కలిపి కూడా ఉపయోగించవచ్చు.

### అరటి పండు, క్యారెట్లు..

అరటిపండులోని పోషకాలు కూడా చర్మానికి మేలు చేస్తాయి. రెండు అరటిపండ్లను మెత్తగా మెదిపి పేస్ట్‌లా చేసి ముఖంపై రాసి సుమారు అరగంట తర్వాత కడిగేయాలి. కావాలంటే తేనె, అవకాడోతో కలిపి కూడా ఉపయోగించవచ్చు. క్యారెట్‌లో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడి చర్మాన్ని మృదువుగా ఉంచడంలో సహాయపడుతుంది. ఉడికించిన క్యారెట్‌ను తేనెతో కలిపి పేస్ట్ చేసి ముఖానికి పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. అలాగే క్యారెట్‌ను నేరుగా ఆహారంగా తీసుకోవడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. అనాసపండులో ఉండే ఎంజైములు చర్మానికి తేమను అందించడంతో పాటు చనిపోయిన కణాలను తొలగించడంలో సహాయపడతాయి. అనాసపండు ముక్కను నేరుగా ముఖంపై రుద్ది 20 నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. చర్మ ఆరోగ్యానికి అత్యంత సులభమైన మార్గం తగినంత నీరు తాగడం. రోజుకు కనీసం రెండు లీటర్ల నీరు తాగడం వల్ల శరీరం, చర్మం తేమను నిల్వ చేసుకోవడానికి సహాయపడుతుంది. దీంతో చర్మం తాజాగా, ఆరోగ్యంగా కనిపించే అవకాశాలు మెరుగుపడతాయి.

# పులిపిర్లను తగ్గించే ఇంటి చిట్కాలు.. ఇలా చేస్తే సమస్య తగ్గుతుంది..



చర్మంపై కనిపించే చిన్న గుండ్రని లేదా అండాకార పెరుగుదలలను పులిపిర్లు (వార్ట్స్) అంటారు. ఇది వైరల్ ఇన్‌ఫెక్షన్ కారణంగా ఏర్పడే సాధారణ చర్మ సమస్య. సాధారణంగా నొప్పి ఉండకపోయినా, కొన్ని సందర్భాల్లో అసౌకర్యం లేదా నొప్పిని కలిగిస్తాయి. చేతులు, కాళ్లు, జననేంద్రియాలపై కూడా ఇవి కనిపించే అవకాశం ఉంటుంది. వైద్యులు అవసరాన్ని బట్టి శస్త్రచికిత్స లేదా క్రయోథెరపీ వంటి చికిత్సలను సూచిస్తారు. అయితే ప్రారంభ దశలో కొన్ని సహజ పదార్థాలను ఉపయోగించడం వల్ల కొంతమందికి ఉపశమనం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అలోవెరా (కలబంద) జెల్‌ను నేరుగా పులిపిర్లపై రాయడం వల్ల ప్రయోజనం కలుగుతుందని పేర్కొంటున్నారు. కలబందలో ఉండే మాలిక్ యాసిడ్ చర్మాన్ని పునరుద్ధరించడంలో, వార్ట్‌లను క్రమంగా తగ్గించడంలో సహాయపడుతుంది.

### బేకింగ్ పౌడర్, యాపిల్ సైడర్ వెనిగర్..

బేకింగ్ పౌడర్‌ను ఆముదం నూనెతో కలిపి పేస్ట్‌లా తయారు చేసి రాత్రి సమయంలో వార్ట్‌లపై రాసి, బ్యాండేజ్‌తో కప్పాలి. ఇలా ప్రతిరోజూ చేయడం వల్ల వార్ట్ లు క్రమంగా తగ్గే అవకాశం ఉంటుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌లో ఉండే అసిటిక్ యాసిడ్ వార్ట్ ల కణజాలాన్ని క్రమంగా దెబ్బతీయడంలో సహాయపడుతుంది. కాటన్‌ను వెనిగర్‌లో ముంచి వార్ట్‌లపై ఉంచి, అతికే బ్యాండేజ్‌తో రాత్రంతా అలాగే ఉంచాలి. అరటి తొక్కలో ఉండే ఎంజైమ్‌లు చర్మాన్ని పునరుత్తేజపరచడంలో సహాయపడతాయి. అలాగే ఇందులో యాంటీ మైక్రోబియల్ గుణాలు కూడా ఉంటాయి. ప్రతిరోజూ కొన్ని నిమిషాల పాటు అరటి తొక్క లోపలి భాగంతో వార్ట్‌లపై నెమ్మదిగా రుద్దడం వల్ల ప్రయోజనం కలుగుతుంది. వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ అనే పదార్థం శక్తివంతమైన యాంటీ మైక్రోబియల్ గుణాలను కలిగి ఉంటుంది. ఇది బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, వైరస్‌లపై ప్రభావం చూపుతుంది. కొన్ని వెల్లుల్లి రెబ్బలను దంచి వార్ట్‌లపై రాయడం వల్ల వైరల్ ఇన్‌ఫెక్షన్ తగ్గడంలో సహాయపడతాయి. వెల్లుల్లిని ఆహారంలో భాగంగా తీసుకోవడం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

### పసుపు, లవంగ నూనె..

పసుపును కొద్దిగా నీటితో కలిపి పేస్ట్‌లా చేసి వార్ట్‌లపై రాసి సుమారు అరగంట తర్వాత కడిగేయాలి. పసుపులో ఉండే యాంటీ మైక్రోబియల్ గుణాలు ఇన్‌ఫెక్షన్‌ను తగ్గించడంలో, వార్ట్‌లను తొలగించడంలో సహాయపడతాయి. పసుపు వల్ల చర్మంపై ఏర్పడే పసుపు రంగును నిమ్మకాయ ముక్కతో నెమ్మదిగా రుద్ది తొలగించవచ్చు. లవంగ నూనెను వార్ట్‌లపై రాసి బ్యాండ్ ఎయిడ్‌తో కప్పాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల వార్ట్ లు తగ్గే అవకాశం ఉంటుంది. లవంగ నూనెలో ఉండే యూజెనిన్ అనే సమ్మేళనం యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉండి వైరస్ వ్యాప్తిని నిరోధించడంలో సహాయపడుతుంది. అయితే వార్ట్స్ పరిమాణం పెరగడం, నొప్పి, రక్తస్రావం లేదా జననేంద్రియాలపై కనిపించడం వంటి పరిస్థితుల్లో ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా చర్మవ్యాధి నిపుణులను సంప్రదించడం అవసరం.

# కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టిన అజింక్యా రహానే

- యూరోపియన్ టీ20 లీగ్‌లో ఆడనున్న అజింక్యా రహానే
- అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ జట్టుకు మార్క్యూ ప్లేయర్‌గా ఒప్పందం
- అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వెంటనే ఈ ప్రకటన
- ఆగస్టు 26 నుంచి ప్రారంభం కానున్న తొలి ఎడిషన్ ఈటీపీఎల్
- యూరప్‌లో క్రికెట్ అభివృద్ధికి ఇది కీలక ముందడుగు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజింక్యా రహానే తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వెంటనే, యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ (ఈటీపీఎల్)లో అడుగుపెట్టాడు. ఈ లీగ్ తొలి ఎడిషన్ కోసం అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ ఫ్రాంచైజీకి కీలక ఆటగాడిగా రహానే సంతకం చేశాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ యాజమాన్యం నేడు అధికారికంగా వెల్లడించింది. ఐసీసీ ఆమోదం పొందిన యూరప్‌లోని మొట్టమొదటి టీ20 లీగ్ ఇదే కావడం విశేషం. ఈ లీగ్ తొలి సీజన్ ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 20 వరకు జరగనుంది. ఇందులో గ్లాస్గో, అమ్‌స్టర్‌డామ్, ఎడిన్‌బర్గ్, డబ్లిన్, బెల్ఫాస్ట్, రోటర్‌డామ్ నగరాలకు చెందిన ఆరు ఫ్రాంచైజీలు పోటీ పడనున్నాయి. భారత్ తరఫున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌లు ఆడిన రహానేకు అపారమైన అనుభవం ఉంది. ఐపీఎల్‌లో 212 మ్యాచ్‌లు

ఆడి, ఇటీవలి సీజన్లలో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు నాయకత్వం వహించాడు. రహానే చేరికపై అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ వా హర్షం వ్యక్తం చేశాడు. రహానే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, వినయం జట్టుకు ఎంతో మేలు చేస్తాయని అన్నాడు. యూరప్‌లో క్రికెట్ అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం, ఒక విజయవంతమైన ఫ్రాంచైజీని నిర్మించడంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని రహానే పేర్కొన్నాడు. ఈ కొత్త లీగ్‌కు రహానే వంటి స్టార్ ఆటగాడి రాక మంచి బూస్ట్ ఇస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అదరగొట్టిన ప్రజ్ఞానంద.. సెయింట్ లూయిస్ టైటిల్ కైవసం

- సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టైటిల్ ప్రజ్ఞానంద సొంతం
- ఒక రౌండ్ ముందే విజేతగా నిలిచిన గ్రాండ్ మాస్టర్
- సిందరోవ్ డ్రాతో టైటిల్ ఖాయం
- 35 పాయింట్లకు గాను 23 పాయింట్లు సాధించిన ప్రజ్ఞానంద
- 50 వేల డాలర్ల బహుమతి
- గ్రాండ్ చెస్ టూర్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద మరోసారి తన సత్తా చాటాడు. అమెరికాలో జరిగిన గ్రాండ్ చెస్ టూర్ సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచాడు. ఒక రౌండ్ మిగిలి ఉండగానే టైటిల్‌ను ఖాయం చేసుకున్నాడు.

చివరి ప్రత్యక్ష పోరులో జవోఖిర్ సిందరోవ్‌తో ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. ఈ ఫలితంతో టైటిల్ అతని సొంతమైంది. మొత్తం 35 పాయింట్లకు గాను 23 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. సిందరోవ్ 22 పాయింట్లతో రెండో స్థానం దక్కించుకున్నాడు. వెస్లీ సో 20.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. లెవాన్ అరోనియన్ 19 పాయింట్లతో నాలుగో స్థానం సాధించాడు. ఈ విజయంతో ప్రజ్ఞానందకు 50 వేల అమెరికన్ డాలర్ల నగదు బహుమతి లభించింది. అలాగే గ్రాండ్ చెస్ టూర్‌లో 13 పాయింట్లు కూడా ఖాతాలో చేరాయి. ప్లేఆఫ్ అవసరం లేకుండానే నేరుగా టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ ఫలితంతో గ్రాండ్ చెస్ టూర్ మొత్తం ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకున్నాడు. ఫాబియానో కరువానా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. జులై 31 నుంచి ఆగస్టు 7 వరకు జరిగిన ఈ టోర్నీలో ప్రపంచంలోని 10 మంది అగ్రశ్రేణి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడ్డారు. ఐదు రోజుల పాటు జరిగిన పోటీల్లో ప్రజ్ఞానంద ఆరంభం నుంచే ఆధిక్యాన్ని కొనసాగించాడు. చివరి వరకు సిందరోవ్ గట్టి పోటీ ఇచ్చినా టైటిల్‌కు ఒక్క అడుగు దూరంలో ఆగిపోయాడు.

ఈ ఏడాది జూన్‌లో నార్వే చెస్ టోర్నమెంట్‌లోనూ ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. ఆ ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను గెలిచిన తొలి భారత ఆటగాడిగా నిలిచాడు.

# ఆసీస్ క్రికెట్ లెజెండ్ షేన్ వాట్సన్ పుస్తకమే స్ఫూర్తి.. ఆసియా గేమ్స్‌పై గురిపెట్టిన భారత ఆర్చర్



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్‌కు, ఆర్చరీకి పెద్దగా సంబంధం ఉండకపోవచ్చు. కానీ, స్ఫూర్తి అనేది ఎక్కడి నుంచైనా, ఎవరి నుంచైనా రావొచ్చు. భారత యువ ఆర్చర్ సాహిల్ జాదవ్ విషయంలో ఇదే నిజమైంది. ఆస్ట్రేలియా మాజీ ఆల్-రౌండర్ షేన్ వాట్సన్ రాసిన ఓ పుస్తకం నుంచి స్ఫూర్తి పొందిన సాహిల్, ఇప్పుడు ఆసియా క్రీడల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు.

సుమారు నెల రోజుల క్రితం, షేన్ వాట్సన్ రాసిన 'ది విన్నర్స్ మైండ్‌సెట్' అనే పుస్తకాన్ని చదవడం ప్రారంభించినట్లు సాహిల్ తెలిపాడు. "కేవలం మొబైల్ ఫోన్‌పై సమయం తగ్గించుకోవాలనే ఉద్దేశంతోనే ఆ పుస్తకం చదవడం మొదలుపెట్టాను. కానీ, పోటీల సమయంలో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, ఏకాగ్రతను ఎలా నిలుపుకోవాలి అనే విషయాలపై ఎంతో విలువైన జ్ఞానాన్ని పొందాను" అని సాయ్ మీడియాతో మాట్లాడుతూ సాహిల్ వివరించాడు. 25 ఏళ్ల సాహిల్ కెరీర్‌లో మానసిక దృఢత్వం, ఓపిక కీలక పాత్ర పోషించాయి. 19 ఏళ్ల వయసులో ఆలస్యంగా ఆర్చరీ ప్రారంభించిన అతను, తొలి జాతీయ పతకం సాధించడానికి ఏకంగా ఏడేళ్లు నిరీక్షించాల్సి వచ్చింది. ఈ కఠిన సమయంలో తన కుటుంబం అండగా నిలిచిందని, ఎన్నో త్యాగాలు చేసిందని సాహిల్ గుర్తుచేసుకున్నాడు. "ప్రతి సంవత్సరం చాలా స్వల్ప తేడాతో అవకాశాలు చేజార్చుకునేవాడిని. నాకంటే నా కుటుంబమే ఎక్కువ త్యాగాలు చేసింది. వాళ్ల మద్దతు వల్లే నేను నిలబడగలిగాను" అని పేర్కొన్నాడు.

ఏళ్ల తరబడి పడిన శ్రమకు ఫలితం దక్కింది. 2024లో సీనియర్ నేషనల్స్‌లో స్వర్ణం గెలిచి తొలి జాతీయ పతకాన్ని అందుకున్నాడు. ఆ తర్వాత 2025 వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో వ్యక్తిగత విభాగంలో విజేతగా నిలిచి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాడు. ఈ ఏడాది షాంఘైలో జరిగిన ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-2లో కాంస్య పతకం సాధించి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని నమోదు చేశాడు. "పతకం అందుకున్నప్పుడు నా తల్లిదండ్రులు, వారి త్యాగాలు, నా కష్టం గుర్తొచ్చాయి" అని సాహిల్ భావోద్వేగంగా చెప్పాడు.

వచ్చే నెలలో జపాన్‌లో ప్రారంభం కానున్న ఆసియా క్రీడల కోసం సాహిల్ తీవ్రంగా సాధన చేస్తున్నాడు. "భారత జట్టుకు ఎంపిక కావడమే ప్రపంచంలో అత్యంత కఠినమైన ప్రక్రియ. జట్టులో చోటు దక్కించుకున్నామంటే, ప్రపంచంలో అత్యుత్తమ క్రీడాకారులను ఓడించే సత్తా మనకుంది. కానీ కొన్నిసార్లు మనవాళ్లు ఒత్తిడికి గురై చిన్న చిన్న పొరపాట్లు చేసి పతకాలు కోల్పోతున్నారు. ఈ సమస్యను అధిగమించి 100 శాతం ప్రదర్శన ఇస్తే పతకాలు సాధించడం కష్టం కాదు" అని సాహిల్ విశ్లేషించాడు. ప్రస్తుతం కోల్‌కతాలోని సాయ్ నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శిక్షణ పొందుతున్న అతను, తన విజయాల వెనుక సాయ్ సహకారం ఎంతో ఉందని కృతజ్ఞతలు తెలిపాడు.

# టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్: బాహుబలి ఫార్ములా వర్సెస్ టైమ్ గ్యాప్!



ఆకట్టుకునే దుస్తులలో మలైకా అరోరా మనోహరమైన పోజులు

ప్రస్తుతం పరిశ్రమలో సీక్వెల్స్ -మల్టీ-పార్ట్ చిత్రాల హవా ఏ స్థాయిలో నడుస్తోందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కొన్ని సినిమాలు తక్కువ గ్యాప్ లోనే పార్ట్-2 తో వస్తుండగా.. మరికొన్ని భారీ ప్రాజెక్ట్‌ల కోసం దర్శక నిర్మాతలు ఏళ్ల తరబడి సమయం తీసుకుంటున్నారు. ఈ క్రమంలో టాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన -బాహుబలి- ఫార్ములాను ఇండస్ట్రీ ప్రముఖులు ఏ విధంగా ఫాలో అవుతున్నారో ఓసారి చూద్దాం.



**బాహుబలి ట్రెండ్‌కు శ్రీకారం:**

సీక్వెల్స్ ట్రెండ్‌కు అసలు సిసలు బీజం వేసిన దర్శకధీర ఎస్.ఎస్. రాజమౌళి. -బాహుబలి- మొదటి భాగాన్ని 2015లో విడుదల చేసి రెండో భాగం కోసం ఏకంగా రెండేళ్లు ప్రేక్షకులను వెయిట్ చేయించారు. ఆయన బాటలోనే ప్రశాంత్ నీల్ -కేజీఎఫ్- మొదటి పార్ట్‌ను 2018లో రిలీజ్ చేసి రెండో భాగాన్ని తీరిగ్గా 2022లో విడుదల చేశారు.

ఈ రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఇండస్ట్రీ రికార్డులను షేక్ చేయడంతో సెకండ్ పార్ట్‌లపై హైప్ విపరీతంగా పెరిగింది. క్వాలిటీ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఉండాలంటే ఈ మాత్రం టైమ్ గ్యాప్ తప్పట్లేదని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

**సుకుమార్- బోయపాటి రూట్**

-పుష్ప- విషయంలో దర్శకుడు సుకుమార్ కూడా సరిగ్గా ఇదే ఫార్ములాను అప్లై చేశారు. డిసెంబర్ 2021లో మొదటి భాగం రిలీజ్ చేస్తే పార్ట్-2 కోసం మూడేళ్లు సమయం తీసుకుని 2024 డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఇలా సుదీర్ఘ సమయం అనంతరం -పుష్ప ది రూల్- బాక్సాఫీస్ వద్ద అన్ని ఇండస్ట్రీ రికార్డులను కుదేలు చేసింది. అలాగే నందమూరి బాలకృష్ణ నటించిన -అఖండ- మొదటి భాగం డిసెంబర్ 2021లో రిలీజ్ అయితే.. దాని సీక్వెల్ కోసం బోయపాటి శ్రీను ఏకంగా నాలుగేళ్ల పాటు సమయం తీసుకున్నారు .

**భారీ సీక్వెల్స్ కోసం భారీ కసరత్తు**

ఇప్పటికే రిలీజ్ అయిన సినిమాలే కాకుండా ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న కొన్ని క్రేజీ సీక్వెల్స్‌కు కూడా ఇదే ఫార్ములా రిపీట్ అవుతోంది. -కల్కి 2-, -సలార్ 2-, -దేవర 2-, -ఓజీ- వంటి చిత్రాలకు కూడా దర్శకులు పార్ట్-1 నుంచి కనీసం రెండు నుంచి మూడేళ్ల గ్యాప్ తీసుకుంటున్నారు. మొదటి భాగం క్రియేట్ చేసిన ఇంపాక్ట్‌ను మించి రెండో భాగం ఉండాలన్న కసితో దర్శకులు స్క్రిప్ట్‌పై గట్టిగా కూర్చుంటున్నారు. ఎంత సమయం పట్టినా ఆడియన్స్ అంచనాలను పూర్తిస్థాయిలో రీచ్ అవ్వాలన్నదే దర్శకుల టార్గెట్ గా కనిపిస్తోంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965